

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక
డిసెంబరు 2023
వెల రూ. 20/-
పుటలు-56
SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 7
DECEMBER - 2023 Price Rs. 20/-
తిరుమల వైకుంఠఏకాదశి
శ్రీవారి స్వర్ణరథోత్సవం
(23-12-2023)

# తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి 'తెప్పోత్సవాలు'

## (22-12-2023 నుండి 28-12-2023 వరకు)


తిరుపతిలోని అలిపిరి సమీపంలో శేషాచలకొండలను ఆనుకుని **శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయం** ఉంది. శ్రీ కపిల మహర్షి తపస్సుకు మెచ్చి ఇక్కడ పరమశివుడు స్వయంభువుగా శ్రీకపిలేశ్వరస్వామిగా అవతరించాడు. ఇక్కడ పవిత్రమైన సరోవరం ఉంది. దీనిని 'కపిలతీర్థం'గా వ్యవహరిస్తారు. పవిత్రమైన కార్తిక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఇక్కడ పుణ్యస్నానాలు ఆచరిస్తారు.



ధనుర్మాసం నందు ఆర్ద్రనక్షత్రం సందర్భంగా ప్రత్యేకంగా ఇక్కడ ఉత్సవాలు జరుగుతాయి. శ్రీ కామాక్షి సమేత శ్రీకపిలేశ్వరస్వామివారి మరియు ఇతర పరివారదేవతలకు మార్గశిరమాసం పౌర్ణమినాటికి పూర్తి అగునట్లు ఐదు రోజులపాటు కపిలతీర్థ పుష్కరిణిలో ప్రదోషవేళలో **'తెప్పోత్సవాలు'** నిర్వహించబడుతుంది. తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి సన్నిధిన 27-12-2023న ఆర్ద్రదర్శన మహోత్సవం నిర్వహిస్తారు. తిరుపతి బస్టాండు, రైల్వేస్టేషన్ నుండి పది నిమిషాలలో ఈ ఆలయానికి చేరుకోవచ్చు.

| తేదీలు | వారము | ఉత్సవములు |
|---|---|---|
| 22-12-2023 | శుక్ర | శ్రీ విఘ్నేశ్వరస్వామివారికి, శ్రీచంద్రశేఖరస్వామివారికి |
| 23-12-2023 | శని | శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి |
| 24-12-2023 | ఆది | శ్రీ సోమస్కందస్వామివారికి |
| 25-12-2023 | సోమ | శ్రీ కామాక్షి అమ్మవారికి |
| 26-12-2023 | మంగళ | శ్రీ చండీశ్వరస్వామివారికి, శ్రీచంద్రశేఖరస్వామివారికి |





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-11వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** త్వమ్= నీవు; అశోచ్యాన్= శోకింపదగనివారిని గూర్చి; అన్వశోచః= శోకించుచున్నావు; చ= మఱియు; ప్రజ్ఞావాదాన్= ప్రజ్ఞావంతులవలె; భాషసే= పలుకుచున్నావు (కాని); గతాసూన్= ప్రాణములుపోయిన వారిని గూర్చియు; చ= మఱియు; అగతాసూన్= ప్రాణములు పోనివారిని గూర్చియు; పండితాః= పండితులు; న, అనుశోచంతి= శోకింపరు.

**భావం:** శ్రీభగవానుడు పలికెను–ఓ అర్జునా! శోకింపదగని వారి కొఱకై నీవు శోకించుచున్నావు. పైగా పండితుని (జ్ఞాని)వలె మాట్లాడుచున్నావు. పండితులైనవారు ప్రాణములుపోయిన వారిని గూర్చి గాని, ప్రాణములుపోని వారిని గురించిగాని శోకింపరు.

## తనువూ హరియే.. తలపూ హరియే

ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ దెలుపరో గురువులాల

తనువూ హరియే తలఁపూ హరియే
వినికి మనికియును విష్ణుఁడే
కనుఁగొను చూపులు కమలనాభుడే
యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో

లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁ డే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నుండువాఁడనో

వెనకను కృష్ణుఁడే వెస ముందచ్యుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగు నాస్వతంత్ర మది యేడనున్నదో!

(ఆధ్యాత్మిక సంకీర్తన- 2-463)





"శరీరం గోవిందుడు. ఆలోచన ముకుందుడు. వినికీ, మనికీ విష్ణువే. చూచేచూపులు కమలామనోహరుడే. ఇక హరికి భిన్నంగా జీవునికి శక్తి ఎక్కడిది? లోకముల లోపల, వెలుపల కేశవుడే యున్నాడు. జీవుడు చేసే కర్మము, వాక్కు కూడ హరియే. చైతన్యమంతా నారాయణుడే. ఇక 'నే' ననే మఱియొక డెక్క డున్నాడు? వెనుక కృష్ణుడు, ముందు అచ్యుతుడున్నాడు. ఆదిమధ్యాంతములందును ఆ గోవిందుడే యున్నాడు. సకలమును శ్రీవేంకటేశమయమే. నన్ను వేఱుగా నెచ్చట చూచుట లేదు. ఇక నాకు స్వాతంత్ర్య మెక్కడిది? అంటే 'జీవుడు' స్వతంత్రుడు కాడు, భగవత్పరతంత్రుడే." అని అన్నమయ్య తన ఆధ్యాత్మికతను చాటి చెప్పాడు.

ఉపనిషద్వాక్యం

# ఏకో దేవః సర్వభూతేషు గూఢః

**(సమస్త ప్రాణికోటి యందు ఉన్నది ఒకే దైవము)**

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

భారతీయ సనాతన సిద్ధాంతమిది. 'ప్రకాశ స్వరూపుడు' అనే అర్థం దైవశబ్దానికి ఉంది. ఏది మూలమో అది రహస్యంగా ఉంటుంది. స్థూలదృష్టికి గోచరించదు. ఎట్లనగా, వృక్షం కంటికి కనబడుతుంది– వేరు కనబడదు. భవనం దృశ్యమౌవుతుంది– పునాది ప్రత్యక్షం కాదు. భవననిర్మాణపద్ధతి తెలియని మూర్ఖుడు పునాది లేదని వాదించినా, ఉంటే చూపించమని ఘోషించినా వీలుపడదు.

అలాగే విద్యుత్తు సైతం కంటికి కనబడనిదే. కానీ బల్బు, ఫ్యాన్‌వంటి వాటి ద్వారా దాని ఉనికిని గుర్తించగలం. భౌతిక జగత్తుకి సంబంధించిన అంశాలలోనే ఇన్ని అప్రత్యక్షాలు ఉన్నాయి. వాటిని తగిన విజ్ఞానశోధనతో గుర్తించగలం.

అలాగే పంచభూతాలకీ, వాటితో కూడిన స్థావర జంగమాలకీ కూడా ఒకే చైతన్యం ఆధారం.

భిన్నత్వమంతా జగత్తులో ఉన్నా, చైతన్యంలో మాత్రం 'ఏకత్వమే'. ఒకే విద్యుత్తు– పంకాల్లో గాలిలాగా, బల్బులో వెలుగులాగా, మరో పరికరంలో శబ్దంగా వ్యక్తమైనట్లు, ఒకే చైతన్యం వివిధ ఉపాధులలో వివిధ విధాలుగా వ్యక్తమౌతుంది.

ఈ దైవం ఒక్కటే. కానీ శక్తులు అనేకంగా ప్రకృతిలో వ్యాపించి ఉన్నాయి. వాటన్నిటి అంతర్యామి మాత్రం ఆ ఏక దైవమే. 'ఏక' అనే శబ్దమే భారతీయ ఉపాసనా సంప్రదాయాలకు, తాత్త్విక జ్ఞానయోగాది మార్గాలకు సమన్వయాన్ని సూచిస్తుంది. ఎవరు ఎలా సాగినా ఆ "ఏకదేవతోపాసకులే".

ఈ దేశంలో నిరక్షరాస్యుణ్ణి సైతం "దేవుడెక్కడున్నాడ"ని అడిగితే, "అంతటా ఉన్నాడ"ని వెంటనే సమాధానమిస్తాడు. అంతగా వేదాంతసత్యం ఈ భారతజాతి నరనరాల్లో జీర్ణించుకుపోయింది.

**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ॥**

"మణులహారంలో దారంలా ఈ సర్వజగత్తుకీ నేనే ఆధారం" అని శ్రీకృష్ణుని వచనం.

అత్యంత శక్తి ఎప్పుడూ నిగూఢంగానే ఉంటుంది. సూక్ష్మంగానే భాసిస్తుంది.

భూమికంటే నీరు సూక్ష్మం– దానికన్నా అగ్ని సూక్ష్మం. అలా క్రమంగా– వాయువు, ఆకాశం, ప్రాణం.... ఒకదానికంటే ఒకటి సూక్ష్మాలు. వాటికంటే సూక్ష్మాతిసూక్ష్మం– "దైవం". దానినే 'ఆత్మ' అని అన్నారు. ఇది దేశ–కాల–వస్తు పరిమితులలో ఇమిడినట్లుగా చూస్తే 'జీవభావం'. ఆ పరిమితిని దాటి దర్శిస్తే 'పరమాత్మభావం'.

ఉదాహరణకు– గంగానది నీరు కడవతో పట్టి తెస్తే కడివెడు నీళ్ళు అంటాం. అదే 'జీవభావం'. ఆ నీళ్లనే ఇది 'గంగాజలం' అనవచ్చు. అంటే దేహాదులలో ప్రకాశించే 'దైవ భావం'. ఈ దర్శనం సమగ్రం.

భారతీయ వేదాంత దర్శనాలకు మూలసూత్రం ఈ **"ఏకత్వమే"**. ఈ సూత్రంతో ఈ దేశపు దర్శనాలన్నింటినీ సమన్వయించే మహోదాత్త ఉపనిషన్మతాన్ని విశ్వానికి అందించారు మహర్షులు.

**॥ఓం తత్సత్॥**



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 డిసెంబరు, 2023 సంచిక : 07



**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| **ప్రత్యేకవ్యాసాలు** | | |
| భక్తిమాలతో పరవశింప జేసిన ఓ పూబాల! | శ్రీమతి పి. రమాదేవి | 07 |
| తన్నో షణ్ముఖః ప్రచోదయాత్ | శ్రీమతి కె. విజయలక్ష్మి | 14 |
| వాల్మీకి మదిలో... అయోధ్య | డా॥ కె. రామకృష్ణ | 21 |
| వైకుంఠ ఏకాదశి | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 24 |
| సకల కార్యార్థ సిద్ధిప్రదం 'హనుమద్వ్రతం' | డా॥ ఆకెళ్ళ సూర్యకనకదుర్గ | 33 |
| శుశ్రూష | శ్రీమతి ఈ. విజయలక్ష్మి | 36 |
| **ధారావాహికలు** | | |
| సందేహాలు-సమాధానాలు | డా॥ కుప్పా వేంకటకృష్ణమూర్తి | 10 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె. సర్వోత్తమరావు | 11 |
| శ్రీ కృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 12 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| 108 దివ్యదేశాలు- 'తిరువెళ్లియంగుడి' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| **వేద వాఙ్మయం** | | |
| ఉపనిషద్వాక్యం - ఏకో దేవః సర్వ భూతేషు గూఢః | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 04 |
| వేదస్వరూపం- శ్రీ రామాయణం | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 17 |
| భారతీయ గణితం | ఆచార్య వి. రమేష్ బాబు | 38 |
| **యువత** | | |
| యువతకు స్ఫూర్తి 'భగవద్గీత' | ఆచార్య ఎ. సచ్చిదానందమూర్తి | 31 |
| **మనదేవాలయాలు** | | |
| మోక్షధామం 'అయోధ్య' | డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు | 40 |
| **శ్రీవేంకటేశ్వరలీలలు** | | |
| తోడు | శ్రీ ఎ.వి. సుందర రావు | 43 |
| **ఆయుర్వేదం** | | |
| ఆరోగ్య పరిరక్షణకు 'మినుములు' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| **బాల వికాసం** | | |
| ఆలివంక వారు ఆత్మబంధువులు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 46 |
| గో జన రక్షణార్థమై గిరి నొక కేల నెత్తనట (భాస్కర శతకం) | డా॥ పల్లేరు వీరాస్వామి | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- కీ.శే.మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| గాడిద కూడా గురువే! (చిత్రకథ) | కథ: శ్రీమతి ఎ.శ్రీనిధి<br>చిత్రాలు: శ్రీమతి టి.కమలక్కణ్ణన్ | 48 |
| బాలవినోదం | | 50 |
| బ్రాహ్మణుడు-పేలపిండి (బాలనీతి) | శ్రీమతి దినవహి సత్యవతి | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : తిరుమల వైకుంఠ ఏకాదశి శ్రీవారి స్వర్ణ రథోత్సవం
వెనుకచిత్రం : గీతోపదేశం చిత్రం



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# శ్రీహరిని ఆరాధించే మాసమే 'ధనుర్మాసం'

'మాసానాం మార్గశీర్షోஉహం' – మాసములన్నింటిలోనూ మార్గశిరము శిరోభూషణం. ఈ మాసం మహావిష్ణువునకు ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసంలో ఆచరించే పూజలతో బాటూ, ఉపవాసాలు సకల శుభాలను కలుగజేస్తాయి. ఇంకా ఈ మాసంలోనే కుమారస్వామి, కాలభైరవుడు, త్రిమూర్త్యాత్మకాంశ సంభూత దత్తాత్రేయునితోబాటూ, శ్రీమద్భగవద్గీత అవతరించడం, వైకుంఠఏకాదశి, హనుమద్వ్రతం రావడం విశేషం.

శ్రీవిద్యాశాస్త్రం ఈ మాసం 'పుష్టి'(బలం) నిచ్చే కాలంగా పేర్కొనింది. వసంతం చిగురింతతో మొదలైనా, హేమంతం ఫలాన్నిచ్చే కాలం, కనుక దీనికి ప్రాధాన్యం. ఈ ఋతువులో వచ్చే రెండుసంక్రమణాలకీ ప్రాముఖ్యం ఉంది. సూర్యుడు ఆయారాశుల్లోకి ప్రవేశించే సమయాన్ని 'సంక్రమణం' అంటారు. మొదటిది 'ధనుస్సంక్రమణ'మైతే, రెండవది 'మకరసంక్రమణం'. మన సంవత్సరకాలాన్ని దేవతలకు ఒక రోజుగా చెబుతారు. ఈ దినానికి 'తెల్లవారు ఝాము'లాంటిది ధనుస్సంక్రమణంనుండి వచ్చే ఒక నెలకాలం. 'సూర్యోదయం'వంటిది మకరసంక్రమణం, అని పురాణోక్తి.

సూర్యుడు ధనూస్సురాశిలో ప్రవేశించడంతో 'ధనుర్మాసం' మొదలవుతుంది. ధనుర్మాసం శ్రీమహావిష్ణువు ఆరాధనకు అత్యంత విశేషమైన మాసం. 'ధనువు' అంటే యోగశాస్త్రం ప్రకారం– 'వెన్నెముక' (మేరువు) అని అర్థం. అంటే సాధనకు సంకేతం 'విల్లు'(ధనుస్సు). సాధనకు అనువైన సమయం బ్రాహ్మీమయముహూర్తం.

ధ్యానమే 'ధనుర్మాసవ్రతం'. ఈ వ్రతాన్ని ఆచరించింది భట్టనాథుల (పెరియాళ్వార్) దత్తపుత్రిక 'గోదాదేవి'(ఆండాళ్). ఆండాళ్ భూమాత అవతారం. ధనుర్మాసం 30 రోజులూ గోదాదేవి బ్రాహ్మీమయ ముహూర్తంలో మేల్కొని, తన తోటి చెలులను నిద్రలేపి, అందరూ కలసి స్నానమాచరించి, కృష్ణ కీర్తనతో– కృష్ణ ధ్యానంతో, ఆయనతో కలసిపోవడమే లక్ష్యంగా సాగించిన 30 పాశురాల గీతికావ్రతమే "తిరుప్పావై" (శ్రీ వ్రతం లేదా మేలినోము). తోటి చెలులను మేల్కొల్పడం అంటే– మనలోని భక్తిభావాలను, సాత్త్విక ప్రవృత్తులను మేల్కొలిపి, ఒకటిగా చేయాలి. వారందరితో కలసి స్నానమాచరించడం అంటే– భగవద్భావనలో, సంకీర్తనా వాహినిలో మనలోని భావాలన్నీ మునకలు వేయాలి. ఓలలాడాలి. ఆండాళ్ళమ్మ పాటలను పరిశీలిస్తే– జాగృతమైన భావాలన్నీ కలసి, దేహమనే దేవాలయంలో చైతన్యం పొందిన పరమాత్మ తాదాత్మ్యం చెందడమనే సాధనక్రమం, సిద్ధి కనిపిస్తాయి. తిరుమల స్వామివారి ఆలయంలో కూడా ఈ మాసంలో గోదాదేవి కీర్తించిన "తిరుప్పావై"ను నెలరోజులు "సుప్రభాతా"నికి బదులుగా అనుసంధానం చేయడం పరిపాటి.

ఇక సమస్తమానవాళికి వ్యక్తిత్వవికాసాన్ని కల్గించే కల్పవృక్షం "భగవద్గీత". సాక్షాత్తు శ్రీకృష్ణభగవానుని నోటివెంట వెలువడిన అమృతవాక్కులే 'గీత'. ఇవి మార్గశిరశుద్ధ ఏకాదశి నాడే ఆవిష్కృతమైందని పెద్దలమాట. ఈ ఏకాదశినాడు 'గీతాపారాయణం' చేయడం లేదా 'గీతాసారాన్ని' అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం శ్రేయోదాయకం.

ఈ ఏకాదశినాడే "ముక్కోటి ఏకాదశి" లేదా "వైకుంఠ ఏకాదశి" పర్వదినం కూడా రావడం ముదావహం. తిరుమల శ్రీవారి ఆలయంలో సంవత్సరంలో ఈ పర్వదినం నాడు తెరువబడే వైకుంఠద్వార ప్రవేశం భక్తిముక్తిప్రదాయకం. తిరుమల తిరుపతి దేవస్థానములవారు విశేషంగా భక్తులను అనుగ్రహించడానికై 'వైకుంఠ ద్వారా'న్ని 10రోజులు తెరచి ఉంచడం సంతోషదాయకం. ఈ సదవకాశాన్ని భక్తులందరూ వినియోగించుకోవాలి.

ఈ విధంగా "మార్గశిరం"లో వచ్చే పండుగలు, పర్వదినాల వైశిష్ట్యాన్ని, ప్రాశస్త్యాన్ని గ్రహించి, అనువైన వాటిని సాధనచేసి ఆచరిద్దాం. తరిద్దాం.

"ఓం నమో వేంకటేశాయ"



# భక్తిమాలతో పరవశింపజేసిన ఓ పూబాల!

- శ్రీమతి పి.రమాదేవి

## బంగారుకాలం-మార్గశీర్షమాసం...!

శ్రీవైష్ణవసంప్రదాయంలో మార్గశిరమాసం ప్రతి రోజూ ఒక పర్వదినమే! ఎందుచేతనంటే "పరమాత్మకు అత్యంత ప్రీతికరమైన మాసం మార్గశిరమాసం" అని భగవద్గీతలో విశదీకరింపబడింది.

భగవంతునికి అత్యంత ప్రీతికరమైన మార్గశీర్ష మాసం అనేకవిధాలైన మాహాత్మ్యములను కలిగియుంది. సత్కార్యాల గురించి ఆలోచించే సాత్త్వికసమయం 'బ్రాహ్మీ ముహూర్తం'. అంటే మకర సంక్రమణానికి ముందున్న సమయం, మార్గశిరమాసం బ్రాహ్మీముహూర్తం విశేష మైనదిగా పేర్కొనవచ్చు.

మానవుని దైవీభూతశక్తులు కూడా ఉత్తరాయణ పుణ్యకాలంలోనే మేల్కొంటాయి. సంవత్సరంలో మానవులు జీవితాన్ని చరితార్థం చేసుకునే పనులకు అనువైన సమయం 'మార్గశీర్షం'. అంచేత గీతాచార్యుడు 'మాసానాం మార్గశీర్షోஉహం' అని మార్గశీర్షమాస వైశిష్ట్యాన్ని విశదీకరించాడు.

ప్రతినెలా సూర్యభగవానుడు ఒక్కొక్కరాశిలో ఉంటాడు. ఒకరాశి నుండి మరొకరాశిలోనికి ప్రవే శించడాన్నే **'సంక్రమణం'** అంటారు. అది మహాపుణ్య దినం. వృశ్చికరాశి నుండి ధనూరాశిలోనికి సూర్యుడు ప్రవేశించిన కాలమే **'ధనుస్సంక్రమణం'**. తమిళులు ఈ క్షణంనుండి మకరసంక్రమణంవరకు అనగా 30 రోజులు **'ధనుర్మాసం'**గా పిలుస్తూ **'శ్రీవ్రతాన్ని'** ఆచరిస్తారు. దీన్నే **'కాత్యాయనీ'** వ్రతమనియు; **'తులసీమాత'** వ్రతమనియు; **'మార్గశీర్ష'** వ్రతమనియు; **'మార్గళీ'** వ్రతమనియు అంటారు.

అయితే మన ఆంధ్రులు చాంద్రమానాన్ని బట్టి **'మృగశిర'** నక్షత్రం ఏ పున్నమిరోజున ఉంటే దాన్ని **'మార్గశిర'** మాసమని పిలుస్తారు. అలాగే **'పుష్యమి'** నక్షత్రం ఉన్న పున్నమి గల మాసాన్ని **'పుష్యమాసం'** అంటారు. ఈ విధంగా ఖగోళసంబంధమైన చాంద్రమాన, సౌరమానమాసాలకు సంబంధించిన విషయాలే కనుక, మార్గశిరమాసం ప్రకృతిలోని జీవుల కార్యకలాపాలపై ప్రభావం చూపుతుంది.

అభివృద్ధికి, అభ్యుదయానికి యుక్తమైనకాలం మార్గశీర్షం. సస్యశ్యామలమై ఫలపుష్పభరితమైన ప్రకృతివలె గోపికల మనఃక్షేత్రం కూడా శ్రీకృష్ణప్రేమతో సస్యశ్యామలమైన శ్రీకృష్ణ సమాగమాన్ని మధురఫల రసాస్వాదనకు ఉద్యుక్తుల్ని చేసి, తరింపచేసిన తమో రహితమైన బంగారుకాలం మార్గశీర్ష సమయం. ఇదే జీవులకు నిజమైన సుప్రభాతం!

మనకు ఉత్తరాయణం, దక్షిణాయణం అని రెండు పుణ్యకాలాలున్నాయి. ఇందులో ఉత్తరాయణ పుణ్యకాలం దేవతలకు పగలుగాను, దక్షిణాయన పుణ్యకాలం వారికి రాత్రి గాను పరిగణింపబడతాయి. ఇందులో మార్గశీర్షమాసం ఉత్తరాయణ పుణ్యకాలానికి ఉషఃకాలమని చెబుతారు పెద్దలు. అంటే బ్రాహ్మీముహూర్తుమన్న మాట. కావుననే మార్గశీర్షమాసం ఇంత ఆధిక్యతను సంతరించుకుంది.

భూలోకంలో ఉన్న 108 విష్ణుక్షేత్రాలలో **"శ్రీవిల్లి పుత్తూరు"** ఒకటి. అక్కడ **విష్ణుచిత్తుడనే** విష్ణుభక్తుడుండేవాడు. ఈయనకు 'పెరియాళ్వార్' అని, 'భట్టనాథులు' అని నామాంత రాలున్నాయి. ఈయన *విష్ణురథాంశ (గరుడాంశ)* మందు జన్మించాడు. పన్నిద్దరాళ్వారుల్లో వీరు ఒకరు.

ప్రతిరోజూ వీరు పరమభోగ్యమైన పుష్పమాలల్ని శ్రీవిల్లి పుత్తూరు (శ్రీధన్విపురం) నందు వేంచేసి ఉండే వటపత్రశాయికి సమర్పించేవారు.

నలనామ సంవత్సరం కర్కాటక (ఆషాఢ) మాసంలో (చారిత్రకుల అంచనా సుమారు 776 సం॥) పూర్వఫల్గుణీ నక్షత్ర యుక్త శుభసమయంలో విష్ణుచిత్తులవారికి తులసీవనంలో అమితమైన తేజస్సుతో ప్రకాశిస్తున్న ఒక బాలిక లభించింది.



ఆ శిశువును విష్ణుచిత్తులవారు తీసుకుని అల్లారు ముద్దుగా పెంచసాగారు. ఆ శిశువును **'కోదై'** (అంటే పూమాల) అను పేరు పెట్టారు. ఆ నామమే క్రమంగా **'గోదా'** మారింది.

గోదా బాల్యంనుండి సహజపరిమళంతో తులసివలె (తులసి అనగా జీవులందు కలుగు సమస్తరోగాల్ని నశింప జేయునది) జ్ఞాన-భక్తి-వైరాగ్యాలుకలిగి భగవద్గుణములందు ఆసక్తురాలై ఉండేది. షోడశకళలతో దినదిన ప్రవర్ధమానమై పూర్ణచంద్రునివలె ప్రకాశిస్తుండేది. ఈమె తన తండ్రి ద్వారా శ్రీరంగనాథుని రూపరేఖావిలాసాలను వింటూ, ఆ స్వామినే తన ప్రాణనాథునిగా పొందవలెనని నిర్ణయించుకుంది.

ఆ శ్రీకృష్ణపరమాత్మే నేటి శ్రీరంగనాథునిగా తలచి ప్రేమించింది. ఆ స్వామికే తనను అంకితం చేసుకుంది గోదా దేవి. విష్ణుచిత్తులవారు వటపత్రశాయికి సమర్పించే పుష్పమాలి కల్ని తాను ధరించాలనే కోరిక మనస్సులో కల్గి, తన తండ్రి తయారుచేసిన ఆ పుష్పమాలికల్ని ఆయనకు తెలియకుండా ప్రతి రోజూ తాను మెడలో అలంకరించుకుని తన ప్రతిబింబాన్ని నూతిలో చూచుకొని ఆనందించేది. ఒకనాడు విష్ణుచిత్తులవారు తాను కట్టిన పుష్పమాలను స్వామి కైంకర్యం కోసం తీసుకొని వెళ్ళగా, అందులో ఒక తలవెంట్రుక ఉండుటను గమనించిన అర్చకస్వాములవారు విష్ణుచిత్తులవార్ని మందలించటం జరిగింది. బాధతో కుమిలిపోతూ దిగులుతో ఉన్నారు విష్ణుచిత్తులవారు.

ఒకరోజున గోదాదేవి యథావిధిగా చేస్తున్న పనిని చూచి విష్ణుచిత్తులవారు మందలించారు. కాని ఆ రోజున కట్టిన మాలల్ని ఆలయానికి తీసుకొని వెళ్లక బయటపడేశారు. ఆరోజు రాత్రి విష్ణుచిత్తులవారికి మరియు ఆలయ అర్చకస్వాములకు శ్రీరంగనాథుడు స్వప్నంలో కన్పించి, "గోదాదేవి ముందుగా ధరించిన మాలల్ని మాత్రమే నేను ప్రేమతో స్వీకరిస్తాను" అని చెప్పారు స్వామి. ఆనాటినుండి ఆండాళ్ తల్లి (గోదాదేవి)కి **"చూడిక్కొడుత్త నాచ్చియార్"** అని, **"ఆముక్తమాల్యద"** అనే పేరు కల్గింది.

## ఉపనిషత్తులసారమే 'తిరుప్పావై'

సాక్షాత్ భగవంతునిచే లోకానికి ప్రసాదింపబడిన 108 ఉపనిషత్తుల సారమగు 'తిరుప్పావై' గోదాదేవి రచించి, ప్రవచించిన దానిని పఠించి, అనుష్ఠించి భవదుఃఖాన్ని పోగొట్టుకొనుట ప్రతి ఒక్కరి కర్తవ్యం.

'తిరుప్పావై'–'తిరు' అనగా 'శ్రీ' అని; 'పావై' అనగా 'పాట' లేక 'వ్రతం' అని అర్థం. తిరుప్పావై అంటే తమిళంలో 'శ్రీగీతం' అని అర్థం. దీనికి "సంపత్కరమైన చంధస్సు" అని మరో అర్థం కూడా ఉంది. ఛందోబద్ధమైన ఈ కావ్యంతో ధనుర్మాసం నెలరోజులు శ్రీమన్నారాయణుని ఆరాధిస్తే కోరికలు తప్పక నెరవేరుతాయని ఆండాళ్‌తల్లి ప్రబోధించింది. ఈ తిరుప్పావైనే 'శ్రీవ్రతం' అని; 'దివ్యవ్రతం' అని, 'సిరినోము' అనీ పిలుస్తుండటం శ్రీవైష్ణవుల్లో పరిపాటి.

ఈ ధనుర్మాసం రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది 'రాపత్తు' అంటే రాత్రివేళ ఆచరించే వ్రతం. అనగా మొదటిపాశురం నుండి పదిహేనవ పాశురం వరకు తెల్లవారు ఝామునే అనగా సూర్యోదయానికి పూర్వమే పూజలు, పారాయణలు, నివేదనలు పూర్తి చేస్తారు.

తర్వాత 'పాపత్తు' అంటే పగటివేళ ఆచరించేవ్రతం. అనగా సూర్యోదయం అయిన తర్వాతనే పూజలు, పారాయణలు, నివేదనలు పూర్తి చేస్తారు. పదహారవపాశురం నుండి ముప్పది పాశురం వరకు పగటిపూటే వ్రతాన్ని ఆచరిస్తారు.

## శ్రీగోదారంగనాథుల 'కల్యాణ'వైభోగం

శ్రీరంగనాథుడు గోదాదేవితో శ్రీరంగంలో వివాహం చేయమని విష్ణుచిత్తుని ఆజ్ఞాపిస్తాడు. బంధుమిత్రాదులతో గోదాదేవిని నవవధువుగా అలంకరించి, పరమాత్మ పంపిన ముత్యాలపల్లకిలో శ్రీరంగధామానికి తీసుకువచ్చారు.

భూదేవి అంత అరుగు, ఆకాశమంత పందిరితో వివాహవేదికను ఏర్పాటు చేశారు. సర్వసేనాధిపతి విష్వక్సేనుడు



తాను ముందర వెడుతూ, పెండ్లివారినందరినీ వరుసలు తీర్చి తన వెంట తీసుకువచ్చాడు. బ్రహ్మాదిదేవతలు తమ తమ వాహనాలపై శ్రీరంగనాథుని చెంతకు చేరారు. సమస్త దేవతల సమక్షంలో విష్ణుచిత్తుడు షోడశోపచారములతో, వేదమంత్రోచ్చారణల మధ్య శ్రీరంగనాథునికి గోదాదేవినిచ్చి వివాహం గావించాడు.

## ఫలశ్రుతి!!

'శ్రీవ్రతాన్ని' విన్నవారు, కన్నవారు కూడా వ్రతఫలంగా వారి దారిద్ర్యబాధలన్నీ తొలగి, అష్టైశ్వర్యాలు కలిగి సౌఖ్యాలను పొందుతారు.

'ఓమ్ గోదాయై నమః'

### 2024, జనవరినెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | ఆంగ్లసంవత్సరాది |
| 14 | భోగి |
| 15 | మకర సంక్రాంతి |
| 16 | కనుమ |
| 25 | శ్రీరామకృష్ణతీర్థముక్కోటి |
| 26 | భారతగణతంత్ర దినోత్సవం |

**ప్ర) 'ఉపనిషత్తు-వేదాంతము' ఈ రెండు పదాల భావన ఒక్కటేనా?**

**జ)** ఈ రెండూ తత్త్వసిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఒక గ్రంథానికి గల రెండు పేర్లు మాత్రమే. వ్యాసభగవానుడు వేదశాఖల విభాగం చేసేటప్పుడు, ప్రతిశాఖ చివర లోనూ భగవత్తత్త్వాన్ని చర్చించే మంత్ర భాగాలను సమకూర్చాడు. ఈ భాగాలు పరమాత్మతత్త్వానికి సన్నిహితంగా ఉన్నాయి. గనుక, వాటిని **'ఉపనిషత్తులు'** అన్నారు. అవి వేదశాఖల అంతాలలో ఉన్నాయి. గనుక **'వేదాంతాలు'** అన్నారు. అవి రెండూ ఒక్కటే!

**ప్ర) మనస్సును 'అంతర్ముఖం' చేయాలంటే ఏమి చేయాలి?**

**జ)** 1)ముందుగా పరిమిత సాత్త్వికాహారం సేవించాలి 2)లౌకిక వ్యవహారాలు కోరికలు తగ్గించుకోవాలి 3) సద్గ్రంథపఠన, ఇష్టదైవతారాధన పెంచుకోవాలి4)వైరాగ్యం అలవరుచుకోవాలి 5)యోగప్రక్రియలలో 'ధ్యానా'భ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి 6)అన్నింటికీ మించి మనస్సు అంతర్ముఖం కావటం లేదే అనే ఆరాటాన్ని తగ్గించుకోవాలి. అదే సమయంలో లక్ష్య సిద్ధికై అకుంఠిత ప్రయత్నాన్ని కొనసాగించాలి. పైన చెప్పిన వాటిలో నెగ్గిన వారికే 'అంతర్ముఖత్వం' సాధ్యమవుతుంది.

**ప్ర) రామాయణంలో విశ్వామిత్రమహర్షి శ్రీరాముడికి 'బల-అతిబల' అనే విద్యలు (మంత్రోపదేశం) నేర్పాడని ఉంది కదా! వాటి వివరాలు ఏమిటి?**

**జ)** అవి ధనుర్వేదాంగమైన మంత్ర శాస్త్రానికి సంబంధించిన రహస్యాలు. వీటిని అనుష్ఠించటం వల్ల నిద్ర, ఆహారము లేకపోయినా కూడా ఆ వ్యక్తికి

# సందేహాలు



# సమాధానాలు

- డా॥ కుప్పా వేంకటకృష్ణమూర్తి

అలసట, నీరసం, నిద్రవంటివి ఉండవని రామాయణంలోనే ఉంది.

**ప్ర) 'ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులు' - ఈ పదాల అర్థవివరణ ఏమిటి?**

**జ)** 'చతుర్విధా భజంతే మాం
జనా స్సుకృతినోఽర్జున।
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ
జ్ఞానీ చ భరతర్షభ॥'

అని శ్రీమద్భగవద్గీత 7వ అధ్యాయంలో 16వ శ్లోకంలో శ్రీకృష్ణుడు తెలియజేశాడు. భగవంతుణ్ణి భజించే వారిలో నాలుగురకాల వారుంటారు.

**1)ఆర్తులు-** అంటే రోగాలవంటి కష్టాలను తట్టుకోలేక బాధతో భగవంతుణ్ణి భజించే వారు. ఉదా॥గజేంద్రమోక్షకథలోగజరాజు.

**2)జిజ్ఞాసువులు-** అంటే ఆధ్యాత్మిక తత్త్వం తెలుసుకోవాలనే తపనతో భగవంతుణ్ణి ఆరాధించేవారు. ఉదా॥వశిష్ఠాదిమహర్షులు.

**3)అర్థార్థులు-** అంటే వివిధ కోరికలతో భగవంతుణ్ణి ప్రార్థించేవారు. ఉదా॥పాండవాదులు.

**4)జ్ఞానులు-** శాస్త్రజ్ఞానం కలిగి, ఆ జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలని తపన పడేవారు. ఉదా॥కుచేలాదులు.

ఈ నాలుగు రకాలవారు పుణ్యాత్ములే అని పై శ్లోకానికి తాత్పర్యం.

**ప్ర) 'అష్టసిద్ధు'లనగా ఏమి? వాటిని సాధించే విధానాలు ఏ యే గ్రంథాల్లో ఉన్నాయి?**

**జ)** అణిమా మహిమా చైవ
గరిమా లఘిమా తథా।
ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం
వశిత్వం చాష్ట భూతయః॥

అని 'అమరకోశ'కారుడు సంగ్రహంగా చెప్పాడు. వాటి వివరణ ఈ విధంగా చెప్పవచ్చు.

1)'అణిమ' అంటే అణువంత చిన్న ఆకారాన్ని పొందుట. 2)'మహిమా' అంటే కొండంత పెద్దగా మారడం. 3)'గరిమా' అంటే కొండంత బరువు పెరగడం. 4)'లఘిమా' అంటే దూదిలాగా తేలికై పోవడం. 5)'ప్రాప్తిః' అంటే సంకల్ప మాత్రంచేత కోరుకున్న వస్తువులు పొందటం. 6)'ప్రాకామ్యం' అంటే యథేచ్ఛా సంచారశక్తి 7)'ఈశత్వం' అంటే ఈశ్వరుడంత గొప్పగా ఉండటం. 8)'వశిత్వం' అంటే ఇంద్రియజయం.

వీటి సాధన ప్రక్రియలను- పతంజలి యోగసూత్రాలలోను, హఠయోగప్రదీపక లోను, విజ్ఞానభైరవతంత్రాది తంత్రగ్రంథాల్లోనూ ప్రస్తావించారు. ఎక్కడైనా సరే, రహస్యాలను గ్రంథాలలో ఉంచారు. అవి గురుముఖంగా రావలసిందే!

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

భారతీయులు 'జలప్రాధాన్యం' గుర్తించినవారు. ప్రత్యేకించి ప్రకృతిప్రసాదాలైన 'జలవనరుల' పట్ల ఆరాధన గలవారు. కొండల్లో 'జలప్రవాహాలను' భగవంతుని కరుణాప్రవాహంగా ఆరాధించినవారు. వీటినే పుణ్యతీర్థాలన్నారు. ఆ యా తీర్థాలలో తానమాడేవారు రకరకాల ఆవేదనల నుండి విముక్తులవుతారని కథలద్వారా సామాన్యులకు విశ్వాసం కలిగించినవారు. వాటిలో తిరుమలనుండి జారిపడే **'కపిల తీర్థం'** ఒకటి. ఈ తీర్థంపై భాగంలోని అనేకతీర్థాలను విశదీకరించే వృత్తాంతం ఈ సంచికలో వర్ణితం.

శౌనకాది మహామునులు శ్రద్ధాసక్తులను గుర్తించిన సూతుడు-

"మునులార! ఇప్పుడు వాల్మీకి ముని వల్ల విన్న ఆత్మారాముని వృత్తాంతాన్ని మీకు తెలియజేస్తాను. ఈ వరాహపర్వత మాహాత్మ్యం మాటల్లో చెప్పడానికి వీలు లేనంత. ఇందుకు ఆత్మారాముని కథ ఒక దృష్టాంతం" అంటూ-

మధ్యరాష్ట్రంలో ఒక బ్రహ్మణుడు. అతని పేరు ఆత్మారాముడు. అతడు సద్బ్రాహ్మణుడు. గొప్పవాడు. పండితుడు. అతడు ధర్మకర్మ నిష్ఠాపరుడు. దేవపూజలు శ్రద్ధతో చేసేవాడు. అంతేకాదు బ్రాహ్మణులను గౌరవించేవాడు. అతనికి గల ధర్మజిజ్ఞాస ఇంతింత అనడానికి వీలులేదు. పిత్రార్జితంతోనే కాలం గడిపే ఆత్మారాముడు చివర తండ్రి సంపాదన అంతా ఖర్చయ్యాక దరిద్రుడయ్యాడు.

ఆత్మారామునికి ఏం చేయాలో తోచ లేదు. చాలకాలం దాకా చేస్తున్న దేవ పూజలకు, బ్రాహ్మణార్చనలకు వీలు లేక పోవడంతో తన ఊరు వదలిపెట్టాడు. తిరుపతి చేరుకొన్నాడు. సప్తగిరులు క్రింద గల కపిలతీర్థంలో స్నానం చేశాడు. స్నానం చేశాక కపిలేశ్వరుని సేవించాడు. ఆ పై దిక్కు తోచక కపిలతీర్థాన్ని ఆనుకొన్న అడవుల వెంబడి ఆ గిరిమీదున్న ఏడు వందలతీర్థాలలో పవిత్రస్నానం చేస్తూ కొండ ఎక్కసాగాడు.

ఆ కొండల మధ్య ఒక గుహ. ఆ గుహలో ధ్యాననిష్ఠుడయిన ముని. అతడెవరో కాదు. సనత్కుమార నామధేయుడు. కొండ ఎక్కుతున్న ఆత్మారాముడు నిర్జన ప్రదేశంలో ధ్యాననిష్ఠుడైన మునిని చూచి ముందు ఆశ్చర్యపడ్డాడు. ఆపై మహాత్ముల దర్శనం పుణ్యవంతమని ఆ ముని దగ్గరికి వచ్చాడు. సాష్టాంగ దండ ప్రణామం చేశాడు. ముని తన ఎదుట సాగిలబడిన బ్రాహ్మణుని ప్రసన్న దృష్టితో చూచాడు. ప్రసన్న వీక్షణానికి తబ్బిబ్బుపడిన ఆత్మారాముడు.

'తాపసవర్య! మహాత్మ! నిర్మలహృదయా! మీరు మహానుభావులు. నేను పాపాత్ముణ్ణి. దయతో నన్ను కటాక్షించండి. దారిద్ర్య బాధలతో ఇల్లు వదలాను. సంసారానికి దూరమయ్యాను. దిక్కు తోచక తిరుగుతుంటే మీ దర్శనభాగ్యం కలిగింది. మీరే నాకు దిక్కు. నా కష్ట దశను గుర్తించి నన్ను ఈ దశ నుండి బయటపడే మార్గం సూచించండి' అని దైన్యంగా ప్రార్థించాడు.

సనత్కుమారుడు బ్రాహ్మణుని దైన్య ప్రార్థన విన్నాడు. అతడు విన్నవించినదంతా సత్యమనే విశ్వాసం ఆ మునికి కలిగింది. అతణ్ణి అనుగ్రహించాలనిపించింది.

'విప్రవర్య! ఎందుకు ఆయాసపడుతున్నావు? చేసిన పాపం నశించే కాలం ఆసన్నమయింది. మరీ పాపమేమిటో నేను చెబుతాను. విను-

జన్మాంతరాలలో నీవు లోభిని. ఒకరికి ఏదీ ఇవ్వని వాడివి. అంతేనా! మాధవ చింత ఏ మాత్రమూ లేనివాడివి. నీ దుర్గుణమేమిటో అది కూడా చెబుతాను. దానమిచ్చే వారికి, దానం తీసుకొనేవారికి

కొండల్లో జలప్రవాహాలను భగవంతుని కరుణాప్రవాహంగా ఆరాధించినవారు భారతీయులు

మధ్య విభేదాలు పుట్టించి వారిని కలుషితం చేసిన పాపాత్ముడివి. పోనీ నీవు శుద్ధుడివా? కాదు ఆచారవిహీనుడివి. ఎవడు ఏది ఇచ్చినా ఆచారాలను పక్కన పెట్టి ఆరగించేవాడివి. మరి కనబడే జనుల్ని ఎగతాళి చేసే వాడివి. డబ్బు దాచడంలో మాత్రం జాగ్రత్త తీసుకొనే వాడివి. నీ జీవితంలో దానశబ్దానికి అర్థం లేకుండా పోయింది. ఇన్ని రకాల పాపం చేసిన వాడవైనా కపిలతీర్థంలో స్నానం చేయడంతో పాపరాశి నశించింది. అయినా చాలదు, నీవు పునః ధనవంతుడివి కావాలనుకొంటే నీకు 'శ్రీపద్మాలయ కృప' ఒకటే శరణ్యం. మరి ఆ కృపను అనుగ్రహించగలది శ్రీహరి వక్షఃస్థలంలోని 'వ్యూహలక్ష్మి' మాత్రమే. ఆ తల్లి ఎవరని ఆలోచిస్తున్నావా! ఆ తల్లి నా కోరిక తీర్చగలదా! అని సందేహిస్తున్నావా! నీకు ఆ భయం అఖ్ఖర్లేదు.

ఆ తల్లి దయాళువు. లోకమాత. నిండుచంద్రునిలాంటి మోముతో దర్శనీయ. పద్మాలను చేత ధరించినది. ఆవిడ మహాలక్ష్మియే. కాని వ్యూహభేదాల బట్టి ఆ తల్లి 'కీర్తి'గా, 'జయ'గా విఖ్యాతురాలు. ఆ అమ్మ కారుణ్య దివ్యమంగళ విగ్రహ. అన్నిటి కన్నా మించి మహాదీన రక్షణి. కఠోరదీక్షలతో ఆ తల్లిని సేవించాలని అనుకొంటున్నావేమీ! అవేమీ అఖ్ఖర్లేదు. అనాయాసంగా అనుగ్రహించే అమ్మ. అయితే, ఆ తల్లి సులభ అనుగ్రహానికి ఒక మంత్రం చెబుతా. ఆ మంత్రాన్ని లక్ష్మీమంత్ర మంటారు. ఈ మంత్రాన్ని భక్తితో భజించు. నీ కోరిక తప్పక నెరవేరుతుందంటూ, ఎలా ధ్యానం చేయాలో సర్వస్వం ఆ బ్రాహ్మణునికి విశదం చేశాడు.

'ఓ బ్రాహ్మణోత్తమా! లక్ష్మీమంత్ర అనుగ్రహ ఫలసిద్ధిరస్తు. నీవు వెనువెంటనే వేంకటాచలానికి వెళ్లు. అక్కడి స్వామి శ్రీనివాసుడు నీ మొర ఆలకిస్తాడు. నీ కోరికను సఫలం చేస్తాడు' అంటూ ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు. ఆపై సనత్కుమారుని ఆనతిమేర వేంకటగిరి వైపు కదిలాడు.

తదనంతరం లక్ష్మీమంత్రాన్ని జపిస్తూ పావనతీర్థాలలో స్నానం చేస్తూ చివరకు స్వామి పుష్కరిణిలో క్రుంకులిడి హరి ధ్యానం చేయసాగాడు. ఆత్మారాముని ధ్యానానికి సంతృప్తుడైన హరి భూనీళలతో ప్రత్యక్షమయ్యాడు.

ఆత్మారాముడు ఆ స్వామికి దండప్రణామాలు చేశాడు. ఒక్కసారిగా సిద్ధించిన ఫలానికి సంతోషపడుతూ ఏ మాట పలుక నేరక కిమ్మనక నిలిచాడు. అతని అనిమేష స్థితిని గుర్తించిన స్వామి–

'ఆత్మారామా! అనవసర భయమెందుకు? వ్యూహలక్ష్మీ కటాక్షం నీపై ప్రసరించింది. ఆయురారోగ్య భాగ్యాదులతో వర్ధిల్లుదువు. అంతేకాదు విజ్ఞాన నిష్ఠ, అభ్యున్నతి సిద్ధిస్తుంది' అని అనుగ్రహించాడు, ఆ పై అంతర్ధానమయ్యాడు.

ఆత్మారాముడు జరిగిన పరిణామాల నుండి తేరుకొని స్వామి కనులవిందుగా సాక్షాత్కరించి అప్పుడే అంతర్ధానుడయ్యాడు. ఇది నిజమా? కలా? అని ఆలోచించాడు. ఆపై తనకు మంత్రోపదేశంచేసిన సద్గురువును తలచుకొని తన కృతజ్ఞతను మనసార ప్రశంసించుకొన్నాడు. తదనంతరం

## శ్రీకృష్ణామృతం..



దామోదర కృష్ణా దొడ్డ దొరవే నీవు
దొరకవే ఎవరికి దాపులేమీ

దాగుడుమూతల దాష్టీకములూ తగునా
దిక్కు నీవే అనుచూ దండము సేతు

దర్పము దంభము దడముగా యున్నవి
దగ్ధము సాయవే దరిచేర్చు కొనవే

దుర్లభము నిను చేర దారిచూపుము దేవా
ద్యోతకములెట్లులగునో దాసుడ/దాసిని నేనూ

దయలేదే దమ్మునిపై దాశార్హ దీనుడనే
దరిసెన మీయవే దివ్య తేజ

ద్విరదము ద్విజిహ్వము దొర నీ కరుణకు నోచే
ద్విజుని సంతతి నేను ధారణ నీ(య)వే

ధృడమైన భక్తితో ధ్యానింతు నిరతము
ధన్యను సాయవే ధ్యేయము నీవే

– 'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు, 99103 45794

కొండ దిగి తన నిజనివాసానికి మరలినాడు. అప్పటినుండి దానాదులు చేస్తూ సంతృప్తి జీవనం గడిపాడు' అని సూతుడు ఆత్మారాముని కథను ముగించాడు.

అపుడామునులు 'వికుంఠపురంలోని ఇతర పర్వతాల మహిమల గురించి చెప్పరూ' అని శౌనకాదులు విన్నవించారు. 'పదేడు తీర్థాలున్నాయని చెప్పారు కదా! ఆ తీర్థాదుల మహిమలు కూడా వినాలని జిజ్ఞాస కలుగుతూ ఉంది. చెప్పరూ' అని అడుగగా, సూతుడు తరువాతి వృత్తాంతం చెప్పసాగాడు.

'మునులార! కర్దముని కుమారుడు కపిలుడు. పాతాళవాసి అయిన అతడు సాంఖ్యవేదయోగాభ్యాసం చేసిన పుణ్యాత్ముడు. అతడు చాపల్యంతో, ఉత్సాహంతో తన మనసు నిల్పి పాతాళలింగాన్ని ఉపాసిస్తుంటే ఆ లింగం పాతాళం నుండి ఒక్కసారిగ రసాతల, తలాతల, సుతల, అతల, వితలాది లోకాలను భేదించుకొని భూతలపై లేచింది. ఈ లింగాన్ని దేవతలు ఆరాధించారు. జనులు భయభక్తులతో సేవించారు.

ఆ లింగం మరేదీకాదు. సగరనందనులకు సద్గతి ప్రసాదించిన భోగవతితో పానమైన లింగం. కపిలమహాముని దర్శిత లింగం. పవిత్రభోగవతితో ప్రత్యక్షమైన లింగం తీర్థం కావడంతో ఆ స్థలానికి 'కపిలతీర్థ'మనే పేరు వచ్చింది. మానవుల పాపహారి కపిలతీర్థ 'జలప్రవాహం.' కనుకనే ఆ తీర్థంలో స్నానమాడి జనులు కపిలసేవిత లింగాన్ని సేవిస్తుంటారు.

మరి ఇతర తీర్థాల గురించి కూడ అడిగారు కదా! వినండి. మొదటిది 'చక్రతీర్థం'. ఈ తీర్థం కూడా మహిమాన్వితమైనది. అహల్యను కామించిన ఇంద్రుడు ఈ తీర్థంలోనే పాపప్రక్షాళనార్థం తానమాడాడు. రెండవది 'విష్వక్సేనతీర్థం'. భూలోకవాసుల పుణ్యాభివృద్ధిని పెంచే తీర్థం. వరుణిని కుమారుడైన విష్వక్సేనుడు ఇక్కడే తపం చేశాడు. అతని తపస్సుకు హరి సంతోషించి తన శంఖచక్రాదులను అతనికి ప్రసాదించాడు. అంతేకాదు తన పరివారానికంతకు అధినాయకునిగా చేశాడు. ఆ కారణాన ఈ తీర్థానికి 'విష్వక్సేన' తీర్థమని పేరు.

విష్వక్సేనతీర్థం పైన పంచాయుధతీర్థాలున్నాయి. అద్దానికి పైన 'బ్రహ్మతీర్థం'. మహాహత్యపాతకవినాశిని అది. ఆపై సప్తమునుల తీర్థాలున్నాయి. ఒకదాని కంటె మరొకటి పుణ్యప్రదం. ఫలప్రదం.

ఈ తీర్థాలను గురించి విన్న ఒక బ్రాహ్మణుడు అన్ని తీర్థాలను దర్శించాలనుకొన్నాడు. వెంటనే బయలుదేరాడు. అతని సుదృఢకాంక్షను తీర్చడానికోసం హరి అతని స్వప్నంలో సాక్షాత్కరించాడు.

'విప్రవరేణ్య. సుదూరప్రాంతాలలోని తీర్థాలను దర్శించడానికి శ్రమపడి పోవనేల? ఇక్కడికి దగ్గరినే పుష్కరిణి. ఆ అద్భిలోనే పదియేడు తీర్థాలున్నాయి. ఆ తీర్థంలో మునకలు వేస్తే 17 తీర్థాలలో తానమాడిన ఫలం 'సందేహించకు' అన్నాడు.

నిదరపోయిన ఆ బ్రాహ్మడు లేచి దగ్గరి పుష్కరాద్రిలో తానం చేసి 'అఖిలసిద్ధులను' సంపాదిస్తానని వెళ్లాడు. తానను కొన్న ప్రకారం పుష్కరిణిలో పవిత్రస్నానం చేసి, సకలసిద్ధులను గడించాడని చెబుతూ, ఇంకెందుకు తిరుమలగిరులలో మూడు కోట్ల తీర్థాలున్నాయని తీర్థమాహాత్మ్యాన్ని ముగించాడు.

*(ఇంకా ఉంది)*

## వైకుంఠపాళి

### :: 95 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ధ | ను | ర్మా | స | 2 ము | | 3 గీ | తా | 4 జ | యం | తి |
| ర్మ | | | | క్కో | | ము | | య | | |
| 5 వ్యా | సు | డు | | టి | | | | | 6 జ | |
| ధు | | | | 7 ఏ | క | చ | 8 క్ర | పు | ర | ము |
| డు | | | | కా | | | తు | | త్మా | |
| | | 9 వి | నో | ద | ము | | వు | | 10 రు | మ |
| 11 వృ | | ష్ణ | | శి | | 12 మ | | | డు | |
| ష | | య | | | | 13 ద | 14 య | | | 15 గో |
| 16 ప | ర | శు | రా | 17 మ | జ | యం | తి | | | దా |
| ర్వు | | డు | | ధు | | తి | | | | దే |
| డు | | | 18 గో | వు | లు | | 19 శు | నా | దే | వి |

డిసెంబరు 18, 'సుబ్రహ్మణ్యషష్ఠి' సందర్భంగా...

# తన్నో షణ్ముఖః ప్రచోదయాత్

- శ్రీమతి కె.విజయలక్ష్మి

"షడాననో ద్వాదశ బాహుదండః
శ్రుత్యన్తగామీ ద్విపదీక్షణాద్యః।
భీతాయమహ్యం గిరిజాతనూజో
హిరణ్య వర్ణ స్వభయం కృణోతు॥" అంటే –

"ఆరుముఖములతో... పన్నెండు చేతులతో వేదాంత వేద్యుడైన పన్నెండు కళ్ళవాడు కుమారస్వామి. భీతుడనైన నన్ను బంగారు వన్నెగల పార్వతీపుత్రుడైన ఆ స్వామి అభయమిచ్చి రక్షించుగాక" అని అర్థం.

## శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భావం

భగవంతుడు ఏ అవతారం ధరించినా దుష్టశిక్షణ, శిష్ట రక్షణ, మంచిని పెంచడం, చెడును తుంచడమే అందులోని పరమార్థం. అదే సుబ్రహ్మణ్య ఆవిర్భావం వెనుకు దాగి ఉంది. పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బలగర్వితుడై సకల లోకవాసులనూ కష్టాలకు గురిచేస్తూ ఉండడంతో, దేవతలందరూ కలిసి బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. అందుకు–

"శివుడు తపస్సు చేస్తూ ఉన్నాడు. శివుడు తపస్సు మానివేసి పార్వతీ దేవిని పరిణయమాడేటట్లు చేస్తే వారికి జన్మించే కుమారుడు తారకాసురుడిని అంతమొందించగలడు" అని సలహా ఇచ్చాడు.

బ్రహ్మదేవుడి మాటలను విన్న దేవతలు శివుడు తపస్సు మాని పార్వతీదేవిని వివాహం చేసుకొనేలాగా చేసేందుకు మన్మథుణ్ణి పంపగా, శివుడు తన మూడవకన్ను తెరచి మన్మథుణ్ణి దహించివేశాడు. అయితే తారకాసురుడిని అంతమొందించ వలసిన అవసరాన్ని గుర్తించిన శివుడు తనకు పరిచర్యలు చేస్తూ ఉన్న పార్వతీదేవిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరి సమాగమ సమయంలో, శివుడి రేతస్సు భూమిపై పడింది. దానిని భూమి భరించలేక అగ్నిలో పడవేసింది. అగ్ని దానిని భరించలేక గంగలో వదలగా, దానిని గంగ తన తీరములోని శరవణమునకు(రెల్లు పొదలో) తోసివేసింది. అక్కడే శ్రీకుమారస్వామి జన్మించాడు. శరవణమున జన్మించిన వాడు కనుక స్వామికి **"శరవణభవుడు"** అనే పేరు ఏర్పడింది. అంతేకాకుండా గంగానదిలో పడిన రేతస్సు ఆరుభాగాలుగా ఏర్పడింది. ఆ ఆరుభాగాలు అలలతాకిడికి ఏకమై ఆరు ముఖములు, పన్నెండు చేతులు, రెండుకాళ్ళతో శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆవిర్భవించాడు. అందువల్ల ఆయనకు **"షణ్ముఖుడు"** అనే పేరు ఏర్పడింది.

ఈ విధంగా ఆవిర్భవించిన శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పెంచేందుకు శ్రీమహావిష్ణువు ఆరుకృత్తికలను నియమించాడు. వారు శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పెంచి పెద్దచేశారు. ఆరుకృత్తికల చేత పెంచబడడం వల్ల స్వామికి **"కార్తికేయుడు"** అనే పేరు ఏర్పడింది.

ఇలా కృత్తికలచేత పెంచబడిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి తర్వాత శివపార్వతుల వద్దకు చేరగా, దేవతలు దేవసేనాధిపత్యం



కృత్తికల చేత పెంచబడడం వల్ల స్వామి 'కార్తికేయుడు'గా పిలువబడ్డాడు

ఇవ్వగా, శ్రీసుబ్రహ్మణ్యస్వామి తారకాసురుడిపై దండెత్తి తారకాసురుణ్ణి అంతమొందించి దేవతలను, ప్రజలను రక్షించాడు.

ఈ విషయాన్ని భవిష్యోత్తర పురాణం –

**"మార్గశీర్షే సితేపక్షే షష్ఠీ భరత సత్తమ**
**పుణ్యాపాపహరా జ్ఞేయా శివాశీతా గుహప్రియ**
**నిత్యతారకం షష్ఠ్యా గుహస్తారక రజవత్**
**రారాజతేన దయితా కార్తికేయస్యసా తిథిః"** అని పేర్కొంది.

మార్గశిరమాసం శుక్లపక్ష షష్ఠిరోజు కుమారస్వామి తారకాసురుణ్ణి సంహరించి, తారకాధిపతివలె ప్రకాశించాడు. కాబట్టి ఈదినం కార్తికేయుడికి అత్యంతప్రియమైనది అని అర్థం.

లోకకల్యాణార్థం శివపార్వతుల గారాలబిడ్డడుగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భవించిన రోజూ.. తారకాసురుడనే రాక్షసుణ్ణి అంతమొందించి లోకాలన్నింటినీ రక్షించింది ఒకే తిథి కావడం విశేషం...!


## నెమలివాహనం... కోడిధ్వజం...



తారకాసురుడి సోదరుడు శూరపద్మడు. తారకాసురుడు అంతమొందాక, శూరపద్ముడు దేవతలతో పాటూ సకలలోకవాసులను ఇబ్బందులపాలు చేయసాగాడు. దీనితో దేవతలు సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించగా... సుబ్రహ్మణ్యస్వామి శూరపద్ముడిపై దండెత్తి యుద్ధం చేశాడు. భీకరమైన పోరు జరిగింది. ఆరవరోజు శూరపద్ముడు పక్షిరూపాన్ని ధరించి సుబ్రహ్మణ్య స్వామితో తలపడ్డాడు. సుబ్రహ్మణ్యస్వామి శూలాయుధం ప్రయోగించడంతో, పక్షి రెండుగా ఖండింపబడింది. ఈ రెండింటిలో ఒకటి నెమలిగా, మరొకటి కోడిపుంజుగా మారి శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని శరణు వేడుకోవడంతో నెమలిని వాహనంగా, కోడిని ధ్వజంగా చేసుకున్నట్లు కథనం.

## వల్లీ... దేవసేనలు...

శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారికి ఇద్దరు దేవేరులు ఉన్నారు. శ్రీవల్లీదేవి, శ్రీదేవసేనలువారు. తారకాసురుడిని అంతమొందించిన తర్వాత దేవేంద్రుడు తన కుమార్తె దేవసేనను సుబ్రహ్మణ్య



స్వామికి ఇచ్చి వివాహం చేయగా, తిరుత్తణి ప్రాంతపాలకుడైన నందిరాజు కుమార్తె అయిన వల్లీదేవిని వేటగాడి రూపంలో వెళ్ళి వివాహం చేసుకున్నాడు. దీనితో శ్రీసుబ్రహ్మణ్యస్వామి వల్లీ దేవసేనల సమేతుడు అయ్యాడు. వల్లీదేవసేనల సమేతుడైన శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని ఆరాధించడం వల్ల భార్యాభర్తలమధ్య అన్యోన్యత వృద్ధి చెందడంతో పాటు కుటుంబం కూడా వృద్ధి చెందుతుంది.

## సృష్టికర్తనే బంధించిన సుబ్రహ్మణ్యుడు!

శ్రీసుబ్రహ్మణ్యస్వామి పసివాడుగా తల్లిఒడిలో ఉన్న సమయంలో శివుడు పార్వతీదేవికి ప్రణవమంత్రం యొక్క అర్థాన్ని వివరించాడు. బాలుడుగా ఉన్న సుబ్రహ్మణ్య స్వామి దానిని విని ఆకళింపు చేసుకున్నాడు. ఒకసారి బ్రహ్మ దేవుడు కైలాసానికి రాగా, బాలుడుగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ప్రణవమంత్రార్థాన్ని వివరించవలసిందిగా అడిగాడు. బ్రహ్మ చెప్పలేకపోవడంతో సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మదేవుడిని బంధించాడు. శివుడు దీనిని చూసి జోక్యం చేసుకుని బ్రహ్మదేవుడిని విడిపించాడు.

## కావడిమొక్కుల వాడు...

పూర్వం అగస్త్యమహర్షి కైలాసానికి వెళ్ళి శివుణ్ణి దర్శించి తిరిగి వెళ్ళే సమయంలో, శివుడు రెండు కొండలను బహూకరించి శివశక్తి రూపంగా దక్షిణాదికి తీసుకువెళ్ళి కొలవవలసిందిగా తెలిపారు. వాటిని స్వీకరించిన అగస్త్యుడు వాటిని ఇదంబుడు అనే శిష్యుడికి ఇచ్చి, వాటిని తనవెంట తీసుకుని రావలసిందిగా తెలిపాడు. ఇదంబుడు కావడి కట్టుకుని, రెండు పర్వతాలను అందులో ఉంచుకుని, అగస్త్యుడి వెంట నడవసాగాడు. కొంతదూరం అంటే 'పళని' వచ్చేసరికి ఆయాసం అధికమై కొంతసేపు విశ్రాంతికి ఆగాడు. విశ్రాంతి తీసుకుని మళ్ళీ కావడిని ఎత్తుకొనగా, ఒకవైపు పైకి లేచింది. మరోవైపు లేవలేదు. దీనితో వెనుతిరిగి చూడగా దానిపై శ్రీసుబ్రహ్మణ్యస్వామి నిలబడి ఉన్నాడు. కొండదిగి వెళ్ళి పొమ్మన్నాడు. పోకపోవడంతో వారిద్దరిమధ్య యుద్ధం జరిగి, చివరకు ఇదంబుడు చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న అగస్త్యుడు శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారిని ప్రార్థించడంతో స్వామి ఇదంబుణ్ణి తిరిగి బ్రతికించాడు. ఈ విషయం ఇదంబుడి భార్యకు తెలిసి కావడిలో పాలను తీసుకుని వెళ్ళి కృతజ్ఞతగా స్వామివారికి సమర్పించింది. అప్పటి నుంచి కావడిమొక్కులను సమర్పించడం ఆచారమైంది.



కాగా, కావడికి ఉపయోగించే బద్ద 'బ్రహ్మదండం' అనీ, కావడికి ఉపయోగించే 'తాళ్ళు వాసుకి, అనంత, తక్షక, సంగపాల, గుడిక, పద్మ, మహాపద్మ, కర్కాటక' అనే అష్టనాగులకు ప్రతీక అనీ చెప్పబడుతూ ఉంది. స్వామివారికి పాలకావడులు, పూలకావడులను సమర్పించడం ఆనవాయితి. కావళ్ళను స్వీకరించిన స్వామివారు కోరిన కోరికలను తీర్చడంతో పాటూ, వంశాభివృద్ధిని, కుటుంబ, ఆర్థికాభివృద్ధిని ప్రసాదిస్తాడని విశ్వాసం.

## సుబ్రహ్మణ్య షష్ఠి

మార్గశిరమాసంలోని శుక్లపక్షం షష్ఠి- **సుబ్రహ్మణ్య షష్ఠి.** సుబ్రహ్మణ్యషష్ఠి నాడు స్వామివారిని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి నైవేద్యం సమర్పించాలి. ఈ రోజు మొత్తం ఉపవాసం ఉండి మర్నాడు తిరిగి పూజచేసి భోజనం చేసి ఉపవాసాన్ని విరమించాలి. శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని సర్పంగా కూడా భావించడం సంప్రదాయం. కాబట్టి ఈ పండుగనాడు పుట్టవద్దకు వెళ్ళి పూజలు చేయడం మంచి ఫలితాలనిస్తుంది. రాహు, కేతు, సర్ప, కుజదోషాలతో బాధపడేవారు కఠినమైన ఉపవాసముండి శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని పూజించడం మంచిది. అంతేకాకుండా బ్రహ్మచారిని ఇంటికి పిలిచి, స్వామి రూపంగా భావించి, పూజించి పులగం, క్షీరాన్నంవంటి వంటలను చేసి, భోజనంపెట్టి వస్త్రం, దక్షిణ తాంబూలం ఇచ్చి నమస్కరించాలి. ఈనాడు **'శరవణ భవ'** అనే ఆరు అక్షరాల నామాన్ని జపించడం మంచి ఫలితాలను ఇస్తుంది.

సుబ్రహ్మణ్యషష్ఠిని సంప్రదాయబద్ధంగా జరుపుకొనడంవల్ల వంశాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధి, బుద్ధిసమృద్ధి కలుగుతాయి.


**ఓం తత్పురుషాయ విద్మహే।**
**మహాసేనాయ ధీమహి।**
**తన్నో షణ్ముఖః ప్రచోదయాత్॥**

# వేదస్వరూపం- శ్రీరామాయణం

-డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు, 98850 03420

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా॥

భగవానుడైన శ్రీమన్నారాయణుడు శ్రీరాముడై అవతరించాడు. ఆ భగవానుడు శ్రీరాముడై ఈ లోకంలో అవతరించినప్పుడు అతనిని గూర్చి తెలియజేసే వేదం కూడా శ్రీరామాయణరూపంలో అవతరించింది. భగవానుడు శ్రీరాముడై అవతరించాడు, లక్ష్మీదేవి కూడా సీతాదేవిగా అవతరించింది. ఆ దివ్యదంపతుల వైభవాలను ఎల్లప్పుడూ కీర్తించే వేదం కూడా శ్రీరామాయణరూపంలో అవతరించింది. పైన ప్రస్తావించిన పురాణ శ్లోకం ఈ విషయాన్ని తెలుపుతున్నది. "వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే" వేదం చేత ఎల్లప్పుడూ చెప్పబడే భగవంతుడు దశరథునకు పుత్రుడు అయిన శ్రీరామునిగా అవతరించినప్పుడు, "ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"- వాల్మీకిమహర్షి వాక్కు రూపంలో వేదాలే శ్రీరామాయణంగా అవతారాన్ని ధరించాయి,



'భగవంతుడు కాలానికి కానీ, దేశానికి కానీ, వస్తువుకు గాని పరిమితమై ఉండేవాడు కాదు. శ్రీరామాయణం కూడా దేశ, కాల, వస్తుపరిచ్ఛేదాలకు అతీతమైనది అని పెద్దలు చెబుతారు.' అనే విధంగా -

ఈ విధమైన మూడు విధాలైన పరిచ్ఛేదాలు వేదాలకు లేవు. భగవంతుడు అన్ని కాలాలలోనూ ఉన్నాడు. అన్ని చోట్ల ఉన్నాడు. అన్ని వస్తువులలోనూ ఉన్నాడు. **"అంతర్బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణః స్థితః"** అని ఉపనిషత్తు పలుకుతున్నది. ఆ భగవంతుడు ఏ విధంగాను దేశకాలవస్తువులతో పరిచ్ఛేదించడానికి వీలు కాని మహిమను కలవాడు.

శ్రీరామాయణంకూడా అటువంటి మహిమనే కలిగినది. శ్రీరామాయణంలోని ఈ **"యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే, తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి"**. ఈ శ్లోకాన్ని మనం పరిశీలించి నట్లయితే, రెండు మూడు అమూల్యమైన విషయాలు మనకు గోచరిస్తాయి. **"యావత్ స్థాస్యంతి గిరయః"** ఈ భూమిలో ఎక్కడ ఎక్కడ, ఏ ఏ సమయాలలో, ఎంతవరకు పర్వతాలు నిలచి ఉంటాయో, సూర్య చంద్రులు ఉంటారో, ఎంతవరకు నదులు ప్రవహిస్తాయో, అంతవరకు శ్రీరామాయణ కథ నిలచి ఉంటుంది- అంటే, శ్రీరామాయణానికి కాలావధి లేదు అని, కాలపరిచ్ఛేదం లేదు అని తెలుస్తున్నది. దీనివల్ల పై శ్లోకంలోని ఒక భాగంవల్ల శ్రీరామాయణం కాలావధి లేని మహిమ కలిగినది అని తెలుస్తున్నది. ఆ విధంగానే, ఈ శ్లోకంలోని. **"సరితశ్చమహీతలే"** అనే

భాగాన్ని గమనిద్దాం. "మహీతలే" అని అనడంవల్ల ఈ భూమిలో ఉండే నదులు, సముద్రాలు, సూర్యచంద్రులు ఎంత వరకు ఉంటారో అంతవరకు శ్రీరామాయణం నిలచి ఉంటుంది అని చెప్పబడింది. ***"లోకేషు ప్రచరిష్యతి"***– "లోకేషు" అని అన్నందువల్ల, లోకంలో అని మాత్రం చెప్పలేదు, "లోకాలలో" అని చెప్పడం జరిగింది. అందువల్ల శ్రీరామాయణ కథ ఏదో ఒక లోకంలో మాత్రమే పరిమితం అయినదని అర్థం కాదు. "లోకేషు" అని బహువచనం చెప్పినందువల్ల మనకు ఏమని అర్థం అవుతుంది? అంటే, "ఏడేడు 14 లోకాలలో అని చెప్ప బడింది కాబోలు!" అని కూడా తోస్తుంది. ఇది వాస్తవమే. ఈ విధమైన అర్థాన్ని కూడా గ్రహించవచ్చు.

ఇంత మాత్రమే కాదు. ఇక్కడ "లోకేషు" అనే పదం లోని బహువచనాన్ని అప్రధానంగా గ్రహించి, "రెండు లోకాలు" అనే అర్థాన్ని గ్రహించి, వేరొక అర్థాన్ని కూడా చెప్పే అవకాశం ఉన్నది. కేవలం ఈ 'లీలావిభూతి'లోనే కాకుండా, 'నిత్య విభూతి'లో కూడా, అంటే పరమపదంలో కూడా, రామాయణ కథ వ్యాపించి ఉంటుంది అనే అర్థాన్ని చెప్పవచ్చు. ఈ విభూతిలో ఎన్ని బ్రహ్మాండాలు, ఎన్ని లోకాలు ఉన్నప్పటికీ, అవి అన్నీ విరజానదికి ఈవల వైపుననే ఉన్నాయి. ఇవి అన్నీ ఒకనాడు సృష్టింపబడి, వేరొక సమయంలో నశించిపోయే లోకాలు. ఇటువంటి లోకాలు సత్యలోకంవరకు ఉన్నాయి. వీటిని అన్నిటినీ దాటిన తరువాత, విరజానది ఉన్నది. ఆ నదిని దాటినట్లయితే, అక్కడ శ్రీవైకుంఠం ఉన్నది. దీనికి 'నిత్యవిభూతి' అని పేరు. ఇది ఏనాడు సృష్టింపబడి, నశించి పోయేది కాదు. నిత్యమైనది. పైన ఉదాహరించిన శ్లోకంలోని "లోకేషు" అనే పదం ఈ విధంగా ఉండే లీలావిభూతి, నిత్య విభూతులను చెబుతున్నది అని కూడా చెప్పవచ్చు. లీలావిభూతి లోనూ శ్రీరామాయణం ఉంటుంది, ఆ నిత్యవిభూతిలో కూడా శ్రీరామాయణం ఉంటుంది.

శ్రీరామానుజుల శిష్యులలో అనంతార్యులు అనేవారు ఒకరు. వారు శ్రీవేంకటాచలంలో వేంకటేశ్వరస్వామికి పుష్ప కైంకర్యాన్ని చేస్తూ ఉండేవారు. వారు వినోదంగా ఒకసారి శ్రీపరాశరభట్టర్‌ను ఈ విధంగా ప్రశ్నించారట. "పరమపదంలో భగవంతుడు రెండు భుజాలతో ఉంటాడా? లేక నాలుగు భుజాలతో ఉంటాడా? మీ అభిమతమేమి?" అని ప్రశ్నించారట. ఎందుకు ఈ విధంగా వారు ప్రశ్నించారంటే, శ్రీరంగంలో మూలమూర్తికి రెండు భుజాలు ఉన్నాయి. ఉత్సవమూర్తికి నాలుగు భుజాలు ఉన్నాయికదా! ఈ భట్టర్‌కు శ్రీరంగంలోని స్వామిపై ఎంతో అభిమానం కదా. వీరేమీ బదులిస్తారో చూద్దాం. అనే అభిప్రాయంతో అనంతార్యులు ఈ విధంగా ప్రశ్నించారు.

అప్పుడు భట్టర్ ఈ విధంగా సమాధానం ఇచ్చారట. "వైకుంఠంలో ఉండే భగవంతునకు నాలుగుభుజాలు ఉన్నట్లు గానూ తెలుస్తున్నది. రెండు భుజాలు ఉన్నట్లుగానూ శాస్త్రాలలో తెలుస్తున్నది. రెండు భుజాలు కలిగి ఉన్నవాడుగాను ప్రమాణం ఉన్నది. నాలుగుభుజాలను కలిగినవాడని కూడా ప్రమాణాలు తెలుపుతున్నాయి. ఏమని నేను బదులు చెప్పను?" అని భట్టర్ అన్నారు. అప్పుడు మళ్లీ అనంతార్యులు వారిని, "మరి, మీకు ఈ రెండు విధాలైన రూపాలలో ఏ రూపాన్ని దర్శించాలని ఆశ ఉన్నది?" అని ప్రశ్నించారు. అప్పుడు భట్టర్ సమాధానాన్ని పలుకుతూ, "భగవంతుడు రెండు భుజాలను కలిగినవాడై నాకు దర్శనాన్ని అనుగ్రహిస్తే, ఆ మూర్తిని శ్రీరంగంలోని మూల మూర్తిగా భావించి దర్శిస్తాను, ఆ విధంగా కాకుండా, నాలుగు భుజాలను కలిగినవాడై సేవను అనుగ్రహిస్తే, శ్రీరంగంలోని ఉత్సవమూర్తిగా భావించి దర్శిస్తాను. ఏది ఏమైనా, అక్కడ ఉండే స్వామిని శ్రీరంగంలో ఉండే స్వామి రూపంగానే దర్శనం చేస్తాను." అని అన్నారట.

దీనినిబట్టి మనకి ఏమి అర్థం అవుతున్నది? అంటే, వైకుంఠంలో ఎవరెవరు ఏ ఏ రూపంలో సేవించాలని అను కుంటారో, ఆ యా రూపాలలో భగవంతుడు దర్శనాన్ని అను గ్రహిస్తాడు– అని. *"యే యథా మాం ప్రపద్యంతే తాం తథైవ భజామ్యహమ్"* (ఎవరెవరు ఏ యే భావనతో నన్ను భజిస్తారో, వారిని ఆ యా విధంగానే నేను సేవను అనుగ్రహిస్తాను) అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు అనుగ్రహించాడు కదా. అందుచేత వైకుంఠంలోకి పోయినప్పటికీ కూడా మనం భావించినట్లయితే, అక్కడ ఉండే స్వామిని శ్రీరామునిగా దర్శించవచ్చు, శ్రీరామా యణ గాథను శ్రవణం చేయవచ్చు.

అందుచేత, 'వేదాలు' రామాయణంగా అవతరించాయి అని పేర్కొనడంలో అతిశయోక్తి లేదు.

*॥ ఓమ్ తత్సత్ ॥*

*గత సంచిక తరువాయి భాగం....*

### జీయర్ (జియ్యర్) శబ్దమున కర్థము

ఈ పదము (స్వామీ! అనెడు శబ్దమువలె) పూజ్యతా వాచకము. ఈ యర్థము జీయర్‌పడి శ్రీవచనభూషణ వ్యాఖ్యా నమునందు 'మాఱనేరినంబి విషయమున పెరియనంబి ఉడైయ వరులకు (శ్రీరామానుజాచార్యులకు)' అను స్థలమున కను గొనునది.

తిరుమల తిరుపతియందు శ్రీవేంకటాచలపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయములందు జరిగిన ఐతిహ్యము.


బ్రహ్మోత్సవము మొదటి దినమున ప్రాతఃకాలమున అనుసంధానము లేకుండుటకు కారణము-

శ్రీవైఖానసశాస్త్రమగు ఆనందసంహితయందు-

**"ఆవాహ్య యాగశాలాయాం కలశే ప్రథమేஉహని,**
**సాయమారాధ్య దేవేశం దీక్షితో వేదపారగైః**
**వేదారంభం చరేద్విద్వాన్ విష్ణోర్యాగాన్ తత శ్చరేత్"**

(ప్రథమదివసమున యాగశాలయందు కలశమున దేవదేవుని ఆవాహన చేసి, ఆరాధించి, విద్వాంసుడగు దీక్షితుడు వేదపారంగతులైన వారితోడ వేదారంభము చేయవలెను. పిమ్మట యాగమును అనుష్ఠింపవలెను.)

అనినట్లు ధ్వజారోహణోత్సవములందు తిరునాళ్ల మొదటిదినము సాయంకాలమున యాగశాలయందు కలశము లందు దేవతావాహనము చేసి, పూజయూ జరిపిన పిదప వేదపారాయణారంభము చేయుట ప్రమాణసిద్ధము. కావున దానితో సమానమగు ద్రావిడవేదమునకును, తదనంతరము సమారంభ ముచితమని రాత్రి వీథిలో(ఇయల్) గోష్ఠి ఆరంభింప వలె ననియు, శ్రీభగవద్రామానుజులు నియమించిరని పెద్దల నుపాసించి విషయ మరసినవారు వ్రాక్రుచ్చెదరు. కాబట్టి ప్రబంధములందు, శ్రేష్ఠమైన తిరువాయ్‌మొళి మొదలుకొని గాని, ఇతర ప్రబంధములు మొదలుకొనిగాని అనుసంధింప కుండ ఇయఱ్పా మొదలగునట్లు తొడగి అనుసంధించుటకు కారణమును శ్రీభగవద్రామానుజులే సోపపత్తికముగా నియ మించినారని పెరియవాచ్చాంబిళ్ళై అనుగ్రహించిన 'కలియ నరుళ్‌పాడు రహస్యమున కనుగొనగలరు.




స్థలవాసులగు పెద్దలును జియ్యరులును శ్రీవైష్ణవులును శ్రీవేంకటాచలపతి, తిరుమలనంబి కొని తెచ్చిన అభిషేకతీర్థమును వ్యాధరూపమున ఎదురేగి ఆరగించిన ఈ తీరును ఎల్లరు నరసి యుజ్జీవింపవలయునని, శ్రీఅధ్యయనోత్సవము ముగియు సమయమున శ్రీస్వామివారిని శ్రీభగవద్రామానుజులవారిని ఆకాశగంగాతీర్థమార్గమున విజయము చేయించి, ఆకాశగంగా జలధారనుండి తీర్థము నెత్తుకొని, తిరువాయ్‌మొళి అనుసంధానము తోడ తీర్థము కొనివచ్చుచుండ వారితోడ శ్రీస్వామివారు, భగవ ద్రామానుజులును వీథిలో ప్రదక్షిణముగ వచ్చునపుడు శ్రీవైష్ణవు లకు వీథులందు తమ తమ వాకిళ్ల ముందంతటను నడ పావడలు, పాద్యము, గంధము, ధూపము, మంగళదీపము,

తాంబూలమును సమర్పింపగా, ఇట్లీ క్రమముగా గుడిలోపలికి విజయముచేసి శ్రీపురుషసూక్తాద్యనుసంధానముతోడ శ్రీవారి పాదములకును, శ్రీశఠకోపమునకును అభిషేకము చేయించి, హారతి మొదలగు పెక్కు ఉపచారములను భగవంతునిచే స్వీక రింపజేసి, శ్రీరామానుజదర్శన ధర్మములను అనుష్ఠానమున అనువర్తింపజేయుచు జీవించుచుండిరి. ఈ ఉత్సవమునకు 'తీర్థా భిగమనమార్గ పరిష్కరణము' *(తణ్ణీరముదు వళితిరుత్తుకై)* అను పేరు ప్రసిద్ధి వహించెను. **తణ్ణీరముదు**= తిరుమలనంబి ఆకాశ గంగనుండి కొనివచ్చుచున్న అభిషేకతీర్థమును, **వళితిరుత్తుకై**= మార్గమధ్యముననే ఆరగించి సంస్కరించుట.

"పపౌ జలం సాదర మంబుజాక్షః
శ్రీశైలపూర్ణాయ నమోఽస్తు తస్మై"

(పుండరీకాక్షుడు (ఎవ్వరు తెచ్చుచున్న) జలమును ఆద రముతోడ పానముచేసెనో అట్టి శ్రీశైలపూర్ణులకు (తిరుమల నంబికి) నమస్కారము.)


అనినట్లుగ శ్రీవేంకటాచలపతి ఆదరించి ఆరగించు నట్లుగ చేయుట.

"కృచ్ఛ్రా త్పాపవినాశపూరిత పయః కుంభం దధానం శిర-
స్యాయాంతం శబరాకృతిః పథి హరిః శ్రీశైలపూర్ణం గురుమ్
తాతే తృర్థితవాన్ న దత్తముదకం, పీతం ఘటాత్తత్ శరా-
ఘాతాదుద్ధృత మాదరాత్ ప్రముదితం శ్రీనాయకేనా మునా."
ఖిన్నే శ్రీశైలపూర్ణేఽపృథ పయసి హృతే తద్విషాదాన్నిషాదా-
ఽఽకార్య కారుణ్యత స్తంకరతల మవలంబ్యాఽఽనయన్
స్వేషు ణాద్రిమ్
భిందన్ తద్రంధ్రజైషా ఘనతరఖనదీ వేంకటేశ ప్రియా త-
త్తోయం దేయం త్వయాఽహర్నిశమితి స వదన్నచ్యుతోఽ
భూదదృశ్యః.
తాతేతి సంబోధ్య యమంజనాద్రౌ ఆనీయమానా జ్జలపూర్ణ కుంభాత్,
పపౌ జలం సాదర మంబుజాక్షః శ్రీశైలపూర్ణాయ నమోఽస్తు తస్మై."

(పాపవినాశ తీర్థమునుండి నీరునింపిన జలకుంభ మును శిరమును నుంచుకొని క్లేశపడి వచ్చుచున్న శ్రీశైలపూర్ణ గురువును శబరాకృతి ధరించిన శ్రీహరి మార్గమందు సంధించి తాత, (నాయనా! నీరిమ్ము) అని యాచించెను. కాని ఆయన తీర్థమివ్వలేదు. అంతట ఈ శ్రీరమణుడు బాణముతోడ కొట్టి రంధ్రముచేసి ఘటమునుండి వెడలించి ఆదరముతోడ నీరుత్రాగి యానందించినాడు. అటుపిమ్మట జల మపహరింపబడగా ఆ విషాదమునే శ్రీశైలపూర్ణులు ఖిన్నులుకాగా, నిషాదవేషమున నున్న శ్రీహరి దయతోడ నాతని చేయిపట్టి పిలుచుకొనివచ్చుచు తన బాణముతోడ కొండను భేదించెను. 'ఆరంధ్రమునుండి పుట్టిన ఈ ఆకాశగంగా మహానది శ్రీవేంకటేశ్వరునకు ప్రియ మైనది. ఆ తీర్థమునే నీ వెల్లప్పుడును స్వామికిమ్ము' అని పలుకు చునే అచ్యుతు దదృశ్యుడాయెను, అంజనాద్రిపై అంబుజాక్షుడు 'తాత' యని పిలిచి కొనిరాబడుచున్న జలపూర్ణమగు కలశము నుండి ఆదరముతో జలమును త్రాగెను. అట్టి శ్రీశైలపూర్ణులకు నమస్కారమగు గాక!) *(ఇంకా ఉంది)*

**51వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**





# వాల్మీకి మదిలో... అయోధ్య

- డా॥ కె.రామకృష్ణ, 90320 44115

అయోధ్య... ఇతర నగరాల మాదిరిగా అదో భౌగోళిక ప్రాంతంగా మిగిలి పోలేదు. దైవం నడయాడిన నేలగా ప్రణతులందుకుంది. ఒక్కసారైనా ఆ మట్టిని ముట్టుకోవాలని లక్షలాది మందిని ఆరాటపడేలా చేసింది.

ఎందుకంటే.. అది తరగని ఆధ్యాత్మిక చింతనకు ఆయువుపట్టు. ధర్మవర్తనకు, ప్రజారంజకమైన పాలనకు దిక్సూచి. సనాతన భారతీయ సాంస్కృతిక హర్మ్యానికి హృదయపీఠి.

ఆదికవి వాల్మీకి రామాయణానికి పునాది అయోధ్య. రామాయణం బాలకాండలో ఐదు, ఆరు సర్గల్ని పూర్తిగా అయోధ్యానగర వర్ణనకే కేటాయించారాయన. అందులో ఎన్నెన్నో విశేషాలు. మరెన్నో సందేశాలు దాగున్నాయి.

**అయోధ్యా నామ నగరీ తత్రాసీల్లోక విశ్రుతా।**
**మనునా మానవేంద్రేణ యా పురీ నిర్మితాస్స్వయమ్॥**

కోసలదేశంలో ఉన్న అయోధ్యను మనువు స్వయంగా నిర్మించాడు. అందువల్ల ఆ నగరం మరింతగా లోకప్రసిద్ధి పొందింది... అంటూ బాలకాండలో అయోధ్య వర్ణన ప్రారంభమవుతుంది.

అయోధ్య పొడవు 12యోజనాలు. వెడల్పు మూడు యోజనాలు. ఇప్పటి లెక్కలో ఇది సుమారు 168కి.మీ పొడవు, 42కి.మీ వెడల్పునకు సమానం. దీని ప్రకారం అయోధ్య నగరం వైశాల్యం అప్పట్లో 7,056చ.కిమీ.

అయోధ్యను ఎంతో ప్రతిభ కలిగిన శిల్పులు, వాస్తునిపుణులు శాస్త్రప్రమాణాలతో తీర్చిదిద్దారని వాల్మీకి వర్ణించారు.

**చిత్రామ్ అష్టాపదాకారాం వరనారీగణైర్యుతామ్।**
**సర్వరత్నసమాకీర్ణాం విమానగృహశోభితామ్॥**

చదరంగంలో ఉండే పలకలవంటి నిర్మాణాలు కలిగిన భవనాలు ఇక్కడ ఉండేవని వాల్మీకి స్పష్టంగా చెప్పారు. అందంతో పాటు ప్రజల్ని కాపాడేందుకు శత్రువుల ఊహకు అందని విధంగా నిర్మాణాల కోసం అప్పటి శిల్పులు తీసుకున్న శ్రద్ధ ఇందులో కనిపిస్తుంది.

ఎత్తైన కోట బురుజులు, ధ్వజాలు, వందలకొద్దీ శతఘ్నులు ఉండేవి. కోటకు రక్షణగా వందల కొద్దీ మేలుజాతి గుర్రాలు, వేగంగా నడిచే ఏనుగులు, వృషభాలు, ఒంటెలు ఉండేవి. మొత్తంగా శత్రు దుర్భేద్యంగా అయోధ్యను తీర్చిదిద్దారు నిపుణులు. ఈ కోటను కాపాడటానికి వేలాదిమంది సుశిక్షితులైన యోధులు బురుజుల మీద, కోట లోపల నిరంతరం కాపలాగా ఉండేవారు. వీరందరూ శస్త్రాస్త్ర విద్యల్లో

నిపుణులు, ప్రత్యేకించి శబ్దభేది (కంటితో చూడకుండా కేవలం శబ్దం విని లక్ష్యాన్ని ఛేదిస్తూ బాణాలు వేయడం) విద్యలో ఆరితేరినవారు ఉండేవారు.

ఇటువంటి అయోధ్యను దశరథుడు పరిపాలించిన కాలంలో సంపన్నుడు కాని వ్యక్తి ఆ నగరంలో లేదు. గో, ధన, ధాన్య, వాహన సమృద్ధి లేని గృహం ఉండేది కాదు. ఈ సంపదనంతా యజమానులు కేవలం ధర్మబద్ధంగా సంపాదించి, అలాగే ఖర్చు చేసేవారు.

ఈ నగర ప్రజలంతా మహర్షులతో సమానమైన ఇంద్రియ నిగ్రహం, తేజస్సు కలిగి ఉండేవారు. అయోధ్యలో ఆకలితో అలమటించే వ్యక్తి ఒక్కడూ లేడు. దానం కోసం అర్రులుచాచే వ్యక్తి లేడు. నుదుట తిలకం ధరించని మనిషి కనిపించడు. దీనుడు కానీ, రోగపీడితుడు కానీ, సౌందర్య విహీనులుగానీ కనిపించేవారు కాదు.

వాణిజ్యంలో అయోధ్యకు సాటిరాగల నగరం అప్పట్లో లేదు. నగరం మధ్యభాగంలో అంగళ్ళు ఉండేవి. క్రయవిక్రయాల కోసం వచ్చే వ్యక్తులతో ప్రధాన వీధులన్నీ కిక్కిరిసి ఉండేవి. కేవలం కప్పం చెల్లించటానికి వచ్చే సామంతరాజులు బారులు తీరే వారట. సంగీత, సాహిత్య, నృత్య, నాటక, గీతాది కళారంగాల్లో నిష్ణాతులంతా అయోధ్యలో ఉండేవారు.

'యోద్ధుం అశక్యా ఇతి అయోధ్య' జయించటానికి వీలు కానిది అయోధ్య అని వర్ణించారు వాల్మీకి. కేవలం పేరులోనే కాదు... వాస్తవంలోనూ ఆచరణాత్మకమైన శత్రురక్షణ వ్యవస్థ కలిగిన నగరంగా అయోధ్య చరిత్రలో నిలిచి పోయింది.

కాంభోజ, బాహ్లిక, వనాయు, సింధు దేశాలకు చెందిన ఉత్తమజాతి గుర్రాలు ఇక్కడ ఉండేవని వాల్మీకి బాలకాండలో వివరించారు.

వింధ్యపర్వతాల్లో సంచరించే ఏనుగుల్ని ప్రత్యేకంగా ఈ నగరానికి తెప్పించి వాటికి శిక్షణనిచ్చేవారు. ఉత్తమజాతి పశుగణం అయోధ్యలో ఉండేది. అందులో భద్రమంద్ర, భద్ర మృగ, మృగమంద్ర జాతులకు చెందిన ఏనుగులు, బలమైన


## వేదం చెప్పిన 'అయోధ్య'

**అందరూ అనుకుంటున్నట్లు అయోధ్య కేవలం నగరం మాత్రమే కాదని, మానవ జీవచైతన్యానికి ఇదో ప్రతీక అని అథర్వణవేదం చెబుతోంది.**

**"అష్టాచక్రా నవద్వారా దేవానాం పూరయోధ్యా తస్యాగ్ం హిరణ్మయః స్వర్గలోకో జ్యోతిషావృత్తః..."**

**-ఎనిమిది చక్రాలు, తొమ్మిది ద్వారాలు ఉండే మానవ శరీరం అయోధ్యకు ప్రతీక. జనన, మరణ చక్రంలో శరీరం తిరుగుతూ ఉంటుంది. వీటితో మోక్షంకోసం యుద్ధంచేయడం సాధ్యం కాదు. ఫలితం ఉండదు.**

**శరీరం అనే పట్టణంలోని జ్యోతిర్మయ కోశానికి స్వర్గం అనే పేరుంది. అది జీవ చైతన్య స్వరూపమైన తేజస్సుతో నిండి ఉంటుంది. ఈ పట్టణాన్ని బ్రహ్మ సంబంధమైనదిగా తెలుసుకున్న వారికి బ్రహ్మదేవుడు ఆయువు, కీర్తి అనుగ్రహిస్తాడని అథర్వణ వేదమంత్రాలు చెబుతున్నాయి.**





# రాజాధిరాజులు



**అయోధ్యను పరిపాలించిన మాంధాత నుంచి రఘువంశోత్తముడైన రాముడి వరకు అందరూ అతిరథమహారథులే. ప్రతి ఒక్కరూ అమోఘమైన ప్రతిభా సంపన్నులే. ఒక్కొక్కరిదీ ఒక్కో బాట. అంతిమంగా ప్రజా సంక్షేమమే వారి ధ్యేయం.**

**మాంధాత:** రాజు అంటే ఇలా ఉండాలి అన్నంత గొప్పగా పరిపాలించాడు. షట్చ క్రవర్తుల్లో ఒకడిగా పేరు పొందాడు.

**త్రిశంకు మహారాజు:** ఇతడి పేరు మీదు గానే త్రిశంకు స్వర్గం ఏర్పడింది.

**హరిశ్చంద్ర మహారాజు :** సత్యానికి ప్రతి రూపం. విశ్వామిత్రుడి కిచ్చిన మాట కోసం కుటుంబాన్నీ త్యాగం చేశాడు.

**సగర చక్రవర్తి:** లోకంలో ధర్మాన్ని నెల కొల్పాడు. సగరుడు చేసిన అశ్వమేధ యాగంలో భాగంగా అశ్వాన్ని వెతుకుతూ అతని కుమారులు భూమినంతా తవ్వే శారు. అలా ఏర్పడినవే సముద్రాలు. అందుకే వాటికి సాగరాలని పేరు.

**దిలీపుడు:** ప్రజలను తన కన్నబిడ్డల కన్నా మిన్నగా చూసుకున్నాడు. కామ ధేనువు కుమార్తె నందినీ ధేనువు అను గ్రహం పొందాడు. గోసేవ అంటే దిలీపుడులా చేయాలనేంతగా ప్రసిద్ధి పొందాడు.

**భగీరథుడు:** స్వర్గంనుంచి గంగను తీసుకువచ్చిన ఘనత పొందాడు.

**అంబరీషుడు:** పరమభాగవతోత్తముడు. విష్ణుభక్తితో జీవిత పర్యంతం ఏకాదశి వ్రతాన్ని ఆచరించాడు.

**రఘుమహారాజు:** అత్యంత తేజోవంతు డైన రాజు. ఇతని పేరు మీదే రాముడి వంశానికి రఘువంశమనే పేరు వచ్చింది.

**దశరథుడు:** పదిదిక్కుల్లో రథాన్ని నడిపే శక్తి ఉన్నవాడు. దేవదానవ యుద్ధంలో దేవతలకు సాయంగా నిలబడ్డాడు. శ్రీరామచంద్రుడి తండ్రి.

**శ్రీరాముడు:** రఘుకులోత్తముడిగా పేరొం దాడు. రాజ్యపాలన అంటే రాముడిదే అన్నంత కీర్తి గడించాడు.

నరుడిగా అవతరించి, నారాయ ణుడిగా పూజలందుకుంటున్నాడు.

రాజ్యవ్యవస్థ అయోధ్యలో ఉండేది. అందుకే అయోధ్య అంటే అక్కడి ప్రజలకు మాత్రమే కాదు విదేశీ యులకూ ఎంతో ప్రీతిగా ఉండేది.

అయోధ్యా మధురా మాయా
కాశీ కాంచీ అవంతికా।
పురీ ద్వారవతీ చైవ
సప్తైతే మోక్షదాయికా॥

స్కాందపురాణం దేశం లోని ఏడు మోక్షపురాల్లో ఒకటిగా అయోధ్యను పేర్కొంది.

అగ్ని, బ్రహ్మపురాణాలు అయోధ్యను పాపాలను నాశనం చేసే నగరంగా కీర్తించాయి. యోగినీతంత్రంలో కూడా అయోధ్య ప్రస్తావన ఉంది. అథర్వణ వేదం అయోధ్యను దేవ నిర్మిత నగరంగా ప్రకటించింది. తులసీదాసు కూడా తన రామ చరితమానస్‌లో అయోధ్య వైభ వాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భాగవతంలో కూడా శుకమహర్షి రఘువంశాన్ని ప్రస్తావించి ప్రత్యేకంగా అయోధ్య గురించి వివరిస్తాడు. ఈ విధమైన 'అయోధ్య'ను చూసి తరిద్దాం. జన్మచరితార్థం చేసుకుందాం.

'జై శ్రీరామ్'



డిసెంబరు,23
వైకుంఠఏకాదశి
సందర్భంగా..

# వైకుంఠ ఏకాదశి

- శ్రీ జూలకంటి బలసుబ్రహ్మణ్యం

ప్రతి సంవత్సరం ధనుర్మాసంలో శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి' పర్వదినంగా చేస్తారు.

వైకుంఠఏకాదశికి ముందురోజు అనగా దశమినాటి రాత్రి ఏకాంత సేవానంతరం బంగారు వాకిళ్లు మూసివేస్తారు. పిదప తెల్లవారుజామున వైకుంఠ ఏకాదశినాడు సుప్రభాతం మొదలుకొని పదిరోజులపాటు శ్రీస్వామివారి గర్భాలయమునకు ఆనుకొని ఉన్న ముక్కోటి ప్రదక్షిణమార్గము తెరచి ఉంచుతారు. ఈ ఏకాదశిరోజు శ్రీవారిదర్శనానంతరం భక్తులు ముక్కోటి ప్రదక్షిణమార్గంలో వెళ్తారు. ఈ ముక్కోటి ప్రదక్షిణ ప్రవేశ ద్వారమును వైకుంఠద్వారమని, ఆ మార్గమును వైకుంఠ ప్రదక్షిణమని అంటారు.

ఆనాడు ఈ మార్గము రంగురంగుల విద్యుద్దీపాలలోను, పూలమాలలతోను చక్కగా ఆహ్లాదంగా అలంకరింపబడి ఉంటుంది. శ్రీనివాసస్వామివారికి అతి దగ్గరగా ఉన్న ఈ ప్రదక్షిణమార్గంలో దర్శనానంతరం వెళ్లిన భక్తులు ఒక వింత దివ్యానుభూతిని చవి చూస్తూ మైమరుస్తారు. వైకుంఠఏకాదశి నాటి ఉదయం తిరుమల మాఢవీథులలో ఉభయదేవేరులతో శ్రీవారికి స్వర్ణరథోత్సవం జరగడం విశేషం. అశేషభక్తజన వాహిని ఈ రథోత్సవంలో పాల్గొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు అవుతారు.

వైకుంఠ ఏకాదశి మరునాడు సూర్యోదయంలో అనగా ద్వాదశినాడు సూర్యోదయంలో "శ్రీస్వామిపుష్కరిణి తీర్థముక్కోటి" జరుగును. అనగా వైకుంఠ ఏకాదశినాడు ముల్లోకాల్లో ఉన్న 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలు, తిరుమలలో ఉన్న "శ్రీస్వామి పుష్కరిణి"లో ఆవహించును. సర్వదేవతా సాన్నిధ్యంగా కలుగును. అందువల్ల ఆ పర్వదినమందు శ్రీవారి ఆలయంలో శ్రీవేంకటేశ్వస్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, నివేదనాదులు యథాప్రకారంగా పూర్తి అగును. పిదప ఆనంద నిలయంలో వున్న 'సుదర్శన చక్రత్తాళ్వార్' పల్లకిని అధిరోహించి ఊరేగింపుగా తిరుమల తిరువీథులలో మహా ప్రదక్షిణంగా వచ్చి శ్రీవరాహస్వామి ఆలయప్రాంగణం చేరుకుంటారు. అక్కడ శ్రీసుదర్శన భగవానునిమూర్తికి అభిషేకం జరిగిన తరువాత పుష్కరిణిలో పవిత్రస్నానం చేయించుదురు. ఇలా చక్రస్నానం జరుగు సమయంలో వేలాదిమంది భక్తులు కూడా ఆ చక్రంతో పాటుగా పుష్కరిణిలో మునిగి పవిత్రస్నానాలు చేస్తారు.

పిదప చక్రత్తాళ్వారుకు వస్త్రాలంకారం, పుష్పమాలాలంకారం జరిగిన తరువాత నివేదన హారతులు ఘనంగా జరుగును. అక్కడి నుండి సుదర్శనులు బయలుదేరి ప్రదక్షిణంగా వచ్చి శ్రీవారిఆలయంలో ప్రవేశిస్తారు.


శ్రీవారిఆలయంలో వైకుంఠమార్గం

తిరుమలలో స్వామిపుష్కరిణిలో సంవత్సరంలో నాలుగుమారులు చక్రస్నానం జరుగుతుంది. భాద్రపదమాస శుక్ల చతుర్దశి, అనంతపద్మనాభవ్రతం రోజున ఒకసారి, 10 రోజులు జరిగే బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున రెండవమారు, వైకుంఠ ఏకాదశి మరునాడు ద్వాదశినాటి ఉదయం మూడవ మారు, రథసప్తమినాడు మధ్యాహ్నం నాల్గవ మారు శ్రీసుదర్శన చక్రత్తాళ్వారుకు చక్ర స్నానం జరిపించబడుతుంది.

*గోవిందా! గోవిందా! గోవింద!!!*

108 దివ్యదేశాలు

# తిరువెళ్లియంగుడి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

వెళ్లియఙ్గుడి పురే విరాజతే। బ్రహ్మతీర్థకవి పద్మినీయుతే ।
కోలవిల్లి రఘునాథ నామకో। నాయకీం మరతకాభిధాం శ్రితః।
శోభనాభిధ విమాన మధ్యగో। భోగిరాజ శయితేంద్ర దిఙ్ముఖః।
ఇంద్ర శుక్ర విధిశక్తి సూనుభిః సేవితః కతిహ సంస్తుతోఽనిశమ్॥

'**తిరువెళ్లియంగుడి**' అనే ఈ దివ్యక్షేత్రం కుంభకోణం నుండి చెన్నైకి వెళ్ళే మార్గంలో 'అనెక్కత్తై' సమీపంలో చోళపురం మరియు తిరుప్పనంతాళ్ అనే ప్రదేశానికి 5 కి.మీ.ల దూరం లోనూ, శంగణూర్ నుండి 1 కి.మీ.ల దూరంలోనూ వెలసి ఉన్నది. చతర్యుయుగములకు ప్రతీకగా ఈ స్థలం కొని యాడబడుతున్నది. కృతయుగంలో **బ్రహ్మపుత్రం**గా, త్రేతా యుగంలో **పరాశరం**గా, ద్వాపరంలో **ఇంద్రనగరం**గా, కలియుగంలో **భార్గవపురి**గా కీర్తింపబడుచున్నది.

మూలమూర్తి తూర్పుముఖంగా, **కోలవిల్లిరామన్** అనే పేరుతో శయనభంగిమలో వేంచేసి ఉంటారు. ఉత్సవమూర్తి శృంగారసుందర పెరుమాళ్‌గా దర్శనభాగ్యాన్ని కలిగిస్తాడు. అమ్మవారు ప్రత్యేకసన్నిధిలో **మరకదవల్లి** అనే పేరుతో వేంచేసి ఉంటారు. అనేక తీర్థములతో శుక్రతీర్థం, బ్రహ్మతీర్థం, ఇంద్ర తీర్థం, పరాశరతీర్థం, శుక్రపుష్కరిణి మొదలైన వాటితో, 'పుష్కలావర్తకమనే విమానంతో, కదలీవృక్షంతో, అత్యద్భుతమైన ప్రకృతి రామణీయకతతో ఈ క్షేత్రము అలరారుచున్నది. మిగతా ఎక్కడా లేనటువంటి ఒక వైశిష్ట్యం ఈ క్షేత్రంలో కనిపిస్తుంది. వైనతేయుడు *(గరుత్మంతుడు)* నాలుగుభుజములతో ఇచ్చట సేవను ప్రసాదిస్తున్నాడు. శ్రీవైఖానస ఆగమోక్తంగా దేవదేవుడు సకల ఆరాధనను అందుకొంటున్నాడు.

## స్థలపురాణం

ఈ క్షేత్రం గురించి నాలుగు విధములైనటువంటి కథనాలు మనకు కనిపిస్తున్నాయి.

**1)**చిత్రకూటంలో శ్రీరామభద్రుడు సీతాదేవితో ఏకాంతంగా ఉన్నప్పుడు, ఇంద్రుని కుమారుడైన జయంతుడు కాకిరూపాన్ని ధరించి, సీతాదేవియందు అకృత్యాచరణం చేసినటువంటి సందర్భంలో రామచంద్రుడు మిక్కిలి కోపగించుకొని (తన చేతిలో విల్లంబులు లేనందువల్ల) తన చేతివేళ్ళనే ఒక విల్లుగా చేసుకుని అచట ఉన్నటువంటి దర్భపుల్లను బాణంగా ఉప యోగించి ఆ కాకాసురుని మీద ప్రయోగించాడు. అటువంటి అద్భుతమైన ఆ భంగిమను అందరూ కూడా సాక్షాత్కరించు కోవాలి అనే ఉద్దేశ్యంతో కోలవిల్లిరామన్‌గా ఈ తిరువెళ్లియంగుడి అనే క్షేత్రంలో భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

**2)** దేవలోకశిల్పి అయినటువంటి విశ్వకర్మ దేవదేవునికి అత్య ద్భుతమైనటువంటి ఆలయాలను నిర్మించి మంచికీర్తిని పొంది



తిరువెళ్లియంగుడి స్వామివారు 'కోలవిల్లిరామన్', అమ్మవారు 'మరకదవల్లి'



నట్టు, అసురుల శిల్పి అయిన మయుడు (ఈ క్షేత్రంలో) తనకు కూడా అట్టి కీర్తి రావాలని, ఈ క్షేత్రంలో తపస్సు చేసి భగవంతుడు పంచాయుధములలో అతని ఎదుట సాక్షాత్కరింపగా, మయుడు ఆనందించక, 'స్వామి నీవు కోలవిల్లిరాముడిగానే దర్శనమివ్వా'లని ప్రార్థింపగ, భగవంతుడు అతని ప్రార్థనకు అనుగుణంగా వైనతేయునికి శంఖచక్రములను ప్రసాదించి, రెండు భుజములతో మయుణ్ణి అనుగ్రహించాడు. ఈ కారణం చేతనే ఇచ్చట ఉన్నటువంటి గరుత్మంతుడు రెండు చేతులను జోడించిన రీతిగా, మిగతా రెండు భుజములలో శంఖచక్రములను ధరిస్తూ **చతుర్భుజ గరుడుడి**గా సేవలను ప్రసాదిస్తున్నాడు.



**3)**బలిచక్రవర్తి అహంకారాన్ని అణిచి వేసి, తిరిగి ఐశ్వర్యాన్ని ఇంద్రునికి అప్పచెప్పడానికై వామనావతారాన్ని స్వీకరించి, బలిచక్రవర్తిని యాచించిన సందర్భంలో అసురుల గురువైన శుక్రుడు దానిని అడ్డుకొనగా, చక్రవర్తి సజలదానానికై, పూనుకొనగా, శుక్రాచార్యుడు ఆ కమండలంలో తుమ్మెద రూపంలో నీటిని అడ్డుకొనగా, వామనుడు చిన్న దర్భపుల్లతో పొడవగా, శుక్రాచార్యుడు ఒక కన్నును పోగొట్టుకోవడం జరిగింది. తరువాత భగవంతుడు త్రివిక్రముడై ముల్లోకాలను కొలచి, అసురుని అహాన్ని అణచి, లోకరక్షణగావించడం సకల జనవిదితమే. ఈ సందర్భంలో తుమ్మెదరూపంలో భగవంతుడి కార్యానికి విఘ్నం కలిగించి, తన కన్నును పోగొట్టుకున్నటువంటి శుక్రాచార్యుడు తన తప్పుని తెలుసుకుని, తన కన్నుని తిరిగి భగవదనుగ్రహంలో పొందడానికి ఈ తిరువెళ్లియంగుడి క్షేత్రానికి తుమ్మెదగా వచ్చి, తపస్సు చేసి, తాను సేకరించినటువంటి తేనెను భగవంతునికి సమర్పించిన ఫలంగా భగవానుడు కన్నును ప్రసాదించాడు. అందుచేత ఈ క్షేత్రం 'శుక్రదోష' పరిహారస్థలంగా ప్రసిద్ధిగాంచినది.

**4)**బ్రహ్మదేవుడు పోగొట్టుకున్న బ్రహ్మపదవిని ఈ స్థలంలో తపస్సు చేసి తిరిగి పొందడం, దుర్వాసమహర్షి శాపానికి గురియైన దేవేంద్రుడు ఇచ్చట తపస్సు చేసి శాపాన్ని పోగొట్టుకోవడం, పరాశరుడు కోలవిల్లిరాముణ్ణి మంత్రములతో ఉపాసించి శ్రీవైకుంఠాన్ని పొందడం అనే పలుమహిమాన్వితములైన ప్రసిద్ధగాథలు మనకు వినవస్తున్నాయి.

తిరుమంగైఆళ్వార్ల చేత మంగళాశాసనం చేయబడినటువంటి మరకదవల్లి సమేతుడైన ఈ కోలవిల్లిరాముణ్ణి దర్శించుకునేవారు సకలవిధములైనటువంటి పాపములను, దోషములను, శాపములను పోగొట్టుకొని ఇహపర సౌఖ్యములను పొందగలరని పురాణోక్తి.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# తిరుమలలో 'శ్రీవారి అధ్యయనోత్సవాలు'

## (12-12-2023 నుండి 05-01-2024 వరకు)

ప్రతి సంవత్సరం తిరుమలలో డిసెంబర్-మార్గశిరమాసం వైకుంఠఏకాదశి నాటికి 10 రోజులు ముందుగా రంగనాయకుల మంటపంనందు '**శ్రీవారి అధ్యయనోత్సవాలు**' ప్రారంభమవుతుంది. ఈ ఉత్సవం 25 వ రోజున పరిసమాప్తి అవుతుంది.

ఈ అధ్యయనోత్సవంలో 'నాలాయిర దివ్యప్రబంధం'లోని నాలుగువేల పాశురాలను మొత్తం ఒకేసారి స్థిరాసనంలో పూర్తిచేయడం, కనుక శ్రీ వైకుంఠఏకాదశి ముందు పదిరోజులు పగటివేళ 'పగల్ పత్తు' లో మొదటి రెండువేల పాశురాలను (ముదలాయిరం, పెరియతిరుమొళి) అనుసంధిస్తారు. ఏకాదశి నుండి పదిరోజులు రాత్రివేళ 'రాపత్తు' లో మిగిలిన రెండువేల పాశురాలను (ఇయర్పా, తిరువాయ్ మొళి) అనుసంధిస్తారు.

21వ రోజున 'రామానుజ నూట్రందాది, ఉపదేశరత్నమాల'ను అనుసంధిస్తారు. తిరుమల శ్రీవారి సన్నిధిలో 22వ రోజున 'కణ్ణినున్ శిరుత్తాంబు', 23వ రోజున 'రామానుజ నూట్రందాది', 24వ రోజున శ్రీవరాహస్వామి సన్నిధిలో 'శాత్తుమురై', 25వ రోజున 'తన్నీర్ అముదు ఉత్సవం' తో అధ్యయనోత్సవాలను శుభసమాప్తి చేస్తారు.



## తిరుమలలో 15-10-2023 నుండి 23-10-2023 వరకు జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి 'నవరాత్రి బ్రహ్మోత్సవాల' దృశ్యమాలిక.

ఈ ఉత్సవాలలో తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ భూమన కరుణాకరరెడ్డి, పాలకమండలి సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి. ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికార్లు శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., గారలు, భక్తులు మరియు దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన కళాబృందాలు పాల్గొన్నారు.









## తిరుమలలో 15-10-2023 నుండి 23-10-2023 వరకు జరిగిన శ్రీ వేంకటేశ్వరస్వామివారి 'నవరాత్రి బ్రహ్మోత్సవాల' దృశ్యమాలిక.

ఈ ఉత్సవాలలో తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు, పాలకమండలి సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు, భక్తులు మరియు భారతదేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన కళాబృందాలు పాల్గొన్నారు.













22-10-2023న తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌ॥ శ్రీ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులు.
వారికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్న
తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ భూమన కరుణాకరరెడ్డి గారు.





18-10-2023న తిరుమల శ్రీవారిసదన్-2లో శ్రీవారి సేవకులను ఉద్దేశించి మాట్లాడుతున్న
తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు గౌ॥ శ్రీ భూమన కరుణాకరరెడ్డి గారు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. పి.ఆర్.ఓ. డా॥ టి.రవి, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డా॥ఎ.విభీషణ శర్మ,
ఏ.పి.ఆర్.ఓ కుమారి పి.నీలిమ, శ్రీవారి సేవ ఏ.ఈ.ఓ. శ్రీ రవికుమార్ రెడ్డి గార్లు పాల్గొన్నారు.





07-10-2023న తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠాశాలలో నిర్వహించిన 'స్పేస్ ఎగ్జిబిషన్'ను ప్రారంభిస్తున్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారిణి (వైద్య & విద్య) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్., గారు. ఈ కార్యక్రమంలో తి.తి.దేవస్థానముల విద్యాశాఖాధికారి డా॥ ఎం.భాస్కర్ రెడ్డి, షార్ సీనియర్ సైంటిస్ట్ శ్రీ శంభుప్రసాద్, షార్ గ్రూప్ డైరెక్టర్ శ్రీ గోపీకృష్ణ, తి.తి.దే. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీచంద్రయ్య, శ్రీకృష్ణమూర్తి, శ్రీసురేంద్ర, శ్రీమతి పద్మావతి, శ్రీమతి సంధ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

డిసెంబర్ 23
గీతాజయంతి
సందర్భంగా...

# యువతకు స్ఫూర్తి 'భగవద్గీత'

-ఆచార్య ఎ.సచ్చిదానందమూర్తి,
98480 86858

ప్రతి సంవత్సరంమార్గశిరమాసశుద్ధఏకాదశిరోజున మనమందరం 'గీతాజయంతి'ని జరుపుకుంటాము. మరి ఎందుకు గీతా జయంతిని జరుపుకుంటారు? అంటే- అదే రోజు శ్రీకృష్ణభగవానుడు అర్జునుడికి భగవద్గీతను బోధించడం జరిగింది. గీత ఆవిర్భవించిన రోజు కాబట్టి ఆ రోజును మనం గీతాజయంతిగా జరుపుకుంటున్నాము. అసలు గీతను ఎందుకు పారాయణం చేయాలి? భగవద్గీతను మనం ఎందుకు చదవాలి? అంటే -

గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైః శాస్త్ర సంగ్రహైః।
యా స్వయం పద్మనాభస్య ముఖపద్మాత్ వినిశ్సృతా॥

అని భగవద్గీత యొక్క ప్రాముఖ్యతను ఈ శ్లోకం ద్వారా మనం తెలుసుకోవచ్చు. అలానే-

మలనిర్మోచనం పుంసాం జలస్నానం దినే దినే।
సకృత్ గీతాం వసే స్నానం సంసార మలనిర్మోచనమ్॥

మనలో సంసార పాపాలు ఏమైతే ఉన్నాయో అవన్నీ తొలగిపోవాలంటే భగవద్గీత పారాయణం చేయాలి.

అయితే ఈ భగవద్గీత నేటి యువతకు ఏ విధంగా ఉపయోగపడుతుంది? అనే విషయాన్ని గనుక మనం చూసినట్లయితే, ఇక్కడ గీతను బోధించింది ఎవరు? విన్నది ఎవరు? అనేటువంటి విషయాన్ని మనం పరిశీలించాలి. బోధించినవాడు, రాజ్యపాలన చేసిన వాడూ గృహస్థుడు. ఎవరైతే విన్నారో అతను కూడా గృహస్థుడు. గీతను బోధించిన స్థలం యుద్ధభూమి. యుద్ధం అంటే- శత్రుసైన్యాలు రెండూ కూడా ఎక్కడైతే నిలిచి ఉంటాయో దానిని యుద్ధభూమి అంటారు. ఒక మానసిక సంఘర్షణ సమయంలో



సరైన అవగాహన కల్పించడం కోసం చేసిన ఉపదేశం, అందరూ చదువదగినది, మానవ మాత్రమైన ప్రతి ఒక్కరికి వర్తించే గ్రంథం ఈ భగవద్గీత. యుద్ధరంగంలో బోధించిన గ్రంథం అని అందరూ అనుకుంటారు. కానీ, ప్రతి మనిషి రోజూ మానసిక సంఘర్షణలతో అతలాకుతలమవుతున్నాడు. అటువంటి సందర్భంలో బోధించినటువంటి ఒక దిశాత్మకమైనటువంటి గ్రంథం భగవద్గీత. గీతను బోధించిన సందర్భం ఏమిటంటే- మహాభారతయుద్ధం 10 రోజులు జరిగిన తరువాత భీష్ముడు అంపశయ్యపై వాలగా, ఆ సమాచారం సంజయుడు ధృతరాష్ట్రునికి చెప్పడం, అతడు సంపూర్ణంగా యుద్ధాన్ని వివరించమనడం, తన జ్ఞాననేత్రంతో సంజయుడు సంపూర్ణ యుద్ధాన్ని తెలియజేయడం గీత యొక్క ప్రధానమైనటువంటి సన్నివేశం.

నేటి యువతకు భగవద్గీత ఒక కరదీపికగా ఉపయోగపడుతుంది. అంటే- ఒక వస్తువుపై మక్కువ, మరో వస్తువుపై ద్వేషం. ఇది మనం చూస్తున్న మనిషి యొక్క స్వభావం. ఈ రాగ ద్వేషాల విశ్లేషణే భగవద్గీతలో మొత్తంగా కనిపిస్తుంది. మనిషి స్వభావాన్ని పరిశీలించి, మనిషి పరిపూర్ణుడు అని తెలుపడం, దాని ద్వారా శోకాన్ని పోగొట్టడం, ఇది భగవద్గీత యొక్క ముఖ్యమైనటువంటి ఆశయం. భగవద్గీత కేవలం బుద్ధితో అర్థం చేసుకుంటే సరిపోయే గ్రంథం కాదిది. సాధనకు సంబంధించిన విషయాలు కూడా ఈ భగవద్గీతలో చెప్పబడ్డాయి.

మనకు ఉపయోగపడేటువంటి ఎన్నో విషయాలు, ముఖ్యంగా దైనందిన జీవితంలో తెలుసుకోదగిన ఎన్నో విషయాలని మనం భగవద్గీత ద్వారా తెలుసుకోవచ్చు. ఒక అధ్యాపకుడు- ఉత్తమఅధ్యాపకుని లక్షణా

లను భగవద్గీత చదవడంద్వారా తెలుసుకో గలుగుతాడు. ఒక విద్యార్థి– భగవద్గీత అధ్యయనం వలన– 'ఓహో ఒక శిష్యుడు అంటే ఇలా ఉండాలి, గురుశిష్య సంబంధం అంటే ఇంత పవిత్రమైనది,' అని తెలుసుకుంటాడు. అదే విధంగా ఒక రాజకీయనేత భగవద్గీత అధ్యయనం చేసినట్లయితే ఒక నాయకుడు ఏ విధంగా ఉండాలి? అని అతను భగవద్గీత ద్వారా ప్రభావితుడు కాగలడు. ఇలా ఎవరెవరు ఏ దృష్టితో అధ్యయనం చేస్తే, వారి వారికి అదే విధంగా ఆ దృష్టితో వారిని ప్రభావితం చేస్తుంది శ్రీమద్భగవద్గీత. అందువల్లనే దేశ కాలాదులకు అతీతమైన గ్రంథం, కాబట్టి ఈరోజుకీ విశ్వ గ్రంథంగా మనం ఆరాధిస్తున్నాము. అందుకే 'యూనివర్సల్ బుక్' అంటున్నాము భగవద్గీతని.

భగవద్గీత లోకప్రయత్నాన్ని చిరకాలంనుంచే సాధించుకుంది. ఎలా అంటే– ప్రపంచవాఙ్మయంలో కూడా ఇది సకల మానవ ఉన్నతికి *మార్గదర్శకగ్రంథంగా* మహోన్నతమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఆధ్యాత్మిక మార్గప్రదర్శకంగానే కాకుండా, శాంతియుతమైన లౌకికవిధానాన్ని బోధించే *నైతికగ్రంథంగా* కూడా భగవద్గీతకు ప్రపంచవాఙ్మయంలో ఉన్న స్థానం అద్వితీయమైనది. భారతీయ సహజమైన సర్వమతసహనాన్ని, సర్వప్రాణుల శాంతియుతజీవనాన్ని ప్రారంభం నుంచీ చివరివరకు స్పష్టంగా బోధించిన గ్రంథం భగవద్గీత. భగవద్గీత మానసికంగా, భౌతికంగా, ఆధ్యాత్మికంగా వేర్వేరు స్థాయిలలో ఉన్న మానవుల ప్రతి ఒక్కరికి ఉపకరించి, వేరు వేరు సన్మార్గాలను చూపడం ద్వారా సర్వలోక ప్రియత్వాన్ని సంతరించుకుంది. అందుచేతనే 'సర్వజనహిత *గ్రంథం*'గా భగవద్గీత నిలిచింది.

మనం చూస్తున్నటువంటి యువత ఈరోజు తప్పుదోవపడుతున్నారు. ఎందుకంటే శ్రీకృష్ణుడు– 'ఏ ఏ భక్తుడు ఏ ఏ స్వరూపాన్ని శ్రద్ధాపూర్వకంగా ఆరాధిస్తాడో అతనికి శ్రద్ధను స్థిరంగా ఉండేటట్లు చేస్తాను. అలా చేసినందుకు ఫలాన్ని నేనే అతనికి అందజేస్తాను' అంటాడు.

**యోయో యాంయాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్॥**

భగవద్గీతలో అత్యంత ప్రముఖంగా చెప్పినటువంటి విషయం **'కర్మయోగం'**. కర్మయోగం అనేది భారతీయ తాత్త్విక శాస్త్రానికి భగవద్గీత ప్రప్రథమంగా అందజేసిన అతి ప్రధాన గ్రంథం. ఈ భగవద్గీతలో మహోన్నతమైన అపూర్వసిద్ధాంతాలు కనిపిస్తున్నాయి. నేటి యువత తప్పుడు త్రోవలో వెళ్లకుండా సరైన సన్మార్గంలో వెళ్లేందుకు, తమకు నిర్దేశించినటువంటి కర్మలను ఫలాపేక్ష లేకుండా ఆచరించడం కోసం, ఒక ధార్మికమైన పద్ధతిలో కర్మాచరణను చేయడం వలన సద్గతిని, అదేవిధంగా తత్ఫలితాన్ని కూడా పొందేటట్టుగా భగవద్గీతలో చెప్పడం జరిగింది.

ఆధునిక యువతకు భగవద్గీత చేసిన చక్కటి ఉపదేశం ఏమిటంటే– 'ప్రాణాలు విడవడానికి అయినా సిద్ధపడి తన ధర్మం రక్షించుకోవాలి. ఆ ధర్మానికి విఘాతం కలిగించే వారిని, ఆ ధర్మంనుంచి పెడదారిని పెట్టించే వారిని సమూలంగా నిర్మూలించాలి' అనేది ఈ మహోపదేశం. అటువంటి మహోపదేశం చేయడానికి భగవద్గీత అభిక్రమించింది. సుదృఢంగా మనసు నిలవడానికై అందుకు ఉపకరించే ఎన్నో విషయాలని శ్రీమద్భగవద్గీత నేటి యువతకు అందజేసింది. 'స్వధర్మ రక్షణ' కోసం మనం ప్రాణాలైనా విడిచిపెట్టాలి. అలా ప్రాణాలు విడిచిన వారికి స్వర్గం లభిస్తుంది' అని భగవద్గీతలో చెప్పడం జరిగింది. ప్రతి ఒక్క యువత ఈ వాక్యాన్ని ఆదర్శంగా తీసుకోవచ్చు. **'హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్'** అని. అలానే స్వధర్మాచరణం యొక్క స్వప్రవృత్తి, స్వకర్తవ్యనిర్వహణ ఎలా ఉండాలి అని కూడా **'స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః'** అనే చక్కటి ఉపదేశాన్ని కూడా చెప్పడం జరిగింది.

నేటి యువత సమాజంలో ఇతర వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు ఎలాంటి మానసిక ప్రవృత్తి కలిగి ఉండాలి? ఎటువంటి వ్యవహారం కలిగి ఉండాలి? ఎలాంటి దృక్పథంతో మనం ఇతరులతో వ్యవహరించాలి? అనే అత్యద్భుతమైనటువంటి ఉపదేశం భగవద్గీతలో చెప్పబడింది.

**'కృష్ణం వందే జగద్గురుం'** అంటున్నాము. శ్రీకృష్ణుడు జగద్గురువు. భగవద్గీత జగత్తులో ఉన్న మానవమాత్రులని అనగా 'మానవుడు' అని చెప్పే ప్రతి ఒక్కడిని ఉద్దేశించి చేసిన మహోత్తర ఉపదేశం. అందుచేత ఇది విశ్వజనీనగ్రంథం.

కావున, 'గీతాజయంతి' సందర్భంగా మనమందరం ప్రతి ఒక్కరి ఇంట్లో భగవద్గీతపారాయణం చేయడంతో పాటు, భగవద్గీతలో బోధించిన విషయాలను మనం ఆచరించినట్లయితే సమాజశ్రేయస్సు అనే యజ్ఞంలో మనం కూడా సమిధలుగా మారినవారమౌతాము.

॥శ్రీకృష్ణార్పణమస్తు॥

డిసెంబరు 24 'హనుమద్వ్రతం' సందర్భంగా...

# సకల కార్యార్థ సిద్ధిప్రదం- 'హనుమద్వ్రతం'

- డా॥ ఆకెళ్ళ సూర్యకనకదుర్గ, 81061 61690

ఆంజనేయస్వామి- కేవలం ఈ పేరు పలికినంతలోనే పసివారినుంచి ముసలివారి హృదయాలు సైతం ఉత్తేజ పూరితాలవుతాయి. ఎంతటి కష్టమైన కార్యాన్ని అయినా చిటికలో సాధించగలమన్న ఆత్మస్థైర్యం కలుగుతుంది. ఇలా ఉచ్చారణ మాత్రంతోనే భక్తులకు విజయాన్ని అందించే సకల కార్యసాధకుడు హనుమంతుడు.

దుష్టానం శిక్షణార్థాయ శిష్టానం రక్షణాయ చ।
రామకార్యార్థ సిద్ధ్యర్థం జాతః శ్రీహనుమాన్ శివః॥

అని పరాశరసంహిత- దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయ డానికి సాక్షాత్తు పరమశివుడే రామకార్యాన్ని సిద్ధింపజేసే సంకల్పంతో హనుమంతుడిగా అవతరించాడని పేర్కొన్నది.

బాల్యావస్థలో ఉన్న ఆంజనేయుడు తనకు ఆకలిగా ఉందని, తినటానికి ఏదైనా ఇవ్వమని తల్లి అంజనాదేవిని



అడుగుతాడు. ఎర్రగా పండిన పండు ఏదైనా చూసి, తినమని ఆమె చెబుతుంది. అది అరుణోదయ వేళ కావడంతో, ఉద యిస్తున్న సూర్యభగవానుణ్ణి చూసిన హనుమ అది ఎర్రని పండని భావించాడు. అమ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి, సూర్యుణ్ణి మింగటానికి ఒక్కసారిగా ఆకాశానికి ఎగిరాడు. ఆ రోజు సూర్య గ్రహణం కావడంతో విధి ప్రకారం సూర్యుణ్ణి గ్రహించడానికి రాహువు కూడా అటువైపే వస్తున్నాడు. బాలాంజనేయుణ్ణి చూసిన రాహువు, తనకు ఎవరో పోటీ వస్తున్నారని ఇంద్రుడితో చెబుతాడు. ఇంద్రుడు ఆగ్రహంతో బాలాంజనేయుడు మీద తన వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. ఆ ఆయుధపు తాకిడికి హనుమ మూర్ఛపోయి, ఒక పర్వత శిఖరంపై పడిపోతాడు.

తన కుమారుడి దుస్థితిని చూసి, చలించిపోయిన వాయుదేవుడు సకలప్రాణికోటిలోని జీవవాయువును స్తంభింప చేస్తాడు. దీంతో ముల్లోకాలు తల్లడిల్లిపోగా, పరిస్థితిని గమ నించిన ముక్కోటి దేవతలు బ్రహ్మదేవుణ్ణి వెంట తీసుకొని, ఆంజ నేయుడు మూర్ఛబడి ఉన్న పర్వత శిఖరానికి చేరుకుంటారు. హనుమను తెప్పరిల్లజేసి, అతడికి అనేక వరాలు ఇస్తారు.

ముక్కోటి దేవతలందరూ తమ తమ సంబంధమైన అస్త్ర, శస్త్ర, మంత్ర, తంత్రాలేవి ఆంజనేయుడు మీద పని చేయవని వరం ఇస్తారు. సృష్టిలో మరెవ్వరికీ ఇటువంటి వరాలు లభించలేదు. బ్రహ్మదేవుడు ఆంజనేయుని 'చిరంజీవి'గా ఆశీర్వదిస్తాడు. దీంతోపాటు హనుమ పేరుతో **"హనుమద్వ్రతం"** లోకంలో ప్రసిద్ధి పొందుతుందని, ఈ వ్రతాన్ని ఎవరు చేస్తారో, వారి సకల కార్యాలు నెరవేర్చాలని హనుమను ఆదేశిస్తారు.

## సకలకార్యసిద్ధి 'హనుమద్వ్రతం'

తన బాల్యచరిత్రను హనుమంతుడు స్వయంగా సీతాన్వేషణలో కిష్కింధలో సంచరిస్తున్న రామచంద్రమూర్తికి



వివరిస్తారు. వెంటనే, లక్ష్మణ సహితంగా శ్రీరామచంద్రమూర్తి పంపానది తీరంలో సాక్షాత్తు హనుమంతుణ్ణే ఉచిత వేదిక మీద కూర్చుండబెట్టి విధివిధానంగా హనుమద్వ్రతం చేస్తారు. ఆ వ్రత ఫలితంగా, బ్రహ్మ వాక్యాన్ని అనుసరించి, సకల రామకార్యాన్ని హనుమ తన భుజస్కంధాల మీద మోసి, రావణ సంహారం జరిపించి, సీతారాములకు పట్టాభిషేకం చేయిస్తారు. ఈ విధంగా శ్రీరామచంద్రుని ద్వారా హనుమద్వ్రతం లోకంలో వ్యాప్తిలోకి వచ్చింది.

## పౌరాణిక ఆధారం

పురాణకథల ప్రకారం విభీషణుడు కుమారుడైన నీలుడికి స్వర్గలోకంలో ఉన్న చింతామణి, కల్పవృక్షం, కామ ధేనువు సాధించాలని కోరిక కలుగుతుంది. తమ కులగురువైన శుక్రాచార్యుల ద్వారా పంచముఖ హనుమన్మహావిద్య ఉపదేశం పొందుతాడు. ఆ మంత్రాన్ని ఉపాసన చేస్తూ, గురు సమక్షంలో హనుమద్వ్రతం చేస్తాడు. వెంటనే, నీలుడికి స్వామి ప్రత్యక్షమై, అతనికి హనుమత్కవచాన్ని ఇవ్వడంతోపాటు, నీల–ఇంద్రులకు జరిగిన యుద్ధంలో స్వయంగా నీలుడి వైపు ఉండి విజయం చేకూరుస్తారు. హనుమద్వ్రత ఫలితంగా నీలుడికి చింతామణి, కల్పవృక్షం, కామధేనువుతో పాటు ఇంద్రుని కుమార్తె అయిన వనసుందరి కూడా భార్యగా లభిస్తుంది.

భారతకాలంలో అరణ్యవాసం చేస్తున్న ధర్మరాజు, ద్రౌపదితోను, తమ్ములతోనూ కలసి హనుమద్వ్రతం చేయడం ద్వారా జూదంలో కోల్పోయిన రాజ్యసర్వస్వాన్ని సాధించడంతో పాటు, సకలసంపదలు పొందుతాడు. ఈ వ్రత ఫలితంగానే ఆంజనేయుడు 'జెండాపై కపిరాజు'గా అర్జునుడి రథధ్వజం పై ఉండి, వారికి విజయం చేకూరుస్తారు.

చంద్రవంశంలో జన్మించిన సోమదత్త మహారాజు రాజ్యాన్ని కోల్పోగా, గురువైన గర్గాచార్యుని ఉపదేశంతో పంచ ముఖాంజనేయ ఉపాసన చేసి, హనుమద్వ్రతం చేస్తారు. ఫలితంగా, హనుమదనుగ్రహాన్ని పొంది, తిరిగి రాజ్యాన్ని సాధించి, వేయి సంవత్సరాల పాటు ప్రజారంజకంగా, ధర్మ మార్గంలో రాజ్యాన్ని పరిపాలిస్తాడు.

## హనుమద్వ్రత విధానం

హనుమద్వ్రతం చేయదలచుకున్నవారు ముహూర్తం నిర్ణయించుకుని, ముందురోజు ఉపవాసం చేసి, బ్రహ్మచర్యం పాటించి, మర్నాడు గురువుగారి సమక్షంలో విధివిధానంగా వ్రతం చేయాలి. వ్రతానంతరం ప్రత్యేకించి బ్రహ్మచారులకు హనుమత్స్వరూపంగా అర్చన చేసి, అప్పాలు వాయనంగా ఇవ్వాలి. తర్వాత దంపతీ పూజ చేయాలి. అనంతరం అన్న సమారాధన చేసి, బంధుమిత్రులతో కలిసి భోజనం చేయాలి.


## వ్రతానికి శ్రేష్ఠమైన రోజులు

- మార్గశిరమాసం శుక్లపక్షంలో వచ్చే త్రయోదశి రోజున హనుమద్వ్రతాన్ని చేసుకోవటం సకలశుభఫలితాలను ఇస్తుందని పరాశరసంహిత వచనం. లంకలోని అశోక వనంలో ఉన్న సీతమ్మను హనుమ మొదటగా దర్శించిన రోజు 'మార్గశిర శుద్ధ త్రయోదశి'. అందువల్ల ఈ రోజున హనుమద్వ్రతం చేసుకుంటే సకల దుఃఖాలు తొలగి కార్యసిద్ధి కలుగుతుంది.
- ఆదివారం హస్తనక్షత్రం కలిసిన రోజు కూడా ఈ వ్రతం చేసుకోవటానికి మంచి రోజు.
- వైశాఖబహుళదశమిని కూడా గురు నియమం ప్రకారం హనుమజ్జయంతి వ్రతం చేసుకునేందుకు ఉత్తమమైన రోజుగా భావించాలి.
- నక్షత్ర పంచకంలో భీముడు హనుమద్వ్రతం చేసినట్లు పురాణ కథనం. కాబట్టి నక్షత్ర పంచకంలో ఆచరించిన హనుమద్వ్రతం శుభఫలితాలను ఇస్తుంది.

## నియమాలు

- పరాశరసంహితప్రకారం పూజలో వచ్చే కలశం కాకుండా, మరొక కలశంలోకి నీటిని తీసుకొని, అందులోకి పంపా నదీ దేవతను ఆహ్వానించి, పూజలు చేయాలి. ఆ పంపా కలశజలంతోనే ఆంజనేయునికి పూజలు నిర్వహించాలి.
- మంటపారాధనలో సాధారణంగా అవగాహన చేసే దేవతలతో పాటు హనుమత్ పరివారాన్ని అంటే సుగ్రీవుడు, జాంబవంతుడు, అంగదుడు, నలుడు, నీలుడు మొదలైన వారిని కూడా ఆవాహన చేసి, వారికి కూడా అర్చనలు చేయాలి.
- వ్రతం చివరలో తోరపూజ, ధారణ ఉంటాయి. గురూపదేశం ప్రకారం సాధన చేస్తున్న హనుమన్మంత్రం బీజాక్షరాల సంఖ్యతో ఈ ముడులు వేయాలి. కాబట్టి హనుమద్వ్రతాన్ని కేవలం గురూపదేశం ప్రకారమే చేసుకోవాలి.
- తోరానికి ఎన్ని ముళ్ళు వేస్తామో అన్ని సంవత్సరాలు వ్రతం చేసుకొని, చివరగా కల్పం ప్రకారం ఉద్యాపన చేసుకోవాలి.

ఈ విధంగా సమంత్రకంగా, గురూపదేశం ప్రకారం హనుమద్వ్రతాన్ని ఆచరించడం వల్ల సకలకార్యార్థసిద్ధి కలుగుతుందని పరాశరసంహిత చెబుతోంది. అంతేగాక, కేవలం తన



వ్రతం చేస్తామని, త్రికరణశుద్ధిగా సంకల్పం చేసినంత మాత్రంలోనే, స్వామి హనుమ భక్తుల కోర్కెలు నెరవేరుస్తారని కూడా సంహిత చెబుతోంది.

॥ జై శ్రీరామ్॥





**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

## 'సప్తగిరి' చందాదారులకు విజ్ఞప్తి

సప్తగిరి మాసపత్రిక చందాదారులకు ప్రతినెల సకాలంలో చేరడానికి అనేకచర్యలు తీసుకుంటున్న సంగతి పాఠకలోకానికి విదితమే! ఈ క్రమంలో చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకు అనేకచర్యలు తీసుకుంటున్నాం. చందాదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ క్రిందివిధంగా ప్రధానసంపాదకకార్యాలయానికి తెలియజేయవచ్చు.

01) 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు/సూచనలు/ ఫిర్యాదులు sapthagiri.helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.

02) సప్తగిరి చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణకోసం 0877- 2264543 ఫోన్ నెంబరుకు చందాదారులు తమ పూర్తి చిరునామాను పిన్‌కోడ్, సెల్‌ఫోన్‌నెంబరుతో సహా కార్యాలయ పనివేళల్లో (ఉ.10.30 గం॥ల నుండి సా.5.00 గం॥ల లోపు) మరొకసారి తెలియజేయగలరు.

03) పై ఫోనునెంబరుద్వారాగానీ, sapthagiri.helpdesk@tirumala.org ద్వారా గానీ తెలుపగలరు.

04) ఆన్‌లైన్ చందాదారులు తమ పూర్తి చిరునామాలను క్రమబద్ధీకరణకోసం తి.తి.దే. వెబ్‌సైట్‌ద్వారా మరొకసారి తెలియజేయండి!

– ప్రధాన సంపాదకుడు

స్వామిహనుమపై-అస్త్ర, శస్త్ర, మంత్ర, తంత్రాలు ఏవి పని చేయవు.

# శుశ్రూష

- శ్రీమతి ఈ. విజయలక్ష్మి

లోకంలో మనం "శుశ్రూష "అనే పదాన్ని పలుమార్లు వింటుంటాం. తల్లిదండ్రులకు కుమారుడు సేవ చేస్తాడు, ఆచార్యులకు శిష్యుడు సేవ చేస్తాడు. ఈ విధంగా తనకంటే పెద్దవారైన వ్యక్తుల విషయంలో చేసే సేవకు **శుశ్రూష** అని పేరు. ఇది ఒక గొప్పధర్మం. మహానుభావులైన వారి సన్నిధిలో ఉండి, వారు మెచ్చిన శుశ్రూషను చేయడం అనేది ఒక విలక్షణమైన, ఉత్తమమైన ధర్మం. 'శుశ్రూష' అనే పదానికి ఏమి అర్థం? ఆ పదం ఏ విధంగా పుట్టింది? అనే దానిని గురించిన ఒక వృత్తాంతాన్ని వేదం తెలుపుతున్నది.

పరమాత్మ అయిన శ్రీమన్నారాయణుడు మొట్ట మొదటగా ఈ జగత్తును సృష్టించేటపుడు, మున్ముందుగా మంత్రాలను అన్నిటిని ఆవిర్భవింపచేశాడు. ఈ మంత్రాలకు అన్నిటికీ అధిదేవతలు ఉన్నారు. ఈ మంత్రానికి ఇతడు దేవత, ఈ మంత్రానికి ఇతడు దేవత? అనే విధంగా మంత్రాలకు అధిదేవతలు ఉన్నారు. ఈ విధంగా భగవంతుడు మంత్రాలను సృష్టించడమే కాక, ఆయా మంత్రాలకు తగిన దేవతలను కూడా సృష్టించాడు.

భగవంతుడు మొట్టమొదటగా ఒక మంత్రాన్నిసృష్టించి, ఆ మంత్రానికి తగిన దేవతనుసృష్టించాడు. ఆ మంత్రదేవతను చూడాలి అనే ఆశ భగవంతునకుకలిగింది. అపుడు అతడు ఆ దేవతను "ఆత్మన్" అని సంబోధిస్తూ పిలిచాడు. ఆత్మ శబ్దానికి "కుమారా!" అని అర్థం. వేదంలో కూడా **"ఆత్మావై పుత్రనామాసి"** అని ఈ విషయం చెప్పబడుతున్నది. అయితే, ఆ దేవత వెంటనే రాలేదు. పదిసార్లు ఆహ్వానించిన తరువాతనే ఆ దేవత రావడం జరిగింది. పదిసార్లు పిలిచిన తర్వాత ఆ దేవత వచ్చాడు కనుక, దేవతకు **"దశ హూతః"** అనే పేరును భగవంతుడు పెట్టాడు. (ఈ పదాన్ని **"దశ హోతా"** అని కూడా చెబుతారు). ఈ దేవతను అధిదేవతగా గలిగిన ఆ మంత్రానికి 'దశహోతృ' మంత్రం అని పేరు.


తరువాత భగవంతుడు ఇంకొక దేవతనుసృష్టించి, అతనిని ఇంకొక మంత్రానికి అది దేవతగా నియమించాడు. పూర్వం వలనే ఈ దేవతను కూడా చూడాలని భగవంతునకు తోచింది. అందువల్ల అతడు ఆ దేవతను "ఆత్మన్! ఆత్మన్!" అని అంటూ ఏడుసార్లుపిలిచాడు. ఆ విధంగా ఏడుసార్లుపిలిచిన తర్వాత, ఆ దేవత భగవంతుని దగ్గరకు వచ్చాడు కనుక, ఆ దేవతకు 'సప్తహోత' అని, ఆ మంత్రానికి 'సప్తహోతృ మంత్రం' అని పేరు వచ్చింది.

భగవంతుడు మళ్లీ ఇంకొక దేవతను సృష్టించి, అతనిని ఇంకొక మంత్రానికి అధిదేవతగా చేశాడు. ఈసారి భగవంతుడు ఈ దేవతను ఆరుసార్లు పిలిచాడు. అప్పుడు ఆ దేవత భగవంతుని దగ్గరకు వచ్చాడు. అందువల్ల ఆ దేవతకు "షడోత" అని, ఆ మంత్రానికి "షడ్హోతృమంత్రం" అని పేరు వచ్చింది.

మళ్లీ, ఇంకొకసారి, భగవంతుడు ఇంకొక దేవతను సృష్టించి, అతనిని ఐదుసార్లుపిలిచాడు. అప్పుడు ఆ దేవత భగవంతుని దగ్గరకు వచ్చాడు. కనుక, ఆ దేవతకు 'పంచహోత' అని, అతనిని అధిదైవంగా కలిగిన ఆ మంత్రానికి 'పంచహోతృ' మంత్రం అని పేరు వచ్చింది.

ఆ తర్వాత మళ్లీ, ఇంకొక దేవతను భగవంతుడు సృష్టించడం, అతనిని నాలుగు సార్లుపిలిచిన తరువాత ఆ దేవత భగవంతుని దగ్గరకు రావడం జరిగింది. అందువల్ల ఆ దేవతకు 'చతుర్హోతా' అని, ఆ మంత్రానికి 'చతుర్హోతృ మంత్రం ' అని పేరు కలిగింది.

అప్పుడు చతుర్హోతా అనే ఆ దేవతను చూచి భగవంతుడు, ఈ విధంగా అన్నాడట" నాయనా! నీవు నేను నాలుగు సార్లు పిలిచినంతనే నా దగ్గరకు వచ్చావు. అందువల్ల నీవు నాకు చాలా ఇష్టమైనవాడవు. మిగిలినవారు నీవలె వెంటనే రాలేదు, చాలా ఆలస్యం చేశారు. "పిలిస్తే పిలవనీ! ఎన్నిసార్లు అయినా పిలవనీ!" అని వారు తామసం చేశారు. కానీ, నీవు ఆ విధంగా కాకుండా, నేను పిలిచిన వెంటనే నా దగ్గరకు వచ్చావు కదా. నీవు నాలుగుసార్లు పిలిచినంతలోనే నా దగ్గరకు వచ్చావుకను, నీకు 'చతుర్హోత' అనే పేరు స్థిరంగా నిలుస్తుంది. నిన్ను అధిదేవతగా గలిగిన మంత్రానికి చతుర్హోతృమంత్రం అనే ప్రసిద్ధి వస్తుంది. అంతే కాదు, ఈ మంత్రంతో పాటు మిగిలిన మంత్రాలు కూడా చతుర్హోతృమంత్రాలు అనే పేరు తోనే పిలవబడతాయి" అని అన్నాడు. అందువల్ల, దశహోతృ



మంత్రం మొదలైన మిగిలిన మంత్రాలను అన్నిటికి కలిపి **చతుర్హోతృమంత్రాలు** అని పేరు వచ్చింది.

ఈ విధంగా నాలుగుసార్లు పిలవగానే పరమాత్మ దగ్గరకు వచ్చి, అతని సమీపంలో ఉండే ఆ దేవతకు "నేదిష్ఠః" అనే ప్రసిద్ధి వచ్చింది. లోకంలో కూడా తండ్రి పిలవగానే బదులు పలికి, అతని సమీపానికి వచ్చి, అతని వెంటనే ఉండే కుమారుని విషయంలో ఆ తండ్రికి చాలా ప్రేమ ఉంటుంది కదా. ఈ విషయాన్ని ఇక్కడ వేదం మనకు ఈ కథ ద్వారా తెలియజేసింది. ఈ రీతిలో తండ్రి మాటను వెంటనే మన్నించి, అతనికి సంతోషాన్ని కలిగించే రీతిలో ప్రవర్తించి, సేవ చేయడానికి **"శుశ్రూష"** అని పేరు.

శుశ్రూష అనే పదానికి వినడంలో ఆశ– అని అర్థం. ఇటువంటి శుశ్రూషను చేసేవానిని ఈ లోకంలో అతని తండ్రి మిక్కిలి అభిమానించడమే కాదు, సర్వలోకపిత ఐన భగవంతుడు కూడా అతనిని మిక్కిలి అభిమానిస్తాడు? అని "నేదిష్ఠో బ్రహ్మణో భవతి" అనే సూక్తిద్వారా వేదం తెలుపుతున్నది.

వేదానికి అపరావతారంగా చెప్పదగిన శ్రీమద్రామాయణంలో కూడా ఈ విధమైన శశ్రూష అనే వైదికమైన, పరమధర్మాన్ని గురించిన ప్రస్తావన మనకు కనిపిస్తుంది. తల్లిదండ్రులకు మిక్కిలి భక్తితోసేవ చేసే మునికుమారుని వృత్తాంతం అయోధ్యాకాండలో మనకు కనిపిస్తుంది. దీనిని దశరథుడు కౌసల్యకు తెలియజేస్తాడు. ఆ విధంగానే, తనకు పినతల్లి అయిన కైకేయిని మిక్కిలి భక్తిశ్రద్ధలతో శ్రీరాముడు శుశ్రూషను చేశాడు. అని కూడా శ్రీరామాయణం తెలియజేస్తున్నది. ఏ శాస్త్రోపదేశమైనా శుశ్రూషువు కానివానికి ఉపదేశించరాదని భగవద్గీత **"న చాశుశ్రూషవేవాచ్యమ్"** అనే సూక్తి ద్వారా తెలుపుతున్నది.

ఈ విధంగా వేదసిద్ధమైన, మహనీయులు అందరూ ఆచరించి చూపించినశుశ్రూష అనేవైదికమైన పరమధర్మాన్ని మనం కూడా ఆచరించి, ధన్యులం అవుతాం.

## అక్టోబరు నెల క్విజ్–15 సమాధానాలు

01) కత్తిమీద సాము
02) పరమాత్మ
03) గంగ
04) రెండు
05) శృంగగిరి
06) ఆదిశంకరులు
07) తిరువహీంద్రపురం
08) మార్గశిర
09) సౌందర్యరాజస్వామి
10) గరుడుడు
11) హరిశ్చంద్రుని కొడుకు
12) కాంచీపురం
13) భక్తి
14) అట్లతద్దె
15) వేదాంతదేశికులు
16) ఆరు
17) 120
18) సుప్రభాతం
19) చెన్నై
20) కౌస్తుభం

**'క్విజ్–15' సమాధానాలు కరెక్టుగా వ్రాసినవారు–**

01) అప్పికట్ల వెంకటసాయి ధన్వి, మచిలీపట్నం.
02) పి.శ్రీరామ్‌రెడ్డి, హైదరాబాద్.
03) ఆదిన హేమంత్ రాఘవసాయి, మంగళగిరి.
04) తుంపూడి జైవీర్ వరుణ్, హైదరాబాద్.
05) బలివాడ మానస, రెడ్డిపేట, శ్రీకాకుళం జిల్లా.



# భారతీయ గణితం

– ఆచార్య వి. రమేష్ బాబు,
94912 71729

భారతదేశమున గణిత శాస్త్రము వేదవిజ్ఞానశీర్షమని చెప్పిన శ్లోకము, వేదాంగజ్యోతిష్యములో ఈ విధంగా తెలియ జేయబడింది.

*"యథాశిఖా మయూరాణాం నాగానం మణయో*
*యథా తద్వద్వేదాంగ శాస్త్రాణాం గణితం మూర్ధని స్థితం"*

అన్నట్లుగా అతిప్రాచీనకాలం నుండి సమస్తమైన విజ్ఞానశాస్త్రాలలో గణితశాస్త్రానికి విశిష్టస్థానం, ప్రాముఖ్యత భారతదేశంలో కలదు. దీనికి చాలా కారణాలు మనం చెప్పుకోవచ్చు. కొన్ని ప్రత్యేకమైన అంకెలకు, కొన్ని జ్యామితి చిత్రాలకు మాంత్రిక శక్తి ఉన్నది అన్నటువంటి నమ్మకం, యజ్ఞవేదికలలో గాని, శక్తి చక్రముల నిర్మాణములందు గాని, ఏదైనా దోషము ఉన్నచో, దేవతల ఉగ్రకోపమునకు బలి అవుతారు అన్న భయం కూడా ఉండేది. ఆ తరువాత ఈ విశ్వం ఏర్పడడానికి కావలసిన 'కార్యకారణ సంభూతం' అను నమ్మకము ఏర్పడిన తరువాత జగత్తు యొక్క రహస్యాలను కనిపెట్టడానికి గణితమే ముఖ్య సాధనంగా గౌరవస్థానం ఇవ్వబడింది.

గ్రహణములను, గ్రహసంచార రీతులను నిర్ణయించ డానికి గణితము అత్యవసరమని, ఈశ్వరుడు సృజించినటువంటి సమస్తజగత్తులో ఉన్న ఖగోళరహస్యాలను కనుగొనడానికి గణితమే ప్రధాన సాధనం. కాబట్టి సృష్టికర్తయే ఈ గణితాన్ని, గణితరీతుల్ని, జగత్తుని సృజించెను అన్నటువంటి సత్యాన్ని మానవులు తెలుసుకోగలిగారు. గ్రహగతులలో, సౌరసిద్ధాంతాలు ప్రధానంగా మనందరికీ తెలిసినటువంటివే. అయితే ఖగోళశాస్త్రంలో నిర్వహించబడినటువంటి 'సూర్యకేంద్ర' సిద్ధాంతాన్ని, పాశ్చాత్యశాస్త్రవేత్తలు కనుగొనకముందే మన భారతావనిలో, ప్రతి శివుని యొక్క ఆలయంలో నవగ్రహాలుగా, మనం ఈ రోజున పూజలందించేటువంటి దేవతలు సిద్ధాంతాలకు సాక్ష్యంగా నిలిచారు.


1000 సంవత్సరాల కంటే కూడా ప్రాచీనమైన సూర్య సిద్ధాంతం ద్వారా భూమి యొక్క వ్యాసాన్ని 99 శాతం వరకు ఖచ్చితంగా అంచనా వేయడం జరిగింది. ఆ తరువాత బోధాయన సిద్ధాంతం. ఈ సిద్ధాంతం తరువాతి రోజులలో పైథాగరస్ పేరు మీదగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అనేక సూత్రాలను భారతీయులు అంతకుముందే ప్రాచీనకాలంలోనే వినియోగించే వాళ్లు. మనం చూసేటువంటి 'లంబకోణ త్రిభుజము'నకు చెందిన భుజములపై వైశాల్యములకు చెందిన సూత్రం పైథాగరస్ పేరుమీద ప్రసిద్ధిలో ఉంది, కానీ అదే సిద్ధాంతం పైథాగరస్ కంటే ముందుగా 300 సంవత్సరాల పూర్వమే రచింపబడిన బోధాయనశుల్బ సూత్రాలలో కనిపిస్తుంది.

అదేవిధంగా ప్రాచీనకాలం 300 సంవత్సరాలనాటి గోవిందస్వామి రచించిన 'సందర్భ విధానము', అతని తరువాత 1800 సంవత్సరాల తర్వాత పుట్టిన న్యూటను, గాస్ సైంటిస్టుల పేర్ల మీద ప్రచారంలోకి వచ్చింది. అంటే గోవిందస్వామి గారు రచించినటువంటి సందర్భవిధానాన్నే న్యూటను, గాస్ వారి పేర్ల మీద ప్రాచుర్యంలోకి తెచ్చుకోగలిగారు.

ఇక ప్రఖ్యాతమైన ప్రముఖ గణితశాస్త్రజ్ఞుల గురించి గనుక తెలుసుకుంటే మనకి చాలా ఆవేదన కలుగుతుంది, కారణం మన భారతీయ గణితశాస్త్రజ్ఞులు తెలియజేసిన విషయాలను, పాశ్చాత్యులు తెలియజేశారు అంటూ, ప్రాచుర్యంలోకి

వచ్చాయి. భారతీయ ప్రముఖ గణితశాస్త్రజ్ఞులు ఎంతో కృషి చేసి తెలియజేసినటువంటి విషయాలు, పాశ్చాత్యులు వాళ్ళ పేర్లమీద ఈ రోజున ప్రపంచంలో ప్రాచుర్యంలోకి తీసుకురాబడ్డాయి.

**భాస్కరాచార్య-1-** వీరు సూర్యుడు చుట్టూ భూమి తిరగడానికి పట్టే కాలాన్ని ఆ రోజుల్లోనే 365. 258756484 రోజులుగా, తొమ్మిది దశాంశస్థానాలవరకు ఖచ్చితంగా చెప్పగలిగారు. ఈ రోజున ఏ ఆధునిక సాధనంతో కూడా అంత ఖచ్చితత్వాన్ని కొలవలేని విధంగా ఆ రోజున, 5వ శతాబ్దానికి చెందినటువంటి భాస్కరాచార్య-1, భారతీయ ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు తెలియజేశారు.



అదేవిధంగా 6వ శతాబ్దానికి చెందిన **బ్రహ్మగుప్తుడు-** ధనాత్మక, ఋణాత్మక సంఖ్యలుగా సంఖ్యలను విభజించి, వాటి యొక్క వినియోగాన్ని వాడుకలోకి తీసుకువచ్చారు. 11వ శతాబ్దానికి చెందినటువంటి **శ్రీధరాచార్య** బీజగణితానికి చెందిన ద్వివర్గసమీకరణాలను ఏ విధంగా సాధించాలి? అన్నటువంటి ప్రక్రియని ప్రతిపాదించారు. త్రికోణమితి, క్యాలుకలస్ మొదలైన గణితశాస్త్ర విభాగాలకు కూడా అమూల్యమైనటువంటి సేవలను అందిస్తూ విశేషమైన కృషి చేశారు శ్రీధరాచార్య. 12వ శతాబ్దానికి చెందిన **భాస్కరాచార్య-2,** వీరు 'థియరీ ఆఫ్ కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్' అనేటువంటి అంశం పైన విస్తృతంగా కృషిచేసి **'అనంతం'** (ఇన్ఫినిటీ) అనే అంశంపైన ఎంతో అవగాహన కలిగించారు.

ఇలా ఎందరో, ఇంకెందరో, ఎందరెందరో గణితశాస్త్ర మహానుభావులు వారి అమూల్య పరిశోధనలను ఇంకా వెలుగులోకి రాకుండానే మసిబారిపోయిన పరిశోధనలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటి పైన విశేషమైన కృషిచేసి, వాటిని వెలుగులోకి తీసుకొని రావలసిన బాధ్యత భావితరాలపైన ఉంది.

## భర్తృహరి సుభాషితం

**పిసినారితన ముంటే..**
**మరొక దుర్గుణం అక్కరలేదు.**

**చాడీకోరతనం ఉంటే..**
**వేరే పాపాలతో పని లేదు.**

**సత్యముంటే..**
**తపస్సు చేయవలసిన అవసరం లేదు.**

**నిర్మలమైన మనస్సుంటే..**
**తీర్థసేవ లెందుకు?**

**మంచితన ముంటే..**
**వేరే పరివార మెందుకు?**

**తనలో గొప్పతనముంటే..**
**మళ్ళీ అలంకారాలెందుకు?**

**మంచి చదువుంటే..**
**ధన మెందుకు?**

**అపకీర్తి కలిగితే..**
**ఇంక మరణ మెందుకు?**

వ్యాఖ్యానం -
కీ.శే. మహామహోపాధ్యాయ ఎస్. లక్ష్మణయ్య

# మోక్షధామం 'అయోధ్య'

- డా॥ ఐ.ఎల్.ఎన్.చంద్రశేఖర రావు, 94919 46070

అయోధ్య- మధుర, మాయ (హరిద్వార్), కాశీ, కాంచీ, అవంతిక(ఉజ్జయిని), ద్వారవతి(ద్వారక) అనే సప్తమోక్ష పురాలలో ఒకటి-

శ్రీరాముడి జననంతో.. పాదధూళితో.. పాలనతో పునీతమైన పుణ్యక్షేత్రం.... 108 వైష్ణవ దివ్యతిరుపతులలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన పుణ్యధామం... **అయోధ్య!**

దేవతల చేత నిర్మింపబడి సకలసంపదలకు నిలయమైన స్వర్గధామం అని అథర్వణవేదంలో చెప్పబడిన అయోధ్య నగరానికి సంబంధించిన విశేషాలు వివిధపురాణాల్లో చెప్ప బడ్డాయి. పూర్వం సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడి కుమారుడైన మనువు అయోధ్యానగరాన్ని నిర్మించి పరిపాలన చేసినట్లు తెలుస్తోంది. అనంతరం అయోధ్య రాజ్యాన్ని తొమ్మిదిమంది ఆయన కుమారులు పంచుకోగా వారిలో మొదటివాడైన ఇక్ష్వాకుడికి అయోధ్య ప్రాంతం లభించింది. అందువల్ల ఆయన తర్వాత అయోధ్యలో పరిపాలించిన ఆయన వంశస్థులకు 'ఇక్ష్వాకు వంశస్థులు' అనే పేరు ఏర్పడింది. ఇక్ష్వాకుడి తర్వాత 19వ తరం పాలకుడు **'మాంధాత'**. మాంధాత తర్వాత ఐదవ తరంవాడు **'హరిశ్చంద్రుడు'**. అనంతరం ఈ రాజ్యాన్ని పరి పాలించిన వంశస్థులలో **భగీరథుడు, అంబరీషుడు, దిలీపుడు, రఘువు, దశరథుడువంటి** వారు గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందారు. దశరథుడు సంతానం కోసం అయోధ్యలోనే పుత్రకామేష్టియాగం చేసినట్లు కథనం. పుత్రకామేష్టి యాగం ఫలితంగా దశరథుడి భార్యలైన కౌసల్యకు **రాముడు**, కైకేయికి **భరతుడు**, సుమిత్రకు **లక్ష్మణుడు, శత్రుఘ్నుడు** అనే కుమారులు జన్మించారు. ఈ విధంగా రాముడు జన్మించిన పుణ్యభూమి 'అయోధ్య'.

తర్వాత యాగరక్షణకు విశ్వామిత్రుడు రామ లక్ష్మణులను తీసుకునివెళ్లి విలువిద్య నేర్పించి, యాగరక్షణ గావించడం, ధనస్సునును విరిచి శ్రీరాముడు సీతాదేవిని వివాహం చేసుకోవడం, కైక కోరికమేరకు శ్రీరాముడు సీత, లక్ష్మణులతో కలిసి అరణ్యవాసం వెళ్లడం, సీతను రావణుడు అపహరించడం, రాముడు రావణుని వధించి, సీతమ్మను రక్షించి, తర్వాత అయోధ్యానగరానికి చేరుకొని పట్టాభిషేకం చేసుకొని పరిపాలించడం, అశ్వమేథయాగం చేయడంవంటి రామాయణగాథలు అందరకూ తెలిసిందే. ఈ గాథలన్నిటి తోనూ ముడిపడిన నేల- **అయోధ్య.**

## చరిత్ర

చారిత్రకంగా పరిశీలిస్తే చరిత్రకందని పురాణకాలం నుంచే ఆయోధ్య భారతీయులకు అత్యంత పుణ్యప్రదమైనదిగా తెలుస్తోంది. ప్రాచీనకాలంలో మనదేశంలో షోడశ మహాజన పదాలు ఉన్న సమయంలో, అయోధ్య ప్రాంతాన్ని కోసల రాజ్యంగా పిలిచేవారు. 16 రాజ్యాలలో ఒకటైన కోసల రాజ్యం ప్రధానమైందిగా పేరు పొందింది. గుప్తచక్రవర్తి



అయిన చంద్రగుప్తవిక్రమాదిత్యుని కాలంలో అయోధ్య ప్రధానమైన క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ఆయన అనేక ఆలయాలను పునరుద్ధరింప చేయడంతోపాటు 360కి పైగా ఆలయాలను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

## దర్శనీయాలు

శ్రీరాముడి చేత అయోధ్య తరించబడింది. 'రామ నామం చేత మూడు తరాలు తరింపపబడ్డాయి' అని స్వయంగా హనుమంతుడు పేర్కొన్నాడు. శ్రీరాముడితో తరింపపబడిన అయోధ్యలో అనేక దర్శనీయాలు ఉన్నాయి.

## సరయూనది

అయోధ్యక్షేత్రం సరయూనదీతీరంలో ఉంది. భక్తులు ముందుగా సరయూనదిలో స్నానమాచరించి అనంతరం ఆలయాలను దర్శిస్తారు. సరయూనది హిమాలయాల్లో పుట్టినది. అందువల్ల నిత్యం నీరు ఉంటుంది. శ్రీరామచంద్రమూర్తి ఈ సరయూనదిలో దిగి అవతారం ముగించినట్టు పురాణాలు చెబుతున్నాయి. ఈ నది వెంట అనేక స్నానఘట్టాలు ఉన్నాయి. అందులో ప్రధానమైంది 'రామ్‌ఘాట్'. దీనినే స్వర్గద్వారము అని కూడా అంటారు. ఇందులో స్నానమాచరిస్తే ఇహంలో సౌఖ్యం, పరంలో మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. రామ్‌ఘాట్‌కు కొద్దిదూరంలోనే లక్ష్మణ్‌ఘాట్ ఉంది. ఇందులో పూర్వం లక్ష్మణుడు స్నానమాచరించినట్లు చెబుతారు. ఇక్కడ స్నానం ఆచరించడం కూడా పుణ్యప్రదంగా భక్తులు భావిస్తారు. కొలనులలాంటి చిన్న చిన్న కుండాలు అనేకం ఉన్నాయి. వీటిలో స్నానమాచరించడంవల్ల కూడా పుణ్యఫలాలు కలుగుతాయి అని స్థానికుల కథనం. వీటిలో ప్రధానమైంది వశిష్ఠకుండం.

## శ్రీరామమందిరం

అయోధ్య అనగానే రామమందిరం గుర్తుకు వస్తుంది. భారతీయులు రామమందిర దర్శనమే అయోధ్య దర్శనంగా భావిస్తారు. నూతనంగా నిర్మితమైన ఆలయం అనేక ప్రత్యేకతలు, విశేషాలతో కన్నుల పండువగా దర్శనం ఇస్తుంది. ఆలయం నాగరశైలిలో నిర్మింపబడింది. సిమెంట్, ఇనుము ఉపయోగించకుండా కేవలం రాతితో నిర్మాణం చేయడమే 'నాగరశైలి' ప్రత్యేకత. ఆలయం 67ఎకరాల విస్తీర్ణంలో నిర్మింపబడగా, ప్రధాన ఆలయం 2.77ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఆలయం మూడుఅంతస్తులు, ఐదుమండపాలను కలిగి ఉంది. నృత్య మండపం, రంగమండపం, కూడుమండపం, కీర్తనామండపం, ప్రార్థనామండపం అనేవి మండపాల పేర్లు. ఆలయం ఐదు గుమ్మటాలు, ఐదు ప్రవేశద్వారాలను కలిగి ఉంది. మూడు అంతస్థులు ఒక్కొక్కటి 20 అడుగుల ఎత్తును కలిగి ఉన్నాయి. కింది అంతస్థులో 160, మొదటిఅంతస్థులో 132, రెండవ అంతస్థులో 74 స్థంభాలు ఉన్నాయి. ప్రధానగర్భాలయం అష్టభుజిఆకారంలో నిర్మితమై 161 అడుగుల ఎత్తు ఉన్న శిఖరాన్ని కలిగి ఉంది. ప్రధాన ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలో శ్రీసీతాదేవి, శ్రీలక్ష్మణమూర్తి, భరతుడు, శత్రఘ్నుడు, శ్రీకృష్ణభగవానుడు, హనుమంతుడువంటి దేవతా మూర్తులకు ఉపాలయాలను నిర్మించారు. ఆలయంలో 6 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు ఉన్న 2100 కిలోల బరువు ఉన్న గంటను ఏర్పాటు చేశారు. ఆలయప్రాంగణంలో ఉపన్యాసవేదిక, వేదపాఠశాల, నక్షత్రవనం, తవ్వకాలలో లభించిన వస్తువులతో మ్యూజియంవంటివి ఏర్పాటు చేయబడ్డాయి. కాగా మూలమూర్తులను గండకీ నదిలో లభించే సాలగ్రామ శిలలను నేపాల్ నుంచి తెప్పించి తయారు చేయడం విశేషం. ఈ విధంగా శ్రీరామాలయం కనుల పండువ చేస్తూ దర్శనం ఇస్తుంది.

## శ్రీఆంజనేయస్వామి ఆలయం

సరయూనదికి కొద్దిదూరంలో పురాతనమైన శ్రీఆంజనేయస్వామి ఆలయం ఉంది.అయోధ్యలో ప్రధానదేవుడిగా భావించే ఈ హనుమాన్ ఆలయం ఎత్తుగా కోటలాగా దర్శనమిస్తుంది. 76మెట్లు ఎక్కి ఆలయంలోకి చేరుకోవచ్చు. శ్రీరాముడి పట్టాభిషేకం జరిగి అయోధ్య రాజ్యాన్ని పరిపాలిస్తున్న సమయంలో హనుమంతుడు ఈ ఆలయం ఉన్న ప్రాంతంలో నివాసమున్నట్లు స్థలపురాణ కథనం. అంజనాదేవి ఒడిలో ఉన్న హనుమంతుణ్ణి దర్శించి పూజించడంవల్ల సంతానంలేని వారికి సంతానభాగ్యం కలుగుతుందని, చిన్నతనంలో బాధించే అనారోగ్యసమస్యలు ఉండవని చెప్పబడుతోంది.



మందిరం, శ్రీరాముడు వనవాన కాలంలో కొంతకాలం తర్వాత శ్రీరాముడి పాదుకలను ఉంచినట్టుగా చెప్పబడుతూ ఉన్న పాదుకామందిరంలను దర్శించవచ్చు. వీటితో పాటు వాల్మీకి రామాయణ భవనం, రామకథమ్యూజియం, అంగద్‌ధిల్లా, సుగ్రీవ ధిల్లా, తులసి స్మారక భవనం, బ్రహ్మ కుండం, లక్ష్మణఖిల్లా, జానకిమహల్, నాగేశ్వరనాథ ఆలయం, శేషమహల్, వేద భవన్, గోవిందరాజమందిరం, బిర్లామందిరంలను భక్తులు దర్శించవచ్చు.

## రామ్‌కోట్

హనుమంతుడి దేవాలయానికి ఎదురుగా ఉన్న వీధిలో రామ్‌కోట్ ఉంది. అంటే శ్రీరాముడు నివాసం ఉన్నట్లుగా చెప్పబడే భవనం. దీనిని సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే శ్రీరామనవమి రోజు తెరుస్తారు. విశేష ఉత్సవాలు చేస్తారు.

## కనక భవన్

రామ్‌కోట్ పక్కనే ఉన్న సందులో కనక భవన్ ఉంది. దీనినే 'సోనేకిఘర్' అనే పేరుతో పిలుస్తారు. ఇది కైకేయికి చెందినది. కైకేయి దీనిని సీతాదేవికి బహుమానంగా ఇచ్చినట్లు కథనం. ఈ భవనంలో శ్రీసీతారాములవారి బంగారు కవచ విగ్రహాలతో పాటు శ్రీరాముడి కుటుంబసభ్యుల మూర్తులను దర్శించవచ్చు. ఈ కనకభవన్ అంతా వెండిరేకులతో తాపడం చేయబడి ఉంది. ఇందులో ఉన్న దేవతామూర్తులతోపాటు ఆలయంలోని శిల్పకళ భక్తులకు నయనానందాన్ని కలిగిస్తుంది.

## మరికొన్ని

కనకభవనానికి కొద్దిదూరంలో, రావణవధానంతరం అయోధ్యకు వచ్చిన శ్రీరాముడు తొలిసారిగా భరతుడిని కలసిన భరత్‌మిలాప్ ఆలయాన్నీ, దశరథుడు నివాసం ఉన్నట్లుగా– పరిపాలన కేంద్రం, సింహాసనం ఉన్న ప్రాంతమని చెప్పే దశరథ

ప్రతిరోజు అసంఖ్యాక భక్తులు దర్శించుకునే అయోధ్య క్షేత్రంలోని వివిధఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఉత్సవాలు జరుగుతాయి. వీటితోపాటు శ్రావణమాసం ఉత్సవాలు, అక్టోబర్–నవంబర్ నెలల్లో పరిక్రమమేళా, సరయూ స్నానోత్సవాలు, నవంబరులో శ్రీరామవివాహం, రామాయణ మేళాలు, జూన్–జూలై నెలల్లో రథయాత్ర మొదలైన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి.

అయోధ్యలో కనకభవన్ ధర్మశాల, బిర్లాధర్మశాల, గుజరాత్‌భవన్ ధర్మశాల, రామచరితమానస్ ధర్మశాలలో భక్తులకు వసతి సౌకర్యాలు లభిస్తాయి.

సర్వపాపాలను హరించి అనంతపుణ్యాలను ప్రసాదించే అయోధ్యను దర్శించి భక్తులు తరించవచ్చు.

**అయోధ్యాయై నమస్తేఽస్తు రామ పూర్వై నమో నమః**
**అయోధ్యాయై నమస్తుభ్యం సత్యాయైతు తే నమో నమః॥**



అయోధ్యక్షేత్రంలోని వివిధ ఆలయాల్లో శ్రీరామనవమినాడు ప్రత్యేక పూజలు జరుగుతాయి




# తోడు

– శ్రీ ఎ.వి.సుందరరావు

మా ఆవిడకు ఏదోవిషయంలో పీకలమీదికి వస్తే “తండ్రీ ఈ గండం గడిచేటట్టు చెయ్యి. నడచి నీకొండ ఎక్కుతా” నన్నది. గండం గడచిపోయింది. ఆసమయం రానే వచ్చింది.

సరిగ్గా సాయంత్రం నాలుగున్నరకి దిగువ తిరుపతి చేరాం. దిగుతూనే శ్రీవారికొండ దిశగా పయనం సాగించాం. నేనూ, మా ఆవిడా నడచి ఏడుకొండలూ ఎక్కడానికి.

మేమిద్దరం కాలినడకన కొండ ఎక్కడానికి ప్రారంభించాం. అలిపిరిలో తొలిమెట్టువద్ద దేవునికి దీపంవెలిగించి ‘గోవిందా’ అంటూ ఉత్సాహంగా మెట్లు ఎక్కడం మొదలెట్టాం. పట్టున వందమెట్లు ఎక్కలేదు. మాఉత్సాహం చల్లబడిపోయింది. ఇరువురికి ఆయాసం ఒగర్పు. టైము ఆరున్నరయింది. చుట్టూతా నల్లటికొండలు చీకటి.

మేమిద్దరం ఒకరికి ఒకరు తోడు, తప్పించి మాకు వేరే తోడు లేదు. కొండమెట్లు ఎక్కుతున్న కొద్దీ శ్రమా, చీకటి. ఒకటితో ఒకటై పోటీ పడుతున్నాయి. కొండదిగే జనం క్రమేపి పల్చబడు తున్నారు. కొంతసేపటికి ఆ ఆస్కారంకూడా లేకపోయింది.

మొదటి పర్వతం దాటి చాలాదూరం వచ్చేశాం. టైము ఎనిమిది కావస్తోంది. ఆ అరణ్యంలో ఆ కొండలమధ్య నేనూ, మా ఆవిడా తప్పిస్తే మరెవరూ తోడు లేరు. అప్పుడనిపించింది. రాత్రికి తిరుపతిలోనే బసచేసి ఉదయాన్నే ఈ నడక ప్రయాణం పెట్టుకుంటే బాగుండి పోయేదనుకున్నాం. “ఎన్నిమెట్లెక్కినా, కానరావేమయ్యా..” ఆ పాటకర్థం అప్పుడే తెలిసింది. అసలు ఈ రాత్రికి గమ్యం చేరతామో, మధ్యలో దొంగలదోపిడికి గురికావడమో, ఏ జంతువువాత పడటమో జరగడం ఖాయమనిపించింది.

మా భయానికి తగ్గట్టు సన్నగా వానచినుకులు ప్రారంభ మయ్యాయి. దానికి తగ్గట్టు అనుకోకుండా కాలిబాటలో లైట్లుకూడా



పనిచేయకపోవడంతో మా ఆవిడ కెవ్వుమని కేకేసింది. ముందు దారి కనిపించడంలేదు. చినుకులు జడివానగా మారింది. మా ఆవిడ భయంతో “మనం ఏం అపరాధం చేశామండీ మనకీ శిక్షేమిటి” అంటూంది.

ఇహ నా పరిస్థితి. “ప్రాణంబులా రావుల్ తప్పెను మూర్ఛ వచ్చె, తనువున్ డస్సెన్.. శ్రమంబయ్యెడిన్ నీవే తప్ప ఇతఃపరంబెరుగ” అని చేతులెత్తి శ్రీనివాసునికి మ్రొక్కడం తప్పించి మరోదారి కనిపించ లేదు. ఆవిడకూడా అదే ధోరణి. టక్ టక్.. మని శబ్దం మావేపు క్రమేపీ దగ్గరవుతోంది. భయం భయంగా గుడ్లప్పగించి, ఆ శబ్దం దిశగా చూస్తున్నాం. శబ్దం క్రమేపీ దగ్గరయింది. చీకటిలో లీలగా ఏదో మానవాకారం.. టెక్ టెక్ మని శబ్దం. “ఎవరు బాబూ” స్త్రీ కంఠం. పరికించి చూశాను. నడివయసు దాటిన కూలీనాలీ చేసుకొనే ఆడది. నెత్తిమీద కర్రలమోపు.

“ఎవరదీ” గొంతును విడదీసి అడిగేను.

“కట్టెలమోపు బాబూ.. ఇయ్యాల ఆలీసం అయి పోనాది.. భయంనేదు.. పదండి బాబూ.. నేను తోడుంటాను. ఈ కొండలు–కోనలూ.. అడవులూ అన్నీ మాకు కొట్టినపిండీ”అంది.

ఇంతలో పనిచేయని లైట్లన్నీ ఒక్కసారి వెలిగాయి. దీప తోరణాలతో కొండలన్నీ అందాలు దిద్దుకున్నాయి. వాన తగ్గిపోయింది. ఏ కొండల మాటునుండో చంద్రుడు తొంగిచూసి పక్కున నవ్వాడు.

నాడు అన్నమయ్యను ఆదుకున్న ఆ అలిమేలుమంగమ్మేమో ఈ స్త్రీ మూర్తి. మనసారా మొక్కాము. మిగతా పయనమంతా నల్లేరు మీద నడక.

స్వామి ఆసమయంలో ‘తోడు’ ఉన్న రీతి జీవితంలో మరపురాని అనుభూతి!

గోవిందా! గోవిందా!! గోవిందా!!!

ఆయుర్వేదం

# ఆరోగ్య పరిరక్షణకు 'మినుములు'

-డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ప్రకృతిలో మనకు రెండు విధాలుగా ఉపయోగపడే పదార్థాల్లో 'మినుముల' పాత్ర తక్కువేమి కాదు. ఆంగ్లంలో 'బ్లాక్‌గ్రామ్'గా పిలువబడే మినుములను కొన్ని ప్రాంతాల్లో 'ఉద్దిబేడ'లు అంటారు. ఈ మినుములు నవగ్రహాల్లో రాహువుకి ప్రీతిపాత్ర మైనదిగా మన సనాతన వాఙ్మయం చెబుతోంది.

అప్పడాలు, వడియాలు, సున్నుండలు, ఇడ్లీలు, మిన పట్లు, గారెలు, ఆవడలు లాంటి ఆహార పదార్థాల తయారీలో మినుములను ఉపయోగిస్తారు. ఔషధంగా ఈ మినుములను ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం.

**ఎక్కిళ్ళు తగ్గేందుకు:** ఒక ఇనుపబాణలి లేదా ఇనుప గరిటె లేదా నిప్పులపై కేవలం మినుములనే నలగ్గొట్టి లేదా నలగ్గొట్టిన మినుములు, ఇంగువ కలిపి గాని వేసి వచ్చే పొగను పీలిస్తే సత్వరమే ఎక్కిళ్ళ బాధ నుంచి ఉపశమనం లభిస్తుంది.

**పేనుకొరుకుడు సమస్యకు:** మినుములు, సైంధవలవణం, ఆయుర్వేదమందులషాపులో దొరికే చంగల్వ కోష్ఠు, సారపప్పు, ఇప్ప పువ్వులను సమానంగా తీసుకొని చూర్ణించి, కలిపి మెత్తగా దంచి ఉంచుకొని, రోజూ ఒకసారి తగినంత ఔషధంలో తగినంత తేనె కలిపి, లేపనంగా చేసి పట్టించి 2, 3 గంటలాగి కడిగేస్తుంటే త్వరగా సమస్య తగ్గుతుంది.

**కేశాలు దట్టంగా పెరిగేందుకు:** రాత్రి పూట తగినన్ని నీటిలో 50 గ్రాముల చొప్పున మినుములు, మెంతులు వేసి ఉదయం ఆ పదార్థాన్ని నూరి, 200 మి.లీ.ల కొబ్బరినూనెలో కలిపి, పొయ్యి మీద పెట్టి నురుగు వచ్చేదాకా మరిగించి దించి చల్లార్చి వడగట్టుకొని హెయిర్ ఆయిల్‌గా వాడుకోవచ్చు (లేదా) వారానికి రెండు సార్లు రాత్రి పూట తగినంత నిమ్మరసంలో 25 గ్రాముల చొప్పున మినుములు, మెంతులు, ఉసిరిక పెచ్చులను కలిపి నీటిలో నానించి, ఉదయం మిక్సీలో వేసి అంతా కలిపి తలకి పట్టించి గంటసేపాగి తలస్నానం చేస్తే వెంట్రుకల కుదుళ్ళు దృఢపడి, వెంట్రుకల రాలటం బాగా తగ్గి, కేశాలు అందంగా మృదువుగా, నల్లగా, సౌందర్యవంతంగా పెరుగు తాయి. చుండ్రు సమస్య కూడా తగ్గుతుంది.

**కీళ్ళనొప్పులకు తైలం:** 30మి.లీ. నీటిలో 10 గ్రాములు నల గ్గొట్టిన మినుములను అరగంటసేపు నానించి, అంతా మెత్తగా నూరి అందులో 100 మి.లీ. నువ్వులనూనె కలిపి పొయ్యిపై పెట్టి, నీరంత ఇగిరిపోయి నూనె మాత్రం మిగిలేలా కాచి దించి చల్లార్చి వడగట్టి కీళ్ళ భాగంలో పట్టించి సున్నితంగా మర్దన చేస్తుంటే మోకాళ్ళనొప్పులు, నడుం నొప్పులు, భుజాల నొప్పులు, మెడనొప్పులు లాంటివి తగ్గుతాయి.

**కీళ్ళ నొప్పులు, ఒంటి నొప్పులకు కషాయం:** మినుములు, ఆయుర్వేద మందులషాపులో దొరికే అశ్వగంధ, బలావేర్ల చూర్ణాలను సమానంగా కలిపి ఉంచుకుని, రోజూ రెండుసార్లు పూటకు ఒక టీ స్పూన్ ఔషధాన్ని 200 మి.లీ. నీటిలో వేసి, కాస్త అల్లం ముక్కను కూడా నలగ్గొట్టి వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి, దించి చల్లార్చి వడగట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగితే వివిధరకాల వాత నొప్పులు తగ్గిపోతాయి.

**ముఖం సౌందర్యవంతంగా ఉండేందుకు:** పొట్టు తీసిన మిన ప్పప్పు నాలుగు టీ స్పూన్లు, అవిసె గింజలను వేయించి చేసిన చూర్ణం రెండు టీ స్పూన్లు, పిప్పళ్ళ పొడి ఒక టీ స్పూను కలిపి ఉంచుకుని తగినంత పొడిలో తగినంత నెయ్యి కలిపి ముఖానికి పట్టించి గంటసేపాగి కడిగేస్తుంటే ముఖం గరుకుతనం పోయి కోమలంగా మృదువుగా నాజూగ్గా కాంతివంతంగా అందంగా తయారవుతుంది.





శేషశాయికి మ్రొక్కు శిరము, శిరము

# డిసెంబరు, 2023 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** మీ సంకల్ప శక్తి పెరిగి మిమ్ములను విజయానికి దగ్గరజేస్తుంది. ఆరోగ్యం సంతృప్తి కరంగా ఉంటుంది. మీ ఆదాయవనరులు అనూహ్యంగా పెరుగుతాయి.



**వృషభం-** ఉద్యోగములో క్రోధము వీడిన పై అధికారులతో సహోద్యోగులతో ఇబ్బందులు తొలగుతాయి. ఈ మాసం రవి కుజ గ్రహాల సంచారం అనుకూలంగాదు, దోషనివారణకు సుబ్రహ్మణ్య సూర్య ఆరాధన మంచిది.



**మిథునం-** సంతోషం మరియు సంతృప్తి సంపదలాభం కల్గుతుంది. మీరు స్నేహితులు మరియు బంధువుల నుండి గౌరవం మరియు గుర్తింపు పొందుతారు.



**కర్కాటకం-** గ్రహస్థితి అనుకూలం. స్నేహితుల వలన లాభాలు, వ్యాపారవృద్ధి, శత్రువులపై జయం, శుభవార్తలు వింటారు. ప్రభుత్వం నుండి సహాయం వస్తుంది.



**సింహం-** మీరు కొత్తబట్టలు మరియు ఉపకరణాలు కొనుగోలుచేస్తారు. ఈ సమయంలో మీరు రత్నాలు మరియు ఆభరణాల కొనడానికి డబ్బును ఖర్చు చేసే అవకాశం ఉంది. నూతన నిర్మాణం చేయడం కానీ, గృహం కొనుగోలు చేయడం కానీ చేస్తారు.



**కన్య-** విద్యావిషయాల్లో రాణిస్తారు. మీరు కొత్తవిషయాలను అధ్యయనం చేస్తారు మరియు కొత్తనైపుణ్యాలను నేర్చుకుంటారు. పోటీ పరీక్షలలో ఖచ్చితంగా విజయం సాధ్యమవుతుంది.



**తుల-** మీ వాగ్ధాటి వలన గౌరవం పొందుతారు. వృత్తిలో పురోగతి, ఆనందం, మంచి ఆరోగ్యం మరియు సంపదలో పెరుగుదల కాలం.



**వృశ్చికం-**గృహమున శుభకార్యశోభ, మంగళ తోరణములు. మీ సహోద్యోగులు మరియు స్నేహితుల నుండి ప్రశంసలు పొందుతారు. మీరు చాలా ముఖ్యమైన జ్ఞానాన్ని పొందుతారు. మీరు స్ఫూర్తిదాయకమైన వ్యక్తులసంస్థలో ఉంటారు.



**ధనుస్సు-** సంస్థాగతమైన ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నం చేస్తారు. క్రమశిక్షణ ధైర్యంతో ప్రణాళికలను అమలుచేసి విజయం సాధిస్తారు. భాగస్వామ్య వ్యాపారాన్ని జాగ్రత్తగా నడుపుతారు.



**మకరం-** సమస్తదోషాలు తొలగి వ్యాపారాలలో రాణిస్తారు. విద్యార్థులు చదువుల్లో రాణిస్తారు. గతంలోని సమస్యలు ఒక కొలిక్కి వస్తాయి. నూతన గృహం కొనుగోలు చేస్తారు.




**కుంభం-** మీ అధికారం విస్తరిస్తుంది. ప్రజా సంబంధాలు పటిష్టపరచుకొనుటకు మీరు చేయు ప్రయత్నం ఫలిస్తుంది. దైవబలం పెరుగుతుంది. పరిశోధనారంగానికి సంబంధించి నూతన విషయాలను కనుగొంటారు.



**మీనం-** మీ అధికారంవల్ల వివిధ అధికారిక కార్యకలాపాల్లో విరివిగా పాల్గొంటారు. ప్రజాసంబంధాలు పటిష్టపరచుకొంటారు. సంతానం విజయాలు సాధిస్తారు. మానసిక ప్రశాంతత కలుగుతుంది. శుభవార్తలొస్తాయి.

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## ఆలివంకవారు ఆత్మబంధువులు

ఆలివంకవార లాత్మబంధువు లైరి;
తల్లివంకవారు తగినపాటి;
తండ్రివంకవారు దాయాది తర్కమౌ;
విశ్వదాభిరామ వినుర వేమ!

**అర్థాలు:** వంక=వైపు; దాయాది= జ్ఞాతి(శత్రువు); పాటి= సమానం; తర్కము= పరిశోధన.

**భావం:** పరిశోధించి చూస్తే భార్యవైపువారు ఆత్మబంధువులుగా ఉంటారు. తల్లివైపువారు అంతంత మాత్రంగా ఉంటారు. తండ్రివైపువారు పగవారుగా మిగిలిపోతారు.


**వివరణ:** పిల్లలకు చిన్నప్పటినుండి అమ్మా, నాన్నలలో అమ్మవైపు చుట్టాలపై అభిమానం అధికంగా ఉంటుంది. వాళ్లు కొంచెం ఎక్కువగా గారాబం చేస్తుంటారు కదా. తండ్రి వైపుబంధువులు సంప్రదాయం, క్రమశిక్షణ, వంశగౌరవం ఇత్యాదికారణాలతో కొన్నికఠిననియమాలను పెట్టడంవల్ల కావచ్చు వారితో దూరంగా ఉంటారు. వయసు పెరిగినతరువాత వాళ్లను దాదాపు శత్రువులుగా చూస్తారు. ఆతరువాత పెండ్లి అనేబంధంతో స్త్రీ పురుషుడిఇంట్లో ప్రవేశిస్తుంది. కొన్నాళ్లకు భార్యవంకచుట్టాలకు ఆయింట్లో ప్రాధాన్యం క్రమంగా అధికమౌతుంది. భార్యతోడి సాన్నిహిత్యంవల్ల ఆమె వంక బంధువులు అత్మీయులవుతారు. ఇది లోకంలో సహజం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## గో జన రక్షణార్థమై గిరి నొక కేల నెత్తెనట..

పరహితమైన కార్యమతి।
భారముతోడదియైనఁబూను స
త్పురుషుఁడు లోకముల్పొగడఁ।
బూర్వము నందొక ఱాలవర్షమున్
గురియఁగజొచ్చినన్ గదిసి।
గొబ్బున గోజన రక్షణార్థమై
గిరి నొక కేల నెత్తెనట।
కృష్ణుడు ఛత్రముభాతి భాస్కరా!




ఇతరుల మేలు చేయు కార్యమునందు కొంత భారమైనప్పటికీ మంచిమనస్సు కలవాడు లోక కల్యాణార్థము పూనుకొనును. లోకముచే పూజింపబడును. పూర్వము ఒక రాళ్ళవర్షము కురుస్తున్నప్పుడు కృష్ణుడు గోవుల, గోపాలకుల రక్షణార్థం కొండను ఒక వేలుపై ఎత్తినాడు కదా!

వ్యాఖ్యానం– డా॥ పల్లేరు వీరాస్వామి.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-26

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య నిర్వహణ- కీ.శే. మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | | | | |
|---|---|---|---|---|---|
| चोष्यम् | = పులుసు | चुक्रम् | = చింతపండు | गमिष्यति | = వెళ్ళగలడు |
| गत्वा | = వెళ్ళి | सूपम् | = పప్పు | नेष्यति | = తీసుకొని వెళ్ళగలడు |
| नीत्वा | = తీసుకొని వెళ్ళి | आगत्य | = వచ్చి | आनयति | = తీసుకొని వచ్చుచున్నాడు |
| गमिष्यति | = వెళ్ళగలడు | नेष्यति | = తీసికొని వెళ్ళగలడు | | |

అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) चोष्ये लवणं नालम्।

02) सूपः सम्यगस्ति।

03) गृहे चुक्रमस्ति किम्?

04) त्वं तत्र गत्वा किञ्चित् चुक्रमानय।

05) रामः आनयतु। अहं रामठम् आनेष्यामि?

06) यूयम् अस्मद्गृहम् आगमिष्यथ किम्?

07) तथैवागमिष्यामः।

08) त्वं शीघ्रं गच्छ।

09) ते सर्वेऽपि अस्मद्गृहे भोजनार्थमागमिष्यन्ति।

10) सूपः अपि नास्ति, कथं करिष्यन्ति वा?

అ) జవాబులు

01) పులుసులో ఉప్పు చాలదు.

02) పప్పు బాగున్నది.

03) ఇంటియందు చింతపండు ఉన్నదా?

04) నీవు అక్కడికి వెళ్ళి కొద్దిగా చింతపండు తీసుకురా.

05) రాముడు తీసుకు వచ్చుగాక.
నేను ఇంగువ తీసుకురాగలను?

06) మీరు మా ఇంటికి వస్తారా ఏమి?

07) అలాగే రాగలము (వస్తాము).

08) నీవు వెంటనే వెళ్ళు.

09) వారందరూ మా ఇంటికి భోజనం కొరకు వస్తారు (రాగలరు).

10) పప్పు కూడా లేదు, ఎలా చేస్తారు?

ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవు వంటను చేయుము.

02) నేను నీరు తేగలను.

03) తరువాత మీరందఱును స్నానము చేసి భోజనము చేయగలరు.

04) మీరు వెళ్ళి మా తండ్రిని తీసుకొని రండు.

05) నేనక్కడే యుందును.

06) మీరిక్కడ ఆలస్యము చేయకుడు.

07) త్వరగా రండు.

08) నీవు మా అన్నను తీసికొని రమ్ము.

09) పిల్లలను త్వరగా తీసికొని పొండు.

10) అలాగే తీసికొని రాగలను.

ఆ) జవాబులు

01) त्वं पाकं कुरु।

02) अहं जलम् अनेष्यामि।

03) तदनन्तरं यूयं सर्वे स्नानं कृत्वा भोजनं करिष्यथ।

04) यूयं गत्वा अस्मत्पितरं आनयथ।

05) अहं तत्रैव वसामि (भवामि)

06) यूयम् अत्र आलस्यं मा कुरुथ।

07) वेगेन (त्वरया) अगच्छथ। (शीघ्रं)

08) त्वम् अस्मद् अग्रजम् आनय।

09) बालकान् शीघ्रं स्वीकृत्य गच्छथ।

10) तथैव स्वीकृत्य आनेष्यामि। (अस्तु स्वीकृत्य आनेष्यामि।)


చిత్ర కథ

# గాడిద కూడా గురువే!

కథ - శ్రీమతి ఎ.శ్రీనిధి
చిత్రాలు - శ్రీ టి.కమలకణ్ణన్

ఒక గురుకులంలో గురువు ప్రతిరోజూ తన శిష్యులకు పాఠాలు చెప్పిన తర్వాత, కొంచెం సేపు శిష్యులతో మాట్లాడం అలవాటు. ఆ సందర్భంలో శిష్యులు-






ఆ సమయంలో (ఉదయం) గాడిద తన వీపుపై బాగా మురికి పట్టిన బట్టలమూటను మోసుకుంటూ వెళ్తోంది. ఆ మూటలో రాజు గారి బట్టలే కాకుండా, ఊరిలోని వారందరి మురికి బట్టలున్నాయి. ఆ గాడిద తనపై ఉన్న బట్టల మూట మురికిగా ఉందని అనుకోవడం లేదూ, దుర్వాసన కొడుతోందని కూడా అనుకోలేదు; రాజుగారి బట్టలు మోస్తున్నానే గర్వమూ పడలేదు. అలాగే ప్రజలందరి బట్టలు మోస్తున్నాననీ బాధపడలేదు.

అదేవిధంగా సాయంకాలం ఆ గాడిద తన వీపు మీద బాగా ఉతికిన, మంచివాసన కల్గిన శుభ్రమైనటు వంటి బట్టలు మోసుకు వెళ్తున్నదాని ప్రక్కన ఎవరైతే ఉదయం ముక్కులు మూసుకున్నారో, వారు రావడం జరిగింది. అప్పుడు వారందరికీ (అంటే రాజు, సేవకులు, ప్రజలకు) వారి వస్త్రాలలోని దుర్వాసన, సువాసనలు తెలిసింది. కానీ, నేను అన్నింటికీ మించి 'కష్టపడటం' అనే ఒకే ఉద్దేశ్యంతో, ఎటువంటి భేదభావం లేకుండా ఆ గాడిద పని చేస్తోంది" అని తెలుసుకున్నాను.




**నీతి:** మనకు సుఖం కల్గినప్పడు పొంగిపోకూడదు, దుఃఖం కల్గినప్పడు క్రుంగిపోకూడదు. అంటే ధనికులు, పేదవారు అన్న భేదభావం లేకుండా ఎల్లప్పుడూ ఒకేలాగా ఉండాలి అనే విషయాన్ని గాడిదమూలంగా తెలుసుకున్నాను. అందుచేత 'గాడిద కాదా నాకు గురువే' అని శిష్యులకు తెలిపాడు.



సర్వే జనాః సుఖినో భవన్తు

# బాలవినోదం

## జత చేయండి






సమాధానాలు: 1-ఇ, 2-అ; 3-ఆ

## అంకెలు కలపండి!!



పిల్లలూ.. చక్రంలోని ఆయా వర్ణాలలోని ప్రశ్నలకు అనుగుణంగా, ప్రక్కన ఉన్న అదే వర్ణం గల నిలువుగడులలో సరియైన సమాధానం వ్రాయండి!







సమాధానాలు:
కౌసల్య, సీత, గుహుడు, జటాయువు, హనుమంతుడు,
భరతుడు, అయోధ్య, లంక

# రంగుల ప్రపంచం

బాలచిత్రకారులూ! **రంగులు** ఉన్న బొమ్మను చూసి, ఆ రంగులనే.. రంగులు లేని బొమ్మకు వేయండి!!







# సంఖ్యావినోదం



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 13 | 17 | 18 | 16 | 19 |
| | | ← | 20 | 19 | 11 | 17 |
| 10 | 18 | 13 | 12 | 18 | 15 | 19 |
| 19 | 17 | 15 | 16 | 17 | 11 | 13 |
| 16 | 20 | 14 | 16 | 15 | 18 | 17 |
| 18 | 11 | 13 | 12 | 18 | 20 | 15 |
| 15 | 20 | 19 | 11 | ← | | |





11 నుండి 20 వరకు ఉన్న సంఖ్యలు వరుసగా కలుపుతూపోతే అర్జునుడు శ్రీకృష్ణుని దగ్గర గీతోపదేశం పొందే మార్గం వస్తుంది.



# పిల్లలూ.. ఈ బొమ్మలో 7 తేడాలు గుర్తించండి!





## బాలనీతి



# బ్రాహ్మణుడు - పేలపిండి

- శ్రీమతి దినవహి సత్యవతి

అనగనగా ఒక పట్టణంలో రామశర్మ అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు ఒకనాడు తన స్నేహితుని ఇంటిలో జరిగిన కార్యక్రమానికి భోజనానికి వెళ్ళాడు. అక్కడ గారెలు, బూరెలు మొదలైన పిండివంటలు ఎక్కువగా తిని వేయడంతో పొట్ట బరువై ఆయాసం వచ్చింది.

అలా ఆయాసపడుతూ నెమ్మదిగా నడిచి వెళుతుండగా దారిలో మరొకరు పిలిచి, ఒక కుండనిండా పేలపిండి పోసి రామశర్మకి దానం ఇచ్చారు.



అసలే ఇబ్బందిగా నడుస్తున్న రామశర్మకి తలపై కుండ బరువు తోడై, కొంచెం దూరం నడచేటప్పటికి అలసటగా అనిపించి, దారిలో ఒక కుమ్మరి చావడి చూసి రెండునిమిషాలు అలసట తీర్చుకుందామని అటుగా నడిచాడు.

‘అయ్యా! నేనిక్కడ కాసేపు కూర్చోవచ్చా?’ అని చావడిలో కుండల దగ్గర కూర్చున్న వ్యక్తిని అడిగాడు.

‘కూర్చోండి’ అని ఆ వ్యక్తి ఆసనం ఒకటి చూపించాడు.

‘దాహంగా ఉంది కొంచెం మంచినీళ్ళు ఇస్తారా?’ అని రామశర్మ ఆ వ్యక్తిని మళ్ళీ అడిగాడు.

కుమ్మరి ఇచ్చిన మంచినీళ్ళు త్రాగి, పేలపిండి కుండని కాళ్ళ దగ్గరగా పెట్టుకుని చావడిలో ఒక ప్రక్కగా వెల్లకితలా పడుకుని చేతులు తలక్రింద పెట్టుకుని ఆలోచనలలో మునిగిపోయాడు రామశర్మ.

‘ఈ పేల పిండిని బజారులో అమ్మి ఆ వచ్చిన డబ్బుతో ఒక మేకని కొని బాగా మేపుతాను. ఆ మేక రెండుపిల్లల్ని పెడుతుంది. ఆ మేక పిల్లలు పెద్దవై అవీ పిల్లలు పెడతాయి. అలా 10 మేకలు 100 మేకలయ్యాక వాటనన్నిటినీ అమ్మి ఆవులను కొంటాను. ఆ ఆవులు ప్రతి సంవత్సరమూ దూడలను కంటాయి. ఆ ఆవుల పాడి.... పాలు, పెరుగు, వెన్న అమ్మగా వచ్చిన డబ్బుతో పొలం కొంటాను. పొలాన్ని కౌలుకి ఇస్తాను. పొలంలో పండిన ధాన్యం అమ్మి బంగారం కొంటాను.

తరువాత ఆ ఆవులన్నిటినీ అమ్మి ఒక పెద్ద భవనం కొంటాను. నా డబ్బు చూసి ఎంతో మంది నాకు తమ పిల్లనిచ్చి పెళ్ళి చేస్తామని నాచుట్టూ తిరుగుతారు. అప్పుడొక చక్కటి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుంటాను. కొన్నాళ్ళకి నాకు ఒక కొడుకు పుడతాడు. వాడికి ‘సోమలింగం’ అని పేరు పెడతాను. పిల్లవాణ్ణి అల్లారు ముద్దుగా పెంచుతాను. పిల్లాడు ఏడుస్తుంటే ఎత్తుకోమన్నప్పుడు నా భార్య నా మాట వినక పోతే ఒక్క తన్ను తంతాను........’ అనుకుంటూ ఒక్క తన్ను తన్నినట్లుగా గాలిలో కాలు జాడించాడు.

ఆ కాలు జాడింపు రామశర్మ కాళ్ళ దగ్గరగా పెట్టుకున్న పేలపిండి కుండకి తగలడంతో అది ఎగిరి చావిడిలో పేర్చి ఉన్న కుండలపై పడింది.

ఇటు రామశర్మ కుండపగిలి పేలపిండి నేలపాలై మట్టిలో కలిసి పోయింది. అటు కుమ్మరి కుండలన్నీ కూడా పెద్దశబ్దం చేస్తూ ముక్కలు ముక్కలుగా పగిలిపోయాయి.

ఆ చప్పుడికి అప్పటిదాకా ఆలోచనలలో మునిగిపోయి ఉన్న రామశర్మ ఉలిక్కిపడి లేచి కొంతసేపటి తర్వాత కూర్చున్నాడు.

కుమ్మరి వచ్చి తన కుండలన్నీ పగిలిపోవడం చూసి బ్రాహ్మణుడి వద్దనుంచి కుండల ఖరీదు వసూలు చేశాడు.

ఇటు పేలపిండీ పోయి, అటు చేతిలో ఉన్న కొంచం పైకం కూడా పోయి దుఃఖించాడు రామశర్మ.

**నీతి** ఎప్పుడో ఏదో జరుగుతుందని పగటికలలుకంటూ చేతిలో ఉన్న దానిని కూడా పోగొట్టుకోకూడదు.

# క్విజ్ 17

01) భారతీయ వేదాంత దర్శనాలకు మూలసూత్రం? జ)..............................
02) భిన్నమంతా జగత్తులో ఉన్నా, చైతన్యంలో మాత్రం? జ)..............................
03) భగవంతునికి అత్యంత ప్రీతికరమైన మాసం? జ)..............................
04) మానవులు జీవితాన్ని చరితార్థం చేసుకునే పనులకు అనువైన సమయం? జ)..............................
05) విష్ణుచిత్తులవారికి గోదాదేవి ఎక్కడ దొరికింది? జ)..............................
06) ఆత్మారామునకు కనిపించిన ముని పేరు? జ)..............................
07) స్వామివారి పుష్కరిణిలో ఎన్ని తీర్థాలున్నాయి? జ)..............................
08) కార్తికేయుడు ఎంతమంది కృత్తికలచేత పెంచబడ్డాడు? జ)..............................
09) తారకాసురుని సోదరుని పేరు? జ)..............................
10) కావడికి ఉపయోగించే బద్దపేరు? జ)..............................
11) జయించటానికి వీలుకానిది? జ)..............................
12) దైవం నడయాడిన నేలగా ప్రణతులందుకుంది? జ)..............................
13) ధనుర్మాస శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి పేరు? జ)..............................
14) తిరువెళ్లియంగుడి స్వామివారి పేరు? జ)..............................
15) తిరువెళ్లియంగుడిలో గరుత్మంతుడు? జ)..............................
16) 'భగవద్గీత'లో అత్యంత ప్రముఖంగా చెప్పినటువంటి విషయం? జ)..............................
17) మానవ ఉన్నతికి 'భగవద్గీత'? జ)..............................
18) ఉచ్చారణ మాత్రంతోనే భక్తులకు విజయాన్ని అందించే కార్యసాధకుడు? జ)..............................
19) పరాశర సంహిత ఎవరిని దుష్టశిక్షణ, శిష్టరక్షకుడిగా పేర్కొనింది? జ)..............................
20) పెద్దవారైన వ్యక్తుల విషయంలో చేసే సేవకు గల పేరు? జ)..............................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-12-2023.**
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .............................. వయస్సు: ..............
పాఠశాల: .............................. తరగతి: ..............
పేరు: ..............................
చిరునామా: ..............................
..............................
..............................
.............................. పిన్‌కోడ్: ..............
ఫోన్ సంఖ్య: ..............................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

1. పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

2. కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

3. సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-


5. చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

6. చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
............................................ తేది : ..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 95



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)ధనుస్సంక్రమణం జరిగిన క్షణంనుంచి ఈ మాసం ప్రారంభమౌతుంది(5); 3)విశ్వవాఙ్మయానికి మూలగ్రంథం యొక్క జయంతి(5); 5)అష్టాదశపురాణాలను వ్రాసిన మహర్షి(3); 7)ఈ పురంలో పాండవులు బ్రాహ్మణ వేషధారులై భిక్షాటనం చేశారు(7); 9)ఆనందం(4); 10)సుగ్రీవుని భార్య(2) 13)కరుణ(2); 16)మార్గశిరమాసంలో జమదగ్ని కుమారుని జయంతి(2); 18)గోదాదేవికి సహకరించిన జంతువులు(3); 19)వరుణుని భార్య(4).

## నిలువు

1)మిథిలానగరమందలి ఒక బోయవాడు(5); 2)మార్గశిరశుద్ధ ఏకాదశికి ఏమని పేరు(7); 3)గృహము(2); 4)జయవిజయులలో నొకరు(3); 6)ఆస్తీకుని తండ్రి(5); 8)బ్రహ్మమానసపుత్రుడు(3); 9)కల్కి తండ్రి(5); 11)దనుజకశ్యపుల కుమారుడు(5); 12)కల్మాషపాదుని భార్య(4);14)నహుషుని కుమారుడు(2); 15)ఆండాళ్ తల్లికి గల మరియొక పేరు(4); 17)మధుకైటభులలో నొకడు(4).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

27-10-2023న తిరుపతిలోని తుడా ప్రాంగణం 'కచ్ఛపి' ఆడిటోరియంలో శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాల, తిరుపతి, కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ, న్యూ ఢిల్లీ మరియు అఖిల భారత ఆయుర్వేద మహాసమ్మేళన్, న్యూ ఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో 3 రోజులపాటు జరిగిన **"ఆయుర్వేద పర్వం-2023"** దృశ్యమాలిక.

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించిన తిరుమల తిరుపతి దేవస్థానముల సంయుక్త కార్యనిర్వహణాధికారిణి (వైద్య & విద్య) శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్. ఈ సందర్భంగా జే.ఈ.ఓ., తి.తి.దేవస్థానముల శ్రీ శ్రీనివాస ఆయుర్వేద ఫార్మసీవారు తయారు చేసిన "రుమాశాప్ పెయిన్ బామ్"ను ఆవిష్కరించారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ శ్రీ బిస్వజిత్ సింగ్, రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠమ్ అధ్యక్షులు డా॥దేవేందర్ త్రిగుణ, ఆయుష్ సలహాదారుడు డా॥మనోజ్ నేసారి, ఎన్.సి.ఐ.ఎం. ఛైర్మన్ డా॥జయంత్ డియో పూజారి, ఎస్.వి.ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డా॥ రేణుదీక్షిత్, అధ్యాపకులు డా॥విజయభాస్కర్ రెడ్డి, డా॥రమేష్ బాబు, డా॥నారప రెడ్డి, డా॥శ్రీహర్షలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
















SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Publised by Tirumala Tirupati Devasthanams printing 25-11-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

